ఆంధ్ర సచిత్ర వారపత్రిక



20-10-78

దసరా సంచిక

85 పైసలు


తొలిసారిగా విదేశంలో నిర్మించబడ్డ తెలుగు చిత్రం!
తిరుపతి పిక్చర్స్
సాహసవంతుడు
టాడేవో
ఈస్ట్మన్ కలర్
నిర్మాత
కె. విద్యాసాగర్ M.com.
దర్శకత్వం
కె. బాపయ్య
తారకరామ - జయలక్ష్మి - శ్రీ తారకరామ - బాబు పిక్చర్స్



ఎట్లా పాల్గొనాలి? 1. మీకు ఎంట్రీకూపను అవసరంలేదు.
2. ఒక కాగితంపై మీపేరు, చిరునామా ఇంగ్లీషులో స్పష్టంగా వ్రాసినచాలును. తరువాత 2 భాగములలో గల ప్రశ్నలకు మీ సమాధానాలు వ్రాయండి. 3వ భాగానికి ఆకర్షణీయమైన ఒక సూక్తి వాక్యమును వ్రాయండి.
3. ఈ క్రింది డిక్లరేషన్ నకలు తీసి దాని దిగువ సంతకంచేయండి "సైకిల్ బ్రాండ్ అగరబత్తి పోటీ నియమ నిబంధనలను చదివాను, వాటికి కట్టుబడి వుండగలను." (మీ సంతకం)
4. మీరు పంపే ప్రతి ఎంట్రీతోనూ సైకిల్ బ్రాండ్ అగరబత్తి రకములలో సైకిల్‌గుర్తుగల అట్టపెట్టె లేదా గొట్టము అవసర మవుతుంది. ఆ గుర్తులన్నిటినీ కత్తరించి ఆ అగరబత్తి పేరుకూడ వ్రాసి మీ సమాధాన పత్రంతో జతపరచ వలెను.
5. మీ ఎంట్రీలను మామూలు పోస్టుద్వారా మా అడ్వర్టయిజింగ్ ఏజెంట్లకు పంపండి. అడ్రసు: సైకిల్ బ్రాండ్ అగరబత్తి పోటీ, కేరాఫ్ ఎమ్. సి. అండ్ ఎ., పి. బి. 180, బెంగుళూరు—560052.

1 వ భాగం: పేరుగాంచిన సైకిల్ బ్రాండ్ అగరబత్తిల తయారీలో ఉపయోగించిన పరిమళములలో ఈ మూడు పుష్పముల సుగంధములు గలవు. దిగువ ఇవ్వబడిన అయిదింటిలో వాటిని గుర్తించండి.
మనోరంజితము; కమలము; మల్లె; గులాబి; నైట్—క్వీన్


ఉదాహరణ:
1. మనోరంజితము

2. . . .

3. . . .

2 వ భాగం: అగ్రశ్రేణి క్వాలిటీ అగరబత్తీలకు సైకిల్ గుర్తుగలదు. దానిని గురించి మీకు ఇంకా ఏమి తెలుసును?
1. మొదటి బైసికిల్ (చెక్కతో తయారైన) ను 1818లో కనిపెట్టిన దేశం—
—సిలోన్ —జపాన్ —ఫ్రాన్స్
2. 'బైసికిల్' అను పేరు రావడానికి గల కారణం—
—రెండు పెడల్స్ —రెండుబ్రేకులు —రెండుచక్రములు
3 వ భాగం: అమోఘంపైన సమాధానం ఏమిటి? 'సైకిల్ బ్రాండ్ అగరబత్తిలు' అను పదమును ఉపయోగించి 10 మాటలలో క్లుప్తమైన ఒక నినాద వాక్యమునువ్రాయండి.



నియమ నిబంధనలు: 1. సైకిల్ బ్రాండ్ అగరబత్తిల ఉత్పత్తిదారులకు చెందిన ఉద్యోగులు, (వారి కుటుంబ సభ్యులు) మరియు వారి అడ్వర్టయిజింగ ఏజెంట్లు ఈ పోటీలో పాల్గొనుటకు అర్హులుకారు
2. ఫలితములు ఈమాగజైను / వార్తాపత్రికలలో ప్రకటించబడును. విజేతలందరికి పోస్టు ద్వారా సమాచారము తెలియ జేయబడును.
3. న్యాయనిర్ణేతల తీర్పే తుది నిర్ణయం. ఈ విషయముపై ఎట్టి ఉత్తర ప్రత్యుత్తరములకు అస్కారము వుండదు.

ఎన్. ఆర్. వాసు-స్పెషల్ బత్తి; సైకిల్ బ్రాండ్—
సుగంధమల్లిక, రోజ్, లావెండర్, కస్తూరి,
ఎన్.టి.బత్తి; సైకిల్ అండ్ లాక్ బ్రాండ్-కేసరిబత్తి



మనోహరమైన సువాసనతు శ్రేష్ఠమైన బత్తీలు
27 రకములలో
క్వాలిటీ సైకిల్ బ్రాండ్ గుర్తుకై చూడండి.

MCA-NR-52 Tel

మనలో మాట

మా పాఠకులకు, రచయితలకు, కార్టూనిస్టులకు, ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు— అందరికీ మా దసరా శుభాకాంక్షలు!

* * *

ఈనాటి వనితాలోకం శీర్షికను యిప్పుడున్న వ్యాసాలు ప్రచురించిన తర్వాత నిలిపివేస్తున్నట్లు పోయినసారి సంచికలోనే తెలియజేశాము. కనుక మహిళలకు తమ వ్యాసాలను పంపించవద్దని మనవి చేస్తున్నాము. ★

ఉత్తరాలు

"సామాన్యుని సణుగుడు"

29-9-78 ఆ॥స॥ వారపత్రిక మామూలుగా పుటలు తిరగవేస్తున్నాను. అలవాటు ప్రకారం ముందుగా "రాగద్వేషాలు" సీరియల్ చదివాను చాల బాగుంది. శ్రీమతి మా॥ పుణ్యశీలా ప్రసాద్, గారు కూడా ఉత్తమ సాహితిని దృష్టిలో పెట్టుకు పాఠకులను తన కథలోని సాహిత్యమనే మధురిమను రుచిచూపిస్తున్నందుకు నా కృతజ్ఞతాభినందనలు.

వెనుక పుటలు త్రిప్పుతూ సా॥ సణుగుడు చదివాను పిరాజీగారు వ్రాసిన ధోరణి ప్రస్తుతం విద్యాలయాల్లో విహరిస్తున్న యీ విద్యార్థులు వింటారు. నన్ను అడిగితే ప్రతి విద్యాలయంలో యిలా ఉండటానికి కారణం, పూర్వం రాజకీయాలను నడిపేవాళ్లం; కాని ఇదొక మహమ్మారి లాంటిదిగా తయారై పోతున్నది. ప్రతి విద్యార్థి, దీని తాకిడికి లోనవుతున్నారు. ఒక్క మన భారత దేశంలోనేకాదు, ఇతర దేశాలలో కూడా. ఇంతగా ఇట్లాంటి అల్లర్లు నానాటికి పెరుగుతున్నా ప్రభుత్వం ఏ చర్య తీసుకోక పోవటం మన అ(దుర)దృష్టం, ప్రభుత్వాన్ని పలకరిస్తే, "చేస్తాం ఒక పరిశీలక బృందాన్ని" అంటుంది. అంతకు మినహా మన భావి భారత పౌరుల్లో మార్పురాదు. అయినా ప్రతిది ప్రభుత్వం మీద పెట్టడం మంచిదికాదు అని నా అభిప్రాయం. ప్రతీ విద్యార్థికి తెలుసు ఆ క్రమంలోనే క్రమం ఉందని, అట్లాంటప్పుడు ఎవరు చెప్పినా వినరు యీ యువకహృదయం. మన పిరాజీగారి యిట్లాంటి బోధనలు ప్రతి విద్యార్థి హృదయాలలో రగిలిననాడు మన భారత మాత శోభిల్లును.


ఇట్లాంటి చక్కటి విషయాలు అనేక మనః ఫలకాలపై పడేటట్లు చేయవలసిన బాధ్యత కలానిదే. (కవులదే) అందుకే కత్తికన్న కలం గొప్పది అన్నారు. అందుచేత ప్రతి విద్యార్థికి యీ మార్పు అవసరం. అన్యోన్యభావంతో మెలగాలి. ఐక్యత చేకూరాలి ఇట్లాంటి సుబోధకాలు చేసి మా విద్యార్థి లేత మనస్సులను బాగు చేయగలరని ఎదురుచూస్తా.

— చోళశ్రీ (వాల్తేరు)

బైస్కోప్ బాతాఖానీ

ఈ వారం "పిరాజీ"గారి బైస్కోప్ వెరైటీగా ఉంది. కథలు బాగున్నాయి. "వినాయక్" గారిపై కార్టూన్స్. "టాప్." సినీ నటుల జోక్స్ బాగున్నాయి.

పెన్మత్స సూరిబాబు, శంకర హనుమంత్‌రావ్ విజయశేఖర్ రెడ్డి. అద్దేపల్లి వెంకట్. శ్రీను. నాగబాబు, (హైదరాబాద్)



ముఖచిత్రం

నటి జయసుధ మరియు నటుడు కృష్ణంరాజుల ముఖచిత్రంతో వెలువడిన 6-10-78 నాటి ఆంధ్ర సచిత్ర వారపత్రికలో టి.వి.టి. గారి పేజీ [illegible]తో ఆకర్షించింది. సీరియల్ "రాగద్వేషాలు" సరికొత్త మలుపులు తిరుగుతూ, ముందు ఏం జరుగుతుందా అన్న ఉత్కంఠను మాలో కలిగిస్తూ, మరలా వచ్చే సంచిక ఎప్పుడు చదువుతామా అన్నట్లుగావుంది. కథలు, కార్టూన్లూ ఫర్వాలేదు.

గంటా ఉమాశంకర్ రెడ్డి, న్యాయపతి, రమేష్‌బాబు, కోటేశ్వర్ రెడ్డి, కమలారాణి రెడ్డి, కోట అరుణలు,

(బరంపురం)


* * *

జయసుధ, కృష్ణంరాజుల ముఖచిత్రంతో వెలువడిన ఈ వారం (6-10-78) పత్రిక చాల ఆకర్షణీయంగా ఉంది ముఖ్యంగా శ్రీమతి మాధవపెద్ది పుణ్యశీలా ప్రసాద్‌గారి "రాగద్వేషాలు" చాల బాగుంది.

ఎస్. ఎ. రహమాన్, (బరాల)

(66 వ పేజీ చూడండి)





ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938—1972]
శుక్రవారం : 20-10-'78
కాళయుక్తినామ సం. ఆశ్వయుజ బ. చవితి
సంపుటము 72 : సంచిక 6
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
పోస్టులో ఏడాది చందా రు. 41-60
ఆరు మాసాల చందా రు. 20-80
విడి ప్రతి వెల 85 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

సీరియల్

రాగద్వేషాలు

శ్రీమతి మాధవపెద్ది పుణ్యశీలాప్రసాద్

17

"అప్పుడు పేపరు ప్రకటనలిచ్చి పెట్టబడ్డాడు — ఆమె తండ్రి! వాటిల్లో కొన్నాళ్ళకి ఒకటి ఆయనకి నచ్చింది. కట్నం కానుకలు అక్కరలేదు. పిల్ల చక్కనిదైతే చాలు. కాస్త ఇంగ్లీషు మాట్లాడ గలిగి వుంటే చాలు — పెద్దగా చదువు కోక పోయినా ఫరవాలేదు — వరుడు అమెరికాలో డాక్టరు! వేలకు వేలు సంపాదిస్తున్నాడు! నెలో — రెండు నెలలో సెలవు పెట్టి వచ్చి పెళ్ళి చేసుకు పోతాడు. కులము శాఖ అన్నీ సరిపోయాయి. జాతకాలు కలిశాయి. పిల్ల వాడికి తండ్రి లేడు — తల్లి వుంది. ఒక్కడే కొడుకు. ఆడపిల్లలు లేరు. వచ్చి చూశారు. నచ్చిందన్నారు. వీళ్ళు వెంటనే గంతు వేశారు. మరి వీళ్ళ తాహతు కది పెద్ద సంబంధమే కదా?" శ్రీకర్ ఆపాడు.

"అప్పుడే ఎవరో చెప్పారుట గూడా మా నాన్నకి. ఇట్లా పేపర్లలో ప్రకటనలు చేసిన వాళ్ళని నమ్మగూడదు — ఏవో మోసాలుంటాయని, కానీ మా నాన్న విన లేదు. అది మామీద ఈర్ష్యతో చెప్తున్నారు అనుకున్నారు" అంది శ్రీలత.

"ఏదో అంటారే 'పోగాలము దాపించిన వారు దీప నిర్వాణ గంధమును — అరుంధతిని — మిత్రుల మాటలను — మూర్కొనరు — కనరు — వినరు' అని! ఆ సమయంలో ఎవరేం చెప్పినా చెవిటి వాడి ముందు శంఖం వూదినట్లే...!" అంటూ మళ్ళీ అందుకున్నాడు శ్రీకర్.

"సరే — అప్పు తెచ్చిన డబ్బుతో వీళ్ళు ఘనంగా జరిపించి చేశారు పెళ్ళి. పెళ్ళయి నాక అతడు కూడా ఆనంద్ లాగే ఒక నెల కలిసి వున్నాడేమో శ్రీలతతో — ఆ

(గత సంచిక తరువాయి)

తరవాత ఒక్కడే సెలవు లేదంటూ — తనని తరవాత రమ్మని చెప్పి వెళ్ళిపోయాడు అమెరికా —" ఇందిర కుతూహలంగా వింటోంది.

"ఆ తరువాత రోజులు — వారాలు — నెలలు — గడిచాయి! అతడి దగ్గిర్నించి ఉత్తరం గూడా లేదు — వెళ్ళినప్పటినించీ! వీళ్ళు ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబులేదు. టెలిగ్రాంలు ఇచ్చినా ఫలితం శూన్యం! ట్రంకాల్ చేసినా రిసీవు చేసుకోలేదు. సంగతులు తెలుసుకోడానికి దగ్గిరా — దాపా? అదీగాక వీళ్ళకా తాహతేది? కూటికి గతి లేని వాళ్ళు — విదేశాలకు ఎట్లా వెళ్ళ గలరు? అట్లా సంవత్సరం గడిచింది.

శ్రీలత కంటికీ — మంటికీ ఏకధారగా ఏడుస్తోంది! అప్పుడే మొగుడు వదిలేశాడనే పుకార్లు బయల్దేరాయి! ఆ సమయంలో ఎవరో తెలిసినవాళ్ళు అమెరికా వెళ్తున్నట్లు తెలిసింది. వాళ్ళ కాళ్ళూ — గడ్డాలూ పట్టుకుని వాళ్ళని బతిమాలి — అడ్రసు ఇచ్చి — అల్లుడి సంగతులు తెలుసుకుని రమ్మన్నారు. పాపం వాళ్ళూ కాదనలేదు. అసలు వీళ్ళకిక్కడ — అతడు — అక్కడ ఏమైపోయాడోనని ఆదుర్దా!

కానీ వాళ్ళు తిరిగి వచ్చి చెప్పిందేమంటే వాళ్ళు ఎన్ని రకాలుగానో అతడ్ని కలుసు కుందామని ప్రయత్నించారుట! అతడు దొరకలేదుట! అతడు కావాలనే వీళ్ళకి దొరకలేదుట! ముందు ఆఫీసు కి

జరిగినకథ 11: లక్షాధికారి హనుమంత రావుగారు వివాహమాడిన బెంగాలీ యువతి గీత, ఇందిరను కనిన కొంతకాలానికి మరణిస్తుంది. ఆయన అక్క సుగుణ తన కొడుకు ఫారిన్ రిటర్న్‌డ్‌ను ఇందిరకు యిచ్చుటకు ఆమె అత్త మామలు నిరాక రించారని ఉత్తరంలో విచారం వెలిబుచ్చుతుంది. ఇందిరను చేసుకునే విషయములో విశ్వనాథం వ్రాసిన ఉత్తరం హనుమంతరావుని గుండె పోటుకు గురిచేయగా, ఆయన కుమారుడు శ్రీకర్ వ్రాసిన ఉత్తరం ఊరట కల్గిస్తుంది. హనుమంతరావుగారు ఇందిరకి వేరే సంబంధాలు చూస్తుంటారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఆనంద్‌తో ఇందిరకు ఘనంగా వివాహం జరిపిస్తారు రావుగారు. కాపురానికి కావలసిన అన్ని వస్తువులూ ఇచ్చి, ఇందిరను అత్తవారింటికి పంపుతారు. దురదృష్టవశాత్తు తుఫాను బీభత్సంలో తల్లిదండ్రులను కోల్పోయిన అల్లుడ్నీ, కూతుర్నీ తనింటికి తెస్తారు రావుగారు. ఇందిర తండ్రిని ఒంటరిగా వదిలివేసి ఆనంద్‌తో అమెరికా వెళ్ళిపోతుంది. 'నాన్సీ' స్నేహితుని భార్య అని చెప్పి యిందిరను ఆమె యింటికి చేరుస్తాడు. నాన్సీ, ఆనంద్‌ల ప్రవర్తనను ఏవగించుకున్న ఇందిర, వేరే ఇల్లు చూపమని శ్రీకర్‌ని అర్థిస్తుంది. నాన్సీ తన భార్యేననీ, ఇందిర ఆమెకు ఊడిగం చేయక తప్పదని చెప్పిన ఆనంద్‌ను ద్వేషించి బయటికివచ్చేస్తుంది ఇందిర. శ్రీకర్ — ఇంటికి వచ్చిన ఇందిరకు, శ్రీలతతో తనకు ఎలా వివాహం జరిగిందీ వివరిస్తుంటాడు.

రమ్మన్నాడుట — చెప్పిన టైముకెళ్తే అక్కడ వుండేవాడు కాడుట! ఫలానా చోటకు వచ్చి కలుస్తానని రాలేదుట! కావాలనే ముఖం చాటు చేశాడుట! చివరికి ఇంటికి ఫోనుచేస్తే—ఇంట్లో కూడా అతడు ఫోను ఎత్తలేదుట! అతడి భార్య ఎత్తిందిట! అతడి భార్య ఎవరో తెలుసా? శ్రీలత కాదు — అమెరికన్ భార్య!

"నేను మిసెస్ నాథం —" అందిట. ఈయన ఆశ్చర్య పోయాడుట!

"మిసెస్ నాథం గురించి మాట్లాడా లనే ఫోన్ చేశాను—" అన్నాడుట ఈయన.

"నేనే మిసెస్ నాథంని! నా గురించి మాట్లాడడానికి మీరెవరు?" అందిట!

"నాథం ఇండియన్. ఆయనకి ఇండియాలో భార్య వుంది. ఆ సంగతి మీకు తెలుసా?" అన్నాట్ట ఈయన.

"నేనే నాథం భార్యని. మా కిద్దరు పిల్లలు కూడా!" అందిట!

ఈయ నేం మాట్లాడుతాడు ఇంక! సమస్య విడిపోయింది. సందేహం తీరి పోయింది. అతడి కంటకు ముందే పెళ్ళయింది—పిల్లలు!

ఇక్కడ శ్రీలతని మోసం చేశాడు—దగా చేశాడు. పిల్ల బీదతనాన్ని అనరాగా చేసుకుని ఆటలాడాడు. ఏమీ చెయ్యలేరని తెలుసు. తల్లి కళ్ళనీళ్ళు తుడవడానికి పెళ్ళి చేసుకున్నాడు. మోహం చాటు చేశాడు. అట్లాంటివాణ్ణి ఎవరేం చెయ్యగలరు?

శ్రీలత వివాహ జీవితం అక్కడితో ముగిసిపోయింది. ఆమె జీవితంలో దుఃఖమే మిగిలింది. తల్లిదండ్రులు తిట్లూ—శాప నార్థాలు ప్రారంభించారు. తమ్ముళ్ళు నిర్లక్ష్యం చేసేవారు. అవును. మరి పెళ్ళికి బోలెడు ఖర్చయింది! ఆ అప్పు యింకా తీర్చలేదు. ఈమె బతుకు బండలయింది. ఈ దుఃఖానికి కారకు లెవరైనా, ఎదురు గుండా కనబడుతున్నది శ్రీలత. ఆమెకి తిండికూడా పెట్టాలి, అదో ఖర్చు. అందు కని అందరికీ లోకువయింది శ్రీలత! ఇందులో ఈమె తప్పు ఆవంతయినా లేకపోయినా—శిక్ష మాత్రం ఈమెకు తప్పదు. ఉద్యోగం చేసుకు తన కాళ్ళమీద తను నిలబడదామన్నా చదువు లేదు! ఏ విధంగా చూసినా వాళ్ళ మీద ఆధారపడి బతకక తప్పదు. ఏం చేస్తుంది? ఆ చీదరింపులు భరిస్తూ— మాటలన్నీ పడుతూ ఇంటెడుచాకిరీ చేస్తూ రోజులు గడపసాగింది.

నేను ఆ సమయంలో మా అమ్మ వంట్లో బాగుండలేదని తెలిసి ఇండియ వచ్చాను. మా నాన్న పోయి కూడా ఏడ దయింది అప్పటికి. పెళ్ళిచేసుకోమని నన్ను పట్టుకుని ఏడ్చింది—మంచంలో వున్నఅమ్మ నేను కదిలిపోయాను. అమ్మ చాలా బ హీనంగా వుంది.

కానీ నాకు ఆదర్శవివాహం చేసుకోవాల పట్టుదల. అమ్మకి వంట్లో బాగా లే పోవడంవలన వంటమనిషిని పెట్టుకుంది ఆవిడ అమ్మకి అన్నివిధాలా సహాయంగ వుండేది. ఆవిడ ఎవరో కాదు—శ్రీలత తల్లి అమ్మతో శ్రీలత విషయాలన్నీ చెప్పుకుని-చెప్పుకుని ఏడ్చేది ఆవిడ!

శ్రీలత పెళ్ళయ్యాకే ఆవిడ తను వంటకి బయల్దేరింది. వంటచేసి అమ్మకి పెట్టి—తను తిని మిగిలింది యింటికి పట్టుకెళ్ళేది. మా యింటివల్లనే పిల్లలైనా కడుపునిండా తిండి తింటున్నారని చెప్పేది.

చాలా ఆత్మాభిమానం కలవాళ్ళు వాళ్ళు! మా ఇంట్లో ఏడాదిగా పనిచేస్తున్నా ఎప్పుడూ మా ఇంటి విషయాల్లో జోక్యం కలగజేసుకునేదికాదు వాళ్ళమ్మ. మాఅమ్మకి ఆవిడంటే చాలా అభిమానం. ఆవిడ ఏదడిగినా లేదనకుండా ఇచ్చేది.

నేను యింటికి వచ్చిన కొన్నాళ్ళకి—ఏవో ఇబ్బందులవలన వాళ్ళమ్మ బదులు శ్రీలత వంటకి వచ్చేది. అమ్మ పూర్తిగా మంచం పట్టడంతో వద్దన కూడా వంట మనిషి చెయ్యాల్సి వచ్చేది.

అమ్మ మాటల మధ్యలో నాకు శ్రీలత కథ చెప్పింది. ఆమె కథ విన్నాక— ఆమెని చూశాక నాకు ఎందుకో జాలి కలగసాగింది. కాని— శ్రీలత తలవంచుకుని తనపని తాను చేసుకుపోయేది. నేనూ నాలో తర్జన భర్జన చేసుకోవడం ప్రారంభించాను. ఆదర్శ వివాహం చేసుకుందా మనుకున్నాను. ఇది కూడా ఆదర్శమేకదా?

పాపం ఆమె జీవితం అట్లా భగ్నం కావల్సిందేనా? నేనెందుకామెను పెళ్ళి చేసుకో కూడదు? వాళ్ళ కుటుంబానికి సహాయం చేసినట్లూ అవుతుంది. నా ఆదర్శాన్ని నిలుపుకున్నట్లూ అవుతుంది. పెళ్ళి చేసుకో మన్న అమ్మ కోరికా తీరుతుంది. నాకు



మిమ్మల్ని చూసి వెళ్ళాక మరేపిల్లనూ పెళ్ళాడాలనిపించలేదు. అసలు చూడాలని కూడా అనిపించలేదు. కానీ శ్రీలతని ఆ స్థితిలో చూడగా... చూడగా... నాలో సంఘర్షణ మొదలయింది. నేను చెయ్యబోయేది మంచి పని. దానికి వెరవడం ఎందుకు? ముందు అమ్మాయిని అడిగి తను 'సరే'నంటే అమ్మని ఒప్పిద్దాం అనుకున్నాను.

శ్రీలతని అడిగితే—ఒక పిచ్చివాణ్ని చూసినట్టు చూసింది నన్ను! ఆ చూపు ఇప్పటికీ మర్చిపోలేను" చిలిపిగా చూశాడు శ్రీకర్ శ్రీలతవైపు.

ఆమె తల వంచుకుంది.

ఇందిర కళ్ళు చెమర్చాయి!

ఆ తరువాత ఏడ్చింది. "నా సంగతి తెలిసే ఈ నిర్ణయానికి వచ్చారా? నాకో పెళ్ళయింది!" అంది.

"అన్నీ తెలుసు నాకు. నీకిది ఇష్టమా— కాదా— చెప్పు! ఇష్టమైతే మీవాళ్ళనీ—మా అమ్మనీ ఒప్పించి నిన్ను చేసుకుంటాను— లేకపోతే ఏమీ జరగదు. ఇది నీ మధ్యా—నా మధ్యా వుండిపోతుంది— అంతే" అన్నాను.

"నేను మా తల్లిదండ్రులకు భారంగా వున్నాను. ఏమీ చెయ్యలేని నిస్సహాయస్థితి— ఈ సమయంలో మీరు చెయ్యందిస్తానంటే వద్దనేంత మూర్ఖురాల్ని కాదు. కానీ..."

"వర్ణించిన ఆదర్శాలు— పెళ్ళయ్యాక ఏమవుతాయోనని భయమా? ఆ భయం నీకక్కరలేదు. నేను నీకు ఎప్పుడూ అన్యాయం చెయ్యను. దానికి నా మనసే సాక్షి! నీకు మనస్ఫూర్తిగా ఇష్టమైతేనే ఈ పెళ్ళి జరుగుతుంది!..." అన్నాను.

సంకోచాలన్నీ వదిలి — అంగీకరించింది శ్రీలత — చివరికి! అమ్మ మొదట ఆశ్చర్యపోయింది.

"ఏం కర్మరా — ఇది." అని నుదురు కొట్టుకుంది. ఏడిచింది.

చివరికి సరేనక తప్పలేదు — ఆమెకి! నా పట్టుదల మొదట్నుంచీ తెలుసుగా — ఆమెకి! సరే — శ్రీలత తల్లిదండ్రులు మహద్భాగ్యంగా భావించారు — ఈ పెళ్ళికి నేను ఒప్పుకోవడం. కానీ కొద్దిగా భయపడ్డారు... "ఆమె మొదటి భర్త ఎప్పటికయినా తిరిగివచ్చి..." అన్నారు అర్థోక్తిలో ఆపేస్తూ!

"ఆ సంగతి నేను చూసుకుంటానన్నాను"

వాళ్ళు వెంటనే ఒప్పుకున్నారు. తిరుపతి కొండ మీద మా పెళ్ళి జరిగిపోయింది. తరవాత కొన్నాళ్ళకి ఇద్దరం కలిసి ఇక్కడికొచ్చాం. నా వరకు నేను చెప్పాలంటే — శ్రీలత నాకు అనుగుణంగా నడుచుకుంటోంది. తనని గురించి నాకే కంప్లెయింట్లూ లేవు.

మొదటే చెప్పానామెకి. 'కృతజ్ఞత— ఋణం— అనే మాటలు మన మధ్య రాకూడదని—' అంతే మానేసింది. "మరి నా మీద ఆమెకి ఏమన్నా కంప్లెయింట్లు వున్నాయేమో నాకు తెలీదు—" ఆపాడు శ్రీకర్.

"మీ అతి మంచితనమే అసలైన కంప్లెయింటు!" నవ్వింది మధురంగా శ్రీలత!

వింత ధన్యురాలు శ్రీలత! శ్రీకర్‌లాంటి భర్త ఏరికోరి చేసుకోవడం నిజంగా ఆమె అదృష్టమే! తనలో తను అనుకుంది ఇందిర. వాళ్ళనట్లాగే చూస్తూండిపోయింది!


* * *

"లతా భోజనాల ఏర్పాటు చూస్తున్నావా?" అడుగుతూ లోపలికి నడిచాడు శ్రీకర్.

"ఆ— వడ్డించడం అయింది. రా ఇందూ—" పిల్చింది శ్రీలత.

భోజనాలుచేస్తూండగా అన్నాడు శ్రీకర్ "విచిత్ర మేమిటో తెలుసా ఇందిరగారూ—

(47వ పేజీ చూడండి)



"స్లీ మై స్వీట్ బేబీ నౌ యూ నీడ్ నాట్ వర్రీ ఎబౌట్ యువర్ ఫ్యూచర్ అండ్ కెరీర్ నాటి విషయం నేను చూసుకుంటాను. నోడౌట్. నువ్వు వెల్ ట్రయిన్డ్ నర్సుగా బయటకు వెళ్తావు." జలజను దగ్గరకు లాక్కుంటూ అన్నాడు గుర్నాధం.

గుర్నాధం పట్టు విడిపించుకొని మంచం మీది నుంచి లేచి నిల్చుంది జలజ. బయటకు చూచింది.

డిమ్ లైట్ల మసక వెలుతురులో నిద్రపోతున్న హాస్పిటల్ వార్డులు...అంధకారపు దుప్పటిని కప్పుకొని గురకలాంటి హోరు పెడుతూ హాయిగా నిద్రపోతున్న సముద్రం... నిద్రపోతున్న అమ్మాయి నుదుటిపై చిందరవందరగ ఎగురుతున్న తల వెండ్రుకల్లా లేచి పడుతున్న కెరటాలు.. దూరంగా లేబర్ రూమ్ నుంచి వినిపిస్తున్న నెప్పుల పడే ఆడమనిషి గావుకేకలు...

"వస్తాను సార్ మరి నా మార్కుల సంగతి మరచిపోకండి"

"నో... నో... బేబీ, నీకా భయం అక్కర్లేదు...

గదిలోంచి బయటకు వచ్చింది జలజ. చలిగాలి జివ్వున తాకింది. వడివడిగా హాస్టల్ వైపు నడక సాగించింది. కుడి పక్క చీకటిలో మార్చురీ గది. ఆ గదిలో మంచు గడ్డల్లో నిద్రపోతున్న నిర్జీవ శరీరాలకు కాపలా కాస్తూ కునికి పాట్లు పడుతున్నాడు వాచ్‌మేన్. పరీక్షలు దగ్గర పడ్డాయి గబోలు. లేడీ మెడికోస్ హాస్టల్లోని గదులన్ని దేదీప్యమానంగా వెలుగుతున్నాయి.

నైట్ డ్యూటీ గాబోలు, ఫస్ట్‌యియర్ స్టూడెంట్ నర్సులు వార్డులకు వెళ్తున్నారు. తెల్లని గౌనులు ... తెల్లని కేప్‌లు... మల్లెపూలలా ... శాంతి కపోతాలలా ... నడిచిపోతున్నారు.

"హుం. ఈ తెల్లని యూనిఫారాల్లో ఉన్నవాళ్లు మామూలు అమ్మాయిలు కారు. సున్నం కొట్టిన సమాధులు, బాండేజ్ తెలుపుదనం వెనుక దాక్కున్న భయంకర గాయాలు వీళ్ల హృదయాలు. ఆ సమాధుల్లో కుళ్ళిన ఏముకలాంటి వ్యథలు. ఈ తెల్లని యూనిఫారాల వెనుక నుంచి వస్తున్న వినిపించని నిట్టూర్పులు, చెప్పుకోలేని కన్నీటి బాధలు. దయనీయ గాథలు. ఇవేవీ తెలుసుకోలేక, తెలియక ఊబిలో దిగబడినట్లు ఈ రొంపిలో అడుగు పెడుతున్నారు. ప్చ్. ఫైనలియర్‌కు రండి. అప్పుడు మీకూ తెలుస్తుంది ఇక్కడి లోటుపాట్లు...దాహపు చూపులు...కత్తెర బోనులు ... చట్టపు చట్రాలూ ..." నడుస్తున్న జలజ, వెళ్ళిపోతున్న జూనియర్స్ వైపు చూచి అనుకుంది మౌనంగా నిట్టూర్చింది.

హాస్టల్ మెట్లెక్కబోతూ తలెత్తి చూసింది. ఎదురుగా వున్న గోడ మీద పడుతుంది పోర్టికోలోని లైటు. గోడ మీద కొత్తగా రాసిన అక్షరాలు దీపం కాంతిలో కనిపిస్తున్నాయి.

"ఒరేయ్ ట్యూటర్లూ. నర్సింగ్ స్టూడెంట్లు పాసవ్వాలన్నా, వాళ్లకు మార్కులు పడాలన్నా వాళ్ళు మీ పక్కల్లోకి రావాలి. మరి మీ......"

ఎవడు రాసాడో గాని నా మనసులోని మాటనే, నేను గుర్నాధం దగ్గర ధైర్యం చేసి అనలేని మాటలనే రాసాడు అనుకుని చిన్నగా నవ్వుకుంది జలజ.

నర్సెస్ హాస్టలు గోడమీద, హాస్పిటలు గోడల మీదా అలాంటి రాతలు తరచు ప్రత్యక్షమౌతుంటాయి. వెంటనే వాటిని చెరిపించేసారు అధికారులు. అయినా మరి కొన్ని రోజుల్లో కొత్త స్లోగన్స్ వెలుస్తుంటాయి.

గది చేరి మంచం మీద చేరబడిన జలజకు నిద్దరాలేదు. ఆమె మనసు గతంలోనికి పరుగు తీసింది.

"అప్పటికి జలజకు ఆరేడేళ్ళ వయసుంటుంది. వాళ్ళమ్మ పురిటి కోసం హాస్పిటల్లో చేరింది. తల్లిని చూడ్డానికి ప్రతి దినం సాయంత్రం వేళ తండ్రితో వెళ్ళేది జలజ. తెల్లని బట్టలు తొడుక్కొని వార్డులలో అటూ ఇటూ తిరుగుతున్న నర్సులను కళ్ళింత చేసుకొని చూచేది. వాళ్ళతో నవ్వుతూ మాట్లాడేది. నిజానికి, కొత్తగా పుట్టిన తమ్ముణ్ణి గాని, హాస్పిటల్లో ఉన్న తల్లిని గాని చూడాలన్న ఆరాటం కన్న అవకీష్టమైన నర్సులను చూడాలన్న ఉబలాటంతోనే రోజూ హాస్పిటల్కు పోయేది. పెద్దైతే తానూ నర్సు ఉద్యోగం చెయ్యాలన్న కోరిక ఆమె పసి హృదయంలో అప్పుడే ఉదయించింది. అదేమిటోగాని తెల్లని బట్టలు తొడుక్కునే వాళ్ళంటే ఆమెకు పిచ్చి అభిమానం. అందుకే తండ్రిని పోరు పెట్టిమరీ కేథలిక్ కాన్వెంటులో చేరింది — పొడుగైన వైట్ గౌన్స్ తొడుక్కున్న టీచర్ల పాఠాలువినాలని. నాకు జ్వరం వస్తే ఎంత బాగుణ్ణు. ఎంచక్కా ఎన్నో రోజులు హాస్పిటల్లో నర్సులతో మాట్లాడుతూ కాలం గడిపెయ్యొచ్చు" అనుకొనేది.

ఆలోచనల నుంచి తేరుకునేసరికి ఎవరో ఒకమ్మాయి తన బాయ్ ఫ్రెండుకు గుడ్ నైట్ చెప్పి మెల్లగా తన రూమ్లోనికి జారుకుంది. ఎవడో అబ్బాయి ఆ అర్ధరాత్రి వేళ గోడఎక్కి ఏదో రూమ్లో నున్న అమ్మాయికు సైగలు చేస్తున్నాడు.

"ఛీ. ఛీ. మా బ్రతుకులు చివరకెలా తగలబడ్డాయో." అంటూ నిట్టూర్చింది జలజ.

ఒకసారి స్టాకింగ్స్ కొనుక్కోడానికి వెళ్ళినప్పుడు అక్కడ సేల్స్మాన్ అన్న మాటలు గుర్తొచ్చాయి.

"స్టాకింగ్స్ కావాలా? నర్సెస్ స్టాకింగ్స్?"

"అవును."

"మీరెన్నో ఇయర్?" స్టాకింగ్స్ చూపిస్తూ అడిగాడు సేల్స్మాన్.

"ఫైనలియర్"

"ఓ. ఫైనలియరా. మరి ఒంటరిగా వచ్చారేంటి? ఎవరూ తోడు రాలేదా?"

"వ్వాడ్డు యూ మీన్?"

"నో. నో. నథింగ్. ఏం లేదు. మీతో పాటు మీకో ట్రెయినీస్ ఎవరూ రాలేదా?" వెకిలిగా నవ్వుతూ సర్ది చెప్పుకున్నాడు.

మెట్లు దిగుతుంటే వెనుక నుంచి వినిపించిన వెకిలి నవ్వులు ఆమె చెవుల్లో గింగురు మన్నాయి.

"ఈ మెడికల్ లైనే ఇంత. ఇలా తగలబడి ఏడుస్తుంది. పాపం. ఏదో మానవసేవ చెయ్యాలని, ఏవేవో ఆశయాలతో, ఆశలతో వస్తారు ట్రెయినింగుకు అమ్మాయిలు. వాళ్ళకు ఎదురైన పరిస్థితులు వేరుగా ఉంటాయి. వార్డుల్లో ఉంటే డాక్టర్ల ఆకలిచూపులు...చావడానికి సిద్ధంగా ఉన్న పేషెంటు కూడా చెడిపోయిన వాళ్ళను చూచినట్లు చూస్తారు. తమకూ అవకాశం వస్తేనో అని అనుకుంటారు. ఎక్కడ చూసినా నిరసన, చిన్న చూపు. మార్కులు పడాలన్నా, ట్రెయినింగు సాఫీగా పూర్తవ్వాలన్నా ఇన్స్ట్రక్టర్ల 'కోరిక' తీర్చాలి. ఎదురుతిరిగి వెళ్ళిపోవాలంటే ముందరికాళ్ళకు బంధంలా బాండు. ప్రభుత్వానికి రాసిచ్చిన బాండు. కనీసం అమ్మాయిలకు ట్రెయినింగివ్వడానికి కేవలం ఆడవాళ్ళనే ఇన్స్ట్రక్టర్లుగా నియమించే ఉద్దేశ్యం ఎందుకు అధికార్లకు కలగలేదో? ఊ. ఏడుపంతా అరణ్యరోదన..." అని ఆలోచించి ఆలోచించి దుఃఖంతో నిద్రలోనికి జారుకుంది జలజ.

2

"అమ్మాయికి పెళ్ళి చెయ్యాలి. డిగ్రీ పాసయింది. పైగా ఉద్యోగం కూడా చేసుకుంటుంది. త్వరగా ఓ మంచి సంబంధం చూసి పెళ్ళి చేసెయ్యాలి." సిగరెట్టు పొగను రింగులుగా వదులుతూ ఆలోచిస్తున్నాడు గుర్నాథం.

"ట్రింగ్...ట్రింగ్..." ఫోన్ మోగింది. కూర్చున్నవాడు లేచి వెళ్ళి రిసీవర్ అందుకున్నాడు గుర్నాధం. అటు నుంచి స్త్రీ కంఠం వినిపించింది.

"హలో... హాస్పిటలేనా? గుర్నాథం గారిని పిలుస్తారా?"

"నేనే గుర్నాథం మాట్లాడుతున్నా. మీరెవరు?"

"మీ అమ్మాయి వర్క్ చేస్తున్న ఆఫీసు రిసెప్షనిస్టుని. మీ అమ్మాయికి చాలా సీరియస్‌గా ఉంది..."

"మా అమ్మాయికా? సీరియస్సా?... ఏమైంది?"

"ఉన్నట్టుండి కడుపు నొప్పి వచ్చింది. ఉండలు చుట్టుకుపోతుంది. మా మేనేజర్



ఇదేం? నాటకం!!

గారు నర్సింగ్ హోమ్‌లో ఎడ్మిట్ చేసారు..."

"ఏ నర్సింగ్ హోమ్?"

"......సారీ గాభరాలో కనుక్కోడం మరచిపోయాను. ఆ మేనేజర్‌గారు నర్సింగ్ హోమ్ నుంచి ఇప్పుడే తిరిగొచ్చారు. మీరు వెంటనే రండి. ఆయన మీకోసం ఎదురు చూస్తున్నారు. డైరెక్ట్‌గా ఆయన ఛాంబర్స్‌కు వచ్చేయండి. మిమ్మల్ని ఆయనే తీసుకెళ్తారు..."

"హలోవ్. హలోవ్..."

"......"నో రిప్లై. ఫోన్ క్లిక్‌మని డిస్‌కనెక్టయి పోయింది.

"ఒక్కగానొక్క కూతురు. నింతో ఆరోగ్యంగా ఉందే? ఇదేమిటి? అకస్మాత్తుగా కడుపు నొప్పి?" అతడి మనసులో పదేపదే అదే ప్రశ్న.

"బహుశా అపెండిసైటిస్ కావచ్చు." అతడి మెడికల్ మైండు జవాబిచ్చింది.

గబగబ రోడ్డు మీదకు వచ్చాడు. టాక్సీ కోసం అయిదు నిమిషాలు వెయిట్ చేసాడు. అంతలో వచ్చిందో టాక్సీ. అడ్రస్ చెప్పి పొమ్మన్నాడు.

* * *

నిశ్శబ్దంగా ఉంది ఆఫీస్ బిల్డింగ్. లిఫ్ట్ ఎక్కి అప్‌స్టైర్స్ చేరుకున్నాడు గుర్నాధం. మేనేజర్ రూమ్ వైపు వడివడిగా అడుగులు వేశాడు.

"ఛీ...దుర్మార్గుడా. బ్రూట్. నీకు సిగ్గులేదూ? మేనేజర్ వై యుండి ఇలాంటి నీచ పనికి పాల్పడుతావా? నీతిపి మాటల వెనుక ఇంతటి విషం దాగుందని తెలుసుకోలేకపోయాను. తెలిస్తే నీ రూమ్‌కే వచ్చుండే దాన్ని కాను..."

"యవ్వనంతో మిడిసిపడుతున్న అపురూప లావణ్య వారీ తిలకమా! యువర్ ఏంగర్ యిడ్స్ ఛార్మ్ టు యువర్ బ్యూటీ! ఓహ్... వండ్రఫుల్...మార్వలెస్... రోజు రోజుకూ నీ బ్యూటీ నా డ్యూటీనే మరిపింప చేసి నన్ను నాటీ బోయ్‌ని చేస్తుంది. స్నేక్ డోన్స్ మేక్ డిలే. కమ్. కమ్. టాగోర్ ఏమన్నాడో తెలుసా? ప్లక్ దిస్ ఫ్లవర్... డిలే ఇట్ నాట్ ... అన్నాడు. కమ్. అలా నిన్ను నన్నాహ్వానించు. కమ్, కోపరేట్ విత్‌మీ..." మేనేజర్ కన్నులు కైపుతో ఎరుపెక్కాయి. ఆకలిగొన్న సింహంలా లేడివంటి సునీత పై పడ్డాడు. ఆమె భయకంపితురాలై గడగడ వణికిపోతోంది. అతడి చేతిలో చిక్కిన పైట చెంగును లాక్కోడానికి విఫల ప్రయత్నం చేస్తోంది. దీనంగా మేనేజర్ని అర్థించింది, ప్రార్థించింది."

అప్పుడే ఆ గదిముందుకు వచ్చాడు గుర్నాధం. డోర్ గ్లాస్ గుండా లోపల జరుగుతున్న అఘాయిత్యం చూసాడు. ఆవేశంతో పిడికిళ్ళు బిగుసుకున్నాయి. పళ్ళు పటపట కొరుకుతూ తలుపుల్ని రేష్‌గా తోసుకొని గదిలోకి ఉరికాడు. తండ్రిని చూడగానే సునీత మేనేజర్ పట్టు విడిపించుకొని, బట్టలు సవరించుకొని బావురుమంది.

"ఒరేయ్...స్కౌండ్రల్. నువ్వు నిప్పుతో చెలగాట మాడుతున్నావురా ... నిన్నూ ... నిన్నూ..." గుర్నాధం చేతులు మేనేజర్ గొంతుపై బిగుసుకున్నాయి.

"వెల్‌డన్ మిస్టర్ మేనేజర్ ..." వెనుక నుంచి స్త్రీ కంఠస్వరం, చప్పట్లు కొట్టిన శబ్దం విని వెనక్కు తిరిగి చూసాడు గుర్నాధం.

"ఆఁ నువ్వా?!" మేనేజర్ పీకమీద నుంచి చేతులు తీసివేసాడు గుర్నాధం.

"అవును. నేనే" అంది ఆమె.

"ఏం? ఆగిపోయావ్? చంపు. నీ కసి తీరా చంపు ఆ మేనేజర్ని. కాని మిస్టర్ గుర్నాధం ఒక్క మాట విను. అతడ్ని చంపే ముందు నువ్వు మొదట ఆత్మహత్య చేసుకో!"

"జలజా! ఏమిటా మతిలేని మాటలు?" ఆయోమయంగా చూస్తూ అరిచాడు గుర్నాధం.

"మతిలేని మాటలు నావి కావు. అసలు మతిపోయింది నీకు. అసలు ఆ మేనేజర్ చేసిన దాంట్లో తప్పేముంది?"

"కనబడ్డంలేదా? అమాయకురాలైన నా కూతుర్ని వంచించాడు. అత్యాచారం చేయబోయాడు."

జలజ నవ్వింది. విరగబడి నవ్వింది.

"ఏం గుర్నాధం? నీ కూతురని బాధగా వుందా? పదేళ్ళు వెనక్కుపోయి చూడు. ఎందరు నీ చేతుల్లో నలిగిపోయారో! ఏం గుర్నాధం మాట్లాడవేం? నీ కూతురు దేవ

లోకంనుంచి దిగివచ్చింరా? వాళ్ళంతా కోరికలు తీర్చడానికి వచ్చిన అప్సరసలా? స్వంత కూతుర్ని ఎవడూ కన్నెత్తి చూడ కూడదు. పన్నెత్తి మాట్లాడకూడదు. కాని పరాయి ఆడాళ్ళందరూ నీకు కావాలి?! అధికారం, అవకాశం ఉంటే ఎవరైనా ఏదైనా చేస్తారు. ఆ రోజు ఆ అవకాశం నీకు వచ్చింది. ఈ రోజు ఆ అవకాశం మేనేజర్‌కు వచ్చింది..."

"జలజా!" కుప్ప కూలి పోయాడు గుర్నాధం!

"గుర్నాధం గారూ. మీ తప్పు మీకు తెలియచేసి మీకు కనువిప్పు కలిగించాలనే నేనీ నాటకం ఆడించాను. ఈ మేనేజర్ నా తమ్ముడు. ఆనాడు నేను బలి ఐనానంటే దానికి కారణం వీడి భవిష్యత్తే. మిమ్మల్నెదిరిస్తే నేనూ, నా తమ్ముడూ పేదరికంలో మ్రగ్గాలి. నాకు ఉద్యోగం లేకపోతే ఆకలితో మాడి చావాలి. వీడికి భవిష్యత్తు ఉండదు..."

"నా తప్పు ఒప్పుకోడానికి మాటలు రావడంలేదు జలజా..." గుర్నాధం సిగ్గుతో తల దించుకున్నాడు.

"మరో విషయం వింటే మీరు ఆశ్చర్య పోతారు. మురళీ, సునీతా ప్రేమించు కున్నారు. ఆ విషయం నాకు చెప్పాడు మురళి. నేను సునీతతో మాట్లాడాను. అప్పుడు తెలిసింది ఆమె మీ కూతురని. ఆమెతో నా కథ చెప్పాను. మీకు బుద్ధి చెప్పాలని మేం ముగ్గురం ఈ నాటక మాడాం."

గుర్నాధం మాట్లాడలేక పోయాడు. ఆనందంతో, పశ్చాత్తాపంతో, సిగ్గుతో కూడిన ఓ వింత అనుభూతి పొందాడు. కన్నకూతురి ముందే బైటపడ్డ తన అసలు రంగు. చిలకా గోరింకల్లా ఎదురుగా నవ్వుతూ నిల్చున్న మురళీ, సునీతలను ఆనందంగా చూసాడు.

అతడి కళ్ళ నుండి రెండు కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి. అవి ఆనంద భాష్పాలో, పశ్చాత్తాపపు కన్నీళ్ళో మరి!

విజయ గంధం

దసదా ద్దాదస దాసదా దసదసాదాద్దాసి దాద్దాసదా
దసపాప్పా దపపాగ పాప్పదపసా దాపాధగాగ్గాధపా
రిసగారి సరిగాగ్గపా గరిగ రీ్రి సాధ సాప్పా ధపా
దసరా మోహన రాగమ్మై విజయ గంధం బూయు కాకోక్తిలో
రసికుల్ మెచ్చగ వచ్చె నే డదిగో పారావార శ్రీరాపియై

— ప్రతికంఠం జగన్ మోహన్ రాజు.


ఫాలాక్షుని డైరీ

అనిమేషుడా !

అమరావతి జిల్లా ఖ్యాల్‌పూరు విదర్భ మిల్సులో స్పిన్నింగ్ మాష్టరుగా వున్న ఆర్య స్వామి అనే ఆయన తానుగత 34 ఏళ్ళలో జీవితం ఒక్కక్షణం కూడా నిద్రపోలేదని, తన కెన్నడూ అస్సలు నిద్రగానీ, ఆ నిద్ర లేనందు వల్ల అలసటగానీ రాలేదని అన్నారట.

పలుకుబడి ప్రభావం !

న్యూఢిల్లీలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సర్జనుగా పనిచేస్తున్న వో పెద్ద హోదాలోవున్న డాక్టరుగారికి "కలర్ బ్లయిండ్ నెస్" వున్నదట. రంగులు తెలీని విధంలో కంటి చూపు (అని అనచ్చు) వున్న యీయన తన పలుకుబడితోనూ, కేంద్రంతో తన దోస్తీవల్లనూ యీ పదవిలో వున్నారట. ఆశ్చర్యమేమీ లేదు–నాచురల్!



పోలిక కోసం జడ్జిగారిని కొరికిన ఆడ వకీలు !

కొలంబియాలో ఓ జడ్జిగారు వో "బలాత్కారం" కేసుని విచారిస్తూ బోనులో నిలుచున్న వ్యక్తి నిర్యుంగా ఫలానా అమ్మాయిని బలాత్కారం చేశాడా లేదా అన్నదానికి సరియైన ఆధారాలు అతకక తికమక పడుతున్నారట. నిందితుడు తన భుజంమీదున్నగాయం ఆ ఫలానా అమ్మాయి కరిచినదిగాదనీ, తాను బంతి ఆటలో తగుల్చుకున్నదనీ వాదించాడట. పక్కనేకూర్చుని వింటున్న వో ఆడ వకీలుగారు రివ్వున వెళ్ళి జడ్జిగారి భుజం అమాంతంగా కరిచి, ఆగాయానికీ, నిందితుని గాయానికి పోలికలు చూపించి "మిలార్డ్ ఇతడు నిర్యుంగా అపరాధి" అన్నదట. జడ్జిగారు మంట పెడుతున్న తన గాయాన్ని చూసుకుంటూ అవునవునన్నారట.

ఒరిస్సాలో పావురాళ్ళ టపా !

నాటికేగాక నేటికూడా ఉత్తరాలు చేరవెయ్యడంలో పావురాళ్ళను జనులు నమ్మడమేగాక, వాటిమీద ఆధారపడుతూనే వున్నారుకూడా. ఒరిస్సాలో 1977లో పావురాళ్ళు వో తొమ్మిది వేల ఉత్తరాలను బట్వాడా చేశాయట ఈరాష్ట్రాధికారంలో పన్నెండొందలకిపైగా పావురాళ్ళు యీ పనికోసం వున్నాయట.

నేను మేసిన కంచె

ఖ్వాజ్‌పూరు అనే గ్రామానికి చెందిన వో హరిజన యువతిని ఓ యువకుడు బలాత్కరించాడని కొంతమంది హరిజనులు దగ్గర్లోని పోలీస్టేషనుకు రిపోర్టిస్తే ఓ పోలీసు సబిన్‌స్పెక్టరుగారు విచారణకు వెళ్ళి ఆ హరిజన కన్యను చూసి, జాలిపడి, మోజుపడి తానూ అదే పని మరింత సౌకర్యంగా చేసి చక్కావచ్చాడట.

మైకుకి అనుమతి యివ్వడానికి !

ఒంగోలులోని వో ఎగ్జిబిషనులో స్టాలు పెట్టుకున్న ఒక వ్యాపారిమైకునుపయోగించడానికి అనుమతినివ్వడానికి ఒంగోలుసబ్ డివిజనుడెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఎ.ఎస్. ప్రభాకర రావుగారు ఆ వ్యాపారి వద్దనుంచి వో అయిదొందలరూపాయలు, రెండు ప్యాంటు గుడ్డలు, రెండు షర్టు గుడ్డలు, పూరీలు వొత్తుకునే మిషన్లు మూడు లంచంగా తీసుకున్నారట. పంచి పెట్టు కాదు;

పార్సిల్‌లో పసివాని శవం !


షాజ్‌పూరులోని వో హనుమంతుని దేవాలయంకు ఆగస్టు పదిహేనో తేదీన వో నైవేద్యమొచ్చిందట. ఏవిటా అని విప్పిచూస్తే అదో పసిపిల్లాడి శవమట. డాక్టర్లు పరిశీలించిన మీదట ఆ పసిపిల్లాడు సజీవంగానే ప్యాక్ చేయబడ్డాడనీ, ఊపిరాడక చనిపోయాడనీ తేలిందట.


ప్రేమ యాత్రకు రాకపోతే...!

సాగర్‌కు చెందిన జాంబూర్ అనే వో గ్రామంలో కొత్తగా పెళ్ళయిన ఒకతను తన భార్య తనతో ప్రేమయాత్రకు రానంగీకరించలేదనే కోపంతో ఆమె తలగొరిగి, బోడిగుండు చేసేశాడట. ఫలితంగా ఆమె యీ విషయం పోలీసువారికి ఫిర్యాదు చేస్తే వారొచ్చి అతన్ని అరెస్టుచేసి చక్కాపోయారట. వార్నీ అసాధ్యుడా!

ఆటో డ్రైవర్లూ ! జాగ్రత్త !!

బెంగుళూరులో మొన్న ఒకటో తేదీ రాత్రి తొమ్మిది గంటలకు సంపిగి రోడ్డు ప్రాంతంలో వో పెద్దమనిషి ఓ ఆటోరిక్షాను ఆపి, దేవయ్యా పార్కు అనేచోటుకు రమ్మనమన్నాడట. ఆటో వ్యక్తి తానాప్రక్కకు రాలేనన్నాడట. దాంతో మాటామాటా పెరిగి "ఏన్ మాస్త్రీరా" అంటూ ఆటోవ్యక్తి తన వాహనం దిగాడట. ఈ అదను చూసిన ఆ పాంథుడు అతన్ని వో నెట్టునెట్టి ఆటోలో ఎక్కి స్టార్టుచేసుకుని వెళ్ళిపోయాడట– వార్నీ!





సుంద్రరామయ్యగార్కి ఒక్కతేకూతురు, పేరు లలిత. పేరుతగ్గట్టే చాలా అందంగా, లలితంగా వుంటుంది. ఆమెకి పెళ్ళీడు వచ్చినదగ్గిరనించి ఆయనికి దిగులు, బెంగ ఎక్కువైనాయి. ఆయన దిగులు, కూతురు పెళ్ళి చెయ్యలేక కాదు, రాబోయే అల్లుడిని గూర్చి. ఇంత అవస్థపడి ఎంతో డబ్బు ఖర్చుపెట్టి కూతురు సుఖ పడుతుందని పెళ్ళిచేస్తే, తీరా వచ్చిన అల్లుడు మొండి, తలతిక్కవాడు అయితే? కూతురు భవిష్యత్తేమిటి? దాన్ని చూస్తూ తను బతగ్గలడా? అందులో ఆయన స్నేహితులు ఈ మధ్య ఒకళ్ళిద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేసి అల్లుళ్ళతో ఎంతెంత అవస్థపడుతున్నారో కళ్ళారాచూసి, మళ్ళీ తను గూడా చూస్తూ చూస్తూ రొచ్చులోకి దిగలేదు.

ఆ రోజు సుందరామయ్యగారు తీరుబడిగా వసారాలో కూర్చుని ఇదేవిషయం గూర్చి చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

'కాబట్టి బయట సంబంధాల కోసం పరుగులెత్తటం అన్నది అర్థంలేని పని—కష్టాలని కొనితెచ్చుకున్నట్లే! అయినా తనకేం తక్కువ? ఇద్దరు రత్నాల్లాంటి మేనల్లుళ్ళుండగా! ఇద్దరూ మెరికల్లాంటి కుర్రాళ్ళు, బుద్ధిమంతులు, మంచి వుద్యోగాల్లోవున్నారు—అన్నిటికన్నా తనంటే వాళ్ళకి ఎంతో భక్తి, గౌరవం—తనమాట కాదనరన్న ధైర్యం తనకుంది. కాని వచ్చిన చిక్కల్లా ఇద్దరు చెల్లెళ్ళతోనే! తనకి చెల్లెళ్ళంటే ఎంత ప్రేమో, వాళ్ళకి అంతకన్నా రెట్టింపు గౌరవం తనంటే! లలితని వాళ్ళిద్దరూ, ఎవరికి వారు తమ కోడల్ని చేసుకోవాలన్న వుద్దేశ్యంతో వున్నట్లు చూచాయగా తెలిసింది. మరి అటువంటప్పుడు కూతుర్ని ఏ మేనల్లుడికని ఇవ్వటం? అంటే రెండో వారితో కోరి విరోధం తెచ్చుకున్నట్లే గదా! ఇవన్నీకుదరవన్న వుద్దేశ్యంతోనూ కోరి చెల్లెళ్ళతో విరోధంతెచ్చుకోవటం ఇష్టంలేక కొన్ని బయట సంబంధాలు చూసినమాట వాస్తవమే. కాని వాటితో పూర్తిగా సంతృప్తి చెందలేకపోయారు. అదీకాక సమకాలిక అల్లుళ్లని చూస్తుంటె వొళ్ళు జలదరించి, ఆ ప్రయత్నానికి స్వస్తి చెప్పి; తిరిగి మేనల్లుళ్ల వద్దకే రావల్సి వచ్చింది. కాని ఎవరికి? అన్న ప్రశ్న మాత్రం అలాగె వుండిపోతోంది.'

సుందరామయ్యగారు, వసారాలో అసహనంగా కదిలి, తిరిగి సర్దుకు కూర్చుని, సిగరెట్ తీసి వెలిగించి మళ్లీ ఆలోచనలో పడ్డారు.

'ఈ సమస్యని పరిష్కరిస్తుందేమో నన్న ఆశతో భార్యని అడిగి చూసారు. బయట సంబంధాలకన్న, ఆయిన వాళ్ళకి ఇవ్వటమే వుత్తమం అన్న విషయంలో ఏకాభిప్రాయం కుదిరిందిగాని, అసలు విషయం—అదే ఎవరికి-అన్నదిమాత్రం, 'మీ ఇష్టం' అని భార్య తెలివిగా తప్పుకోనటంతో— అక్కడే ఆగిపోయింది. చివరికి కూతుర్ని గూడా అడిగారు. ఆమె మొదట సమాధానం చెప్పలేదు. మళ్ళీ ఆయన తరిచి తరిచి అడగ్గా, 'మీ ఇష్టం నాన్నా, నా మంచిచెడ్డలు మీకన్నా నాకెక్కువ తెల్సా' అని అన్నప్పుడు ఆయన కళ్ళు ఆనందంతో చెమర్చాయిగాని; అసలు విషయానికి పరిష్కారం దొరకలేదు

సుందరామయ్యగారు ఆలోచించి ఆలోచించి, చివరికి ఒకనిర్ణయానికొచ్చారు. మహత్తరమైన పథకం వేసారు. అదే స్వయంవరం.

ఉగాది పండగనాడు చెల్లెళ్ళని, మేనల్లుళ్ళని భోజనానికి పిల్చారు. ఆ రోజు భోజనాలయ్యాక, ఆడవాళ్ళు వంట ఇంట్లో అంట్లుకంచాల ముందు కూర్చుని కబుర్లలో పడితే, సుందరామయ్యగారు మేనల్లుళ్ళిద్దర్ని ఎదురుగా కూర్చోబెట్టుకుని అసలు విషయం కదిపారు.

"... ...అబ్బాయిలూ, అదీ విషయం. నాకు తెల్సు మీ రిద్దరికి లలితంటె ఇష్టం అని, అలాగే, నాక్కూడా మీరిద్దరూ సమానమే. నాకున్నది ఒక్కతే కూతురు. కాబట్టి లలితని మీ రిద్దరిలో ఎవ్వరికివ్వాలన్న విషయంపై తర్జన భర్జన జరిపి, చివరికి ఒక నిర్ణయాని కొచ్చాను."

ఇద్దరు మేనల్లుళ్ళు, రామం, మూర్తి మామయ్యవైపు ఆదుర్దాగా చూసారు.

సుందరామయ్యగారు ముచ్చటగా ఇద్దరివైపు చూసి, "కాబట్టి లలితని ఎవరు చేసుకుంటారో మీరే తేల్చుకోవాలి" అన్నాడు.

వారిద్దరూ తెల్లబోయి ఒకరి మొఖం ఒకరు చూసుకున్నారు.

"కంగారు పడకండి. నాకు తెల్సు మీక్కూడా ఆదంత సామాన్యమైన విషయం కాదని; అందుకే మీరిద్దరికి ఒకచిన్న పరీక్ష పెడతా. అందులో నెగ్గిన వాళ్ళు లలితని వివాహం చేసుకోవటానికి అర్హులు" అని

స్వ యం వ రం

ఇద్దరి భావాల్ని జాగ్రత్తగా గమనించడం మొదలెట్టారు.

కాని వాళ్లిద్దరికి ఆయన పెట్టబోయే పరీక్ష ఏటువంటిదో అర్థం కాలేదు. శివ ధనుర్భంగం చెయ్యాలా— మత్స్యయంత్రం కొట్టాలా? లేక పంచదార కార్డు తెచ్చి పెట్టాలా? అసలు విషయం ఎంత ఆలోచించినా బొత్తిగా అర్థం కాలేదు.

సుందరరామయ్యగారు అయిదు నిమిషాలు వ్యవధిచ్చి, "పరీక్ష అంటే కంగారు పడకండి, ఏం లేదు— నేను ఒక కథ చెబుతా. పూర్తిగా విని, నేనడిగిన ప్రశ్నకి, నాకు సంతృప్తి కలిగేలా సమాధానం ఎవరు చెబుతారో వారు విజేత...... కాని ఒక విషయం మాత్రం గుర్తుంచుకోండి— ఎవరు గెల్చినా, రెండవ వారు 'స్పోర్టివ్'గా తీసుకోవాలి— నాకిద్దరూ సమానమే అని ముందే చెప్పాను. ఆలోచించుకోండి" అని సిగరెట్ వెలిగించి ఇద్దరివంక చూసారు, ఆశగా.

"సరే! చెప్పండి!" అన్నారిద్దరూ ఏంతో వుత్సాహంగా.

సుందరరామయ్యగారు "స్వయంవరం" కథ మొదలెట్టారు.

* * *

వివాహం కాక పూర్వం మాధవరావు రాబోయే భార్యగూర్చి ఎప్పుడూ ఆలోచించలేదు. తనకు రాబోయే భార్య ఇలా వుండాలి, అలా వుండాలని ఆంక్షలు పెట్టుకోలేదు, గిరి గీసుకోలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే అతడికి వివాహ వ్యవస్థ మీద, దాంపత్య జీవితం మీద అప్పటిదాకా స్థూలమైన అభిప్రాయాల్లేవు. అదే సునంద పాలిట పెద్ద శాపం అయింది.

మాధవరావు చదువు పూర్తి చేసాడు, ఒక వుద్యోగం కూడా సంపాదించాడు. తల్లి తండ్రి సంబంధం చూసి, 'మాకు నచ్చిందిరా నీ మాటేమిటి?' అన్నప్పుడు, పిల్లని గూడా చూడకుండా, కనీసం ఆమె గూర్చి తెలుసుకోకుండా 'ఓ.కె' అనేసాడు.

సునంద, మాధవరావుల వివాహం జరిగిపోయింది. పెళ్లిలో మిత్రులు, "నీకేరా అదృష్టవంతుడివి, వుద్యోగం చేసే భార్యని సంపాదించావ్" అని అన్నప్పుడు మాధవరావు 'థాంక్స్' అనకపోగా మొహం మాడ్చుకున్నాడు. అది చూసిన మిత్రులు మళ్లీ కిక్కురు మనలేదు!

ఇక్కడ సునంద గూర్చి రెండు మాటలు చెప్పటం ఎంతైనా అవసరం. ఆమె మూరు పైసల ఈ కాలపు పిల్ల. కంచు కాగడా వేసి వెతికినా ఆమెలో పాత చింతకాయ పచ్చడి తాలుకు చాదస్తాలు కనబడవు. ఆమెకి ఏవో ఆదర్శాలున్నాయి, నమ్మకాలున్నాయి, అంతకుమించి ఆశలున్నాయి. ఆమె గూడా వుద్యోగస్థురాలు కావటంతో ఆర్థిక స్వాతంత్ర్యంతో బాటు, ఆమె భావాల్ని నిర్భయంగా చెప్పగలిగే ధైర్యాన్ని గూడా సంపాదించింది.

వాళ్ల దాంపత్య జీవితం ఒక ఏడాది మామూలుగానే సాగిందని చెప్పాలి.

మాధవరావు మొదటి నించి, అంటే చిన్నతనం నించి మహా మొండి మనిషి. తన మాటే నెగ్గాలంటాడు. బొత్తిగా పట్టువిడుపులు లేని మనిషి. అది సునందకి సుతరాము గిట్టదు.

చిన్నచిన్న విషయాల్లో గూడా పెద్దది చేసి రభస చేస్తూ వుంటాడు. సునందకి అతడిలో నచ్చని విషయాల్లో ఇది గూడా ఒకటి.

"సునందా, సునందా!" గావుకేక పెట్టాడు ఒకరోజు.

ఇంట్లో పని చేసుకుంటున్న సునంద, మళ్లీ ఏదో కొంప మునిగిందని "ఏమిటండి" విసుగ్గా అంటూ వచ్చింది.

"ఈ చొక్కాకి గుండీలు కుట్టమని చెప్పానా? మరి కుట్టలేదే?" గర్జించి అడిగాడు.

"రాత్రేగా చెప్పారు. అట్లా వదిలి ఇంకో చొక్కా తొడుక్కెళ్ళండి. సాయంత్రం కుడతా" అంటూ పోబోయింది.

"ఓహో! ఆ సంగతి నాకు తెల్సులే! అయినా నువ్వు వుద్యోగస్థురాలివి కదూ — మొగుడి చొక్కాకి గుండీలు కుట్టటం నామోషీ అని చెప్పరాదూ! వెళ్ళు, వెళ్ళు నే కుట్టుకుంటాలే" అన్న మాధవరావు ఈసడింపుతో ఆగి,

"మాటి మాటికి నా వుద్యోగం సంగతి ఎత్తుతారెందుకు? అంత వుబలాటంగా వుంటే కుట్టుకోండి" అని లోనికెళ్ళిపోయింది.

మాధవరావు కడుపు భగ్గుమంది!

మాధవరావుది విచిత్రమైన తత్వం. అతడిని అడిగి తప్పు చేసినా చెప్పకుండా డేమోగాని, అడక్కుండా బ్రహ్మాండమైన పని సాధించినా తిట్టిపోస్తాడు!

అది సునందకి నచ్చదు. ప్రతి విషయానికి అనుమతితీసుకోటానికి నాకు వ్యక్తిత్వం లేకనా? అతడి ఇష్టానికి అనుగుణంగ నెందుకు మారాలి?

ఒకరోజు రాత్రి భోజనాలయ్యాక మాధవరావు పేపరు చదువుకుంటూ కూర్చున్నాడు.

ఇంటిపని ముగించుకొని వచ్చిన సునంద, భర్తకి ఎదురుగా కూర్చుని "ఏనండీ" అంటూ పిల్చింది నెమ్మదిగ. "చెప్పు" అన్నట్టు చెప్పదలిచిన విషయానికి నాందీగ "ఊ" అంట పేపర్లోంచే మూలిగాడు— మాధవరావు!

"మా ఆఫీసులో హౌసింగ్ సొసైటీ ఒకటుంది వాళ్ళు స్థలాలు అమ్ముతున్నారు ఒక్క మెంబరుకి ఖాళీ వుందంటే చేరాను" అంది మెల్లిగా.

"నాకు చెప్పకుండా ఎందుకు చేరావ్?" ఠక్కున వచ్చింది ప్రశ్న.

"ఇవాళే ఆఖరిరోజట. అదీకాక కాంపిటీషన్‌గా వుంది. అందుకని సరే అనేశాను" కరుగ్గా సమాధాన మిచ్చింది.

"మొగుడంటూ ఒకడున్నాడు— వాడితో గూడా సంప్రదించాలి— అతడి అనుమతి తీసుకోవాలి అన్న జ్ఞానం లేకుండా పోయిందన్నమాట? అవునే. నీలా వుంటుంది— నీకో వ్యక్తిత్వం ఏడ్చిందిగా, అందులో ఉద్యోగస్తురాలివి" పేపరుమ కసిగా వేలకేసి కొడుతూ అన్నాడు.

"ఏవిటండి మీ రాద్ధాంతం మీరూనూ— ఇప్పుడు ఏమైందని? స్థలం కొనాలని అనుకోవటం తప్పా? మీతో సంప్రదించే సమయం లేక సరే అన్నాను— అందులో నాకేం తప్పుకనిపించటంలేదు" తీర్పు ఇస్తున్నట్టుగా చాలా ఈజీగా అన్నది.

"సంపాదిస్తున్నానన్న అహంతో కళ్ళు మూసుకుపోయిన నీకు ఏదీ తప్పుగా కన్పించదు. అయినా ఇప్పుడు స్థలానికొచ్చిన తొందరేంలేదుగాని రేపు చేరనని చెప్పెయ్యి" ఎలాగైనా ఆమెమీద తన ఆధిక్యత చూపెట్టాలని అతడి తాపత్రయం.

"క్షమించండి. మాటిచ్చి కాదనలేను. వాళ్ళముందు తప్పు చేసినదానిలా నిలబడలేను, సారీ" అంటూ చటుక్కున లేచి లోపలికెళ్ళింది.

మాధవరావుకి శరీరంలోని మాంసం వుడికిపోయింది. ఎంత పొగరు? తన మాటంటే భొత్తిగా లక్ష్యం లేకుండా పోయింది చూస్తే దీని సంగతేమిటో! అని బుసలు కొట్టాడు.

వారు ఆ విషయంలో రాజీ పడలేదు. వ్యక్తిత్వాలు తలెత్తాయి. వారిద్దరి మధ్య భార్యాభర్తల నడుమ ఉండాల్సినవన్నీ రద్దయినాయి. సునంద భర్తని శాంత పరుద్దామన్న ప్రయత్నం కూడా చెయ్యలేదు. అది మాధవరావుకి మరింత కోపం తెప్పించింది. ఆమె వుద్దేశ్యం తను తప్పు చెయ్యనంతవరకు ఎవరికి తలవంచి బ్రతకక్కరలేదు— చివరికి భర్తకు గూడా!

అలా కొన్నాళ్ళు గడిచాయి — భారంగా బాధగా—ఇద్దరికీనూ.

స్వయంవరం

ఒకరోజు మాధవరావు ఇంటికొచ్చేసరికి సునంద ఇంకా ఆఫీసు నుంచి రాలేదు. మామూలుగా అతడొచ్చేసరికి, అప్పటికే ఆమె వచ్చేసి, వంటపనిలో వుంటుంది. కాని ఆరోజు ఇంకా ఆమె రాలేదు.

విసుగ్గా తన వద్దనున్న తాళం చెవితో తలుపు తీసి, బట్టలు మార్చుకుని పేపరు ముందేసుకుని. సునంద కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

ఆరున్నరకి అలా కూర్చున్న వాడు, తొమ్మిదింటివరకూ అలాగే కూర్చుండిపోయాడు.

కాని సునంద మాత్రం రాలేదు.

మాధవరావులో క్షణ క్షణానికి కోపం, అసహనం, ఉధృతం కాసాగాయి. అప్పటికి వారిద్దరిమధ్య సన్నిహిత సంబంధాలు లేకపోవటంతో, ఆమె ని సాధించటానికి, గెల్చటానికి ఇదొక సాకుగా మార్చుకుని, ప్రళయకాల రుద్రుడిలా, ఆమెకోసంఎదురు చూస్తూ కూర్చున్నాడు.

కాని ఆమె ఇంకా రాలేదు. ఇంతలో ఒక అపరిచిత వ్యక్తి, టిక్కు టిక్కుమంటూ వచ్చి, "సునందగారిల్లు — ఇదేనాండి ?" అని అడిగాడు.

"ఇది మాధవరావు ఇల్లు —అంటె నా యిల్లు తమరెవరు ?" కోపం ఎవరిమీద చూపాలో అర్థంకాక సతమత మౌతున్న మాధవరావు ఆ వ్యక్తిమీద విరుచుకు పడ్డాడు.

"మీరు—ఆమె భర్తేనాండి" అర్థంకాక అడిగాడు.

"ఆమెకి భర్తని కాదు—బంట్రోతుని— ఇంతకీ తమకేం కావాలి ?"

"స్నేహితురాలి భర్తకి స్కూటరు యాక్సిడెంటయింది-సునందగారు ఫ్రెండ్‌తో పాటు హాస్పిటల్లో వున్నారు — మీకు చెప్పమన్నారు" అసలు విషయం మెల్లిగా బయట పెట్టాడు.

"ఇంతకీ తమరెవరు ?" వ్యంగ్యంతో కూడిన ప్రశ్న.

"నేను సునందగారి ఆఫీసులో పనిచేస్తాను. మా యిల్లు ఇక్కడికి దగ్గర్లోనే"

"తమరిక శలవు తీసుకోవచ్చు" పళ్ళు

కిటకిట లాడిస్తూ అన్నాడు.

ఆ అపరిచిత వ్యక్తి మాధవరావుని రింతగా చూస్తూ నిష్క్రమించాడు.

మాధవరావు మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

అతడికి కడుపు కాలుతోంది— గుండె మండుతోంది.

భార్య ఎదురుగా వుంటె పీకనులిమేసి చంపేద్దామన్నంత కోపంగా వుంది.

'ఇక లాభంలేదు రానురాను దానికి నిర్లక్ష్యం ఎక్కువౌతోంది. తనంటె బొత్తిగా లెక్కలేకుండా పోయింది. తను వద్దన్నపని గుర్తుపెట్టుకుని మరీచేస్తోంది. బుద్ధి చెప్పకపోతే మరీ బరితెగించే ప్రమాదం వుంది. అవును దానికి తగిన విధంగా బుద్ధి చెప్పాలి. తల తిరిగి నోట్లోకి రావాలి! అది మళ్ళీ ఆదర్శాలు, వ్యక్తిత్వాలు అని వల్లించ కూడదు— అలా చెప్పాలి గుణపాఠం.

కాని ఏం చెయ్యటం ?

ఏం చెయ్యాలో ఆ రాత్రి అంతా జాగరణచేసి నిర్ణయించి, సునంద కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

మర్నాడు పుదయం ఆరింటికి రిక్షాలోంచి మెల్లగా దిగింది సునంద !

మాధవరావు గడపకి అడ్డంగా నిలబడ్డాడు.

నిద్రలేని అతని కళ్ళు ఎర్రగా నెత్తురుముద్దల్లా వున్నాయి.

సునంద మెల్లగా ఇంట్లోకి పోబోయింది.

"ఆగు. ఎక్కడికి?" ఎక్స్‌ప్రెషన్‌తోపాటు క్వశ్చన్ గూడా కలిపి అనేశాడు మగ మహారాజు మాధవరావు.

"ఇంట్లోకి" తడుముకోకుండా సమాధాన మిచ్చింది.

"ఇక్కడ నీకు స్థానంలేదు– తెల్లవార్లు ఎక్కడ పడుకున్నావో అక్కడికే పో" కసిగా అన్నాడు.

"తెల్లవార్లు ఎక్కడా పడుకోలేదు— ఆస్పత్రిలో ఆపదలో వున్న స్నేహితురాలికి సాయంగా కూర్చున్నా, లోపలికి పదండి మాట్లాడుకుందాం" అతడివంకఅసహ్యంగా చూస్తూ అంది.

"ఇక నీతో నాకు మాట్లాడాల్సిన పని లేదు. ఇంట్లోకి రావాల్సిన అవసరం నీకు లేదు— పో అవతలికి" ఔచిత్యాన్ని అన్నంత తెలివిగా అనేశాడు.

సునంద –గృహిణి, ఈ సంఘంలో సమాజంలోని ఒక వ్యక్తి— స్త్రీకి అహం దెబ్బతింది వ్యక్తిత్వం తలెత్తింది.

"ఎందుకని" రెట్టించి అడిగింది.

"నీకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అవసరంలేదు. వెళ్ళు వెళ్ళు" అలాగే నిలబడ్డాడు, అలాగె అన్నాడు.

సునంద ఒక నిర్ణయాని కొచ్చింది.

"మీరు పోపో అంటె పట్టుకు వ్రేలాడేందుకు నేనేం పురాణకాలం స్త్రీని కాదు. మీ కోరిక ప్రకారం వెళ్ళిపోతాను. కాని వెళ్ళేముందు రెండు మాటలు చెప్పి మరీ వెడతాను.

నే నెన్నడూ తప్పు చెయ్యలేదు— ఇక చెయ్యను గూడా దానికి నా ఆత్మ, ఆ పరమాత్మలే సాక్ష్యం. కాని ఈనాడు మీరు ఏదో తప్పు చేసినట్టుగా నన్ను నిందించి కాదు అవమానించి వెళ్ళగొడుతున్నారు. ఒక్కటి మాత్రం గుర్తుంచండి. రోజులు మారాయి ఆడది, అందులో భార్య గూడా ఒక మనిషేనని గుర్తించాల్సిన తరుణం వచ్చింది. కొట్టినా, తిట్టినా పడుండె రోజులు పోయాయి. సాటి మనిషిని మనిషిగా గౌరవించటం నేర్చుకోండి — వృద్ధిలో కొస్తారు— కాస్త తప్పుకోండి నా వస్తువులు తీసికెడతా" అని అనంగానే మాధవరావు చటుక్కున ప్రక్కకి తొలిగాడు.

అమె చకచకా ఆమె తాలూకు సామాన్లు సర్దుకుని, వెంటనే ఒక పెట్టె పట్టుకుని వచ్చి, రాయిలాగా నిలబడి చూస్తున్న భర్తతో (సారీ, మాధవరావుతో), "నేను బ్రతకలేనని భయంలేదు. మీ తప్పు మీరు తెల్సుకుని, రమ్మని పిల్చేదాకా నే రాను. వస్తాను, గుడ్‌బై" అంటూ పెట్టె పట్టుకుని చకచకా నడుచుకుంటూ వెళ్ళిపోయిందా స్త్రీ శక్తి !

చూస్తూ నిలబడటంతప్ప అతడేమీ చెయ్యలేకపోయాడు.

మళ్ళీ మాధవరావు ఆమెని రమ్మని ఆహ్వానించలేదు.

సునంద రాలేదు.

అప్పటినించి ఇద్దరు సమాంతర రేఖల్లాగానే బ్రతక సాగారు.

చెప్పటం పూర్తి చేసిన సుందర్రామయ్య గారు, ఇద్దరు మేనల్లుళ్ళ వంక చూసి, వ్రతకల్పం లాగా చాలా నిష్ఠగా విన్నారని గ్రహించి, మెల్లిగా "అబ్బాయిలూ ఆదీకథ. పూర్తిగా విన్నారు కదా. ఇప్పుడు చెప్పండి. ఆ దంపతు లిద్దరిలో ఎవరిది తప్పని మీ అభిప్రాయం? భార్య జీవితాన్ని ప్రతిక్షణం దుర్భరం చేసి, ప్రతి చిన్న విషయాన్ని కొండంతలు చేసికుని, చివరికి తాడుని తెగే వరకు లాగిన మాధవరావుదా?

భర్తని కాదని తనకీ వ్యక్తిత్వం వుంది అని ఋజువు చేసి, భార్యంటె బానిసకాదన్న



వారఫలం

మహేష్

20-10-1978 శుక్రవారం మొదలు
26-10-1978 గురువారం వరకు

మేషం:— వింతైన శుభకరమైన వార్తలను వింటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. మీ కార్యక్రమాలు అడావుడిగా ఉంటాయి. స్త్రీలకు—బంధు మిత్రులను కల్సుకొంటారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం:— రావలసిన డబ్బు అందుతుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. మీ ఆలోచనలు ఫలిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

మిథునం:— ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. బంధు మిత్రులను కల్సుకొంటారు. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

కర్కాటకం:— చేజిక్కిన అవకాశాలుకూడా జారిపోవచ్చును. వ్యతిరేకమైన వార్తలను వింటారు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం:— వృత్తిలో ఆదాయం బాగుంటుంది. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. వారం ఆఖరులో మీ విలువైన వస్తువులు పోవచ్చును. ప్రయోజనంలేని శ్రమ కలుగుతుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

కన్య:— స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. దైవకార్యాలు నెరవేరతాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.

తుల:— వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. అనుకూలమైన వార్తలను వింటారు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు—పుణ్యకార్యాలు చేస్తారు. శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధిస్తారు.

వృశ్చికం:—మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. వృత్తిలో శ్రమ కలుగుతుంది. ప్రయాణాలు వాయిదాపడతాయి. వారంఆఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. అలంకార వస్తువులు కొంటారు.

ధనుస్సు:— మీ ఆలోచనలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వారం ఆఖరులో సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. మీ విలువైన మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన వ్యయం చేస్తారు.

మకరం:— వృత్తిలో సాటివారి పోటీ పెరుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు బాగుంటాయి. రావలసిన డబ్బు అందుతుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

కుంభం:— సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. ఎవరితోను వాద ప్రతివాదాలు తగవు. స్త్రీలకు—వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. ప్రయాణాలు వాయిదాపడతాయి.

మీనం:— మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. బంధువులకు సహాయం చేస్తారు. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. విద్యా వైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యంబాగుంటుంది. పుణ్యకార్యాలు చేస్తారు. ●

స్వయంవరం

కొత్త సత్యాన్ని చాటి చెప్పాలని, అందుకు తన కాపురాన్నే పాడుచేసుకున్న సునందదా? కాముం, ముందు నువు చెప్పు. నీ అభిప్రాయం'' అన్నారు మొదటి మేనల్లుడి నుద్దేశించి.

రామం కుర్చీలో సర్దుకు కూర్చుని, కాలిమీద కాలేసుకుని, మెల్లిగా "ఖచ్చితంగా సునందదే. అందులో ఎటువంటి సందేహం లేదు. సంఘంలో ఆమెని అందరూ మాధవరావు భార్యగా గుర్తిస్తారుగాని, సునందగా మాత్రం కాదు. ఆమె చేసే ప్రతిపని అతడి పరువు, ప్రతిష్ఠలకి సంబంధం గల్గి వుంటాయి: కాబట్టి ప్రతిపని చేసే ముందు నా అనుమతి తీసుకోవాలన్న మాధవరావు వాదనలో ఎంతైనా అర్థం వుంది. బంగారు పళ్ళానికైనా గోడవార లేకపోతే నిలబడదు. ఆడది గూడా అంతే! ఎన్ని లక్షలు సంపాదించినా, భర్త చెప్పుచేతల్లో వుండాల్సిందే! అలాకాక భర్తను ఎదిరించి, అతడి మాటకి గౌరవం ఇవ్వక, అతడేదో అన్నాడని బంధాలు తెంచేసుకున్న సునందదే మొత్తం తప్పు. ఆ విషయంలో ఆమె క్షమించరానిది'' పూర్తి చేసాడు ఆవేశంగా.

సుందరరామయ్యగారు అతడు చెప్పింది విన్నారు. ఆయన కళ్ళలో ఏ భావం కనబడనీయకుండా జాగ్రత్త పడ్డారు. మూర్తి వైపు తిరిగి, "నీ అభిప్రాయం ఏమిటి?'' అన్నారు.

మూర్తి గొంతు సరిచేసుకుని గట్టిగా, "నా వుద్దేశ్యంలో తప్పు ఇద్దరిదీను. తాడు తెగేదాకా లాగటం వుభయుల తప్పు. రెండు చేతులు కలుస్తేనే చప్పట్లు— అన్నట్లు వాళ్ళిద్దరిలోను లోపాలుండటం వల్లనే ఆ విధంగా బయటపడ్డారు. సంసార బండికి భార్యాభర్తలు చక్రాల్లాంటి వారు. ఒకరి భావాల్ని ఇంకోరు గౌరవిస్తూ ఒకరి లోపాల్ని ఇంకోరు సరిదిద్దుతూ, చేయిచేయి కలిపి అన్యోన్యంగా ముందుకి పోగలిగిననాడే అది నూరేళ్ళ పంట అనిపిస్తుంది. అంతేగాని భార్యాభర్తల్లో ఒకరు హెచ్చు, ఇంకోరు తగ్గు అన్న భావం ఏ కోశానవుండరాదు. సునంద లాగా తెంచుకుపోకూడదు—మాధవరావు లాగా మరీ కర్కోటకంగాను వుండకూడదు. అలా వుండలేక పోయారు కాబట్టి ఆ తప్పు, బాధ్యత ఇద్దరిదీను.'' అన్నాడు.

సుందరరామయ్యగారు తృప్తిగా గాలి పీల్చారు.

శ్రావణ మాసంలో లలితని మూర్తికిచ్చి ఘనంగా వివాహం జరిపించారు. ●


ఫిల్టర్ కాఫీ రుచిని మేము ఇలా
తీసుకెళ్లి...
...ఇందులో అలా చేర్చాం
రికరి
ఇన్‌స్టంట్
Ricory
SPECIAL TUMBLER PACK
A COFFEE CHICORY BLEND

యమూర్తి వెళ్లి తైముకి సరిగ్గా స్టూడియోముందే ని ఎదుర వస్తున్నాడు ఫొటోగ్రాఫరీ పరమేశం. పరమేశం ఫొటోగ్రాఫర్ కమ్ ప్రొప్రయిటర్. ఇంకెవరూ వర్కర్లు లేరతనికి. ఎంతో కష్టపడి పైకొచ్చిన వ్యక్తి.

మూర్తిని తనే నవ్వుతూ పలకరించాడు పరమేశం. "ఇప్పుడొచ్చారేం సార్! రెండయిపోయింది. ఇంకా భోజనం కూడా కాలేదు. చేసి వద్దామని బయలు దేరుతున్నాను! సాయంత్రం రాకూడదూ దయచేసి" అన్నాడు పరమేశం.

"కాదు. చాలా అర్జంటు" అన్నాడు మూర్తి— ముఖంలో దాని అత్యవసరాన్ని ప్రస్ఫుటం చేస్తూ.

అయిష్టంగానే వెనక్కి వచ్చాడు పరమేశం.

"ఫొటో దిగుతారా సార్?"

"కాదు"

ఆశ్చర్యపోయాడు పరమేశం.

ఇదివరకు అంటేషుమారు ఆరునెలల్ క్రితం నా ఫొటో ఒకటి తీశావు గుర్తుందా? గడ్డంకింద చెయ్యి పెట్టుకున్న ఫోజులో చాలా అందంగా నీటుగా వచ్చింది.

పరమేశానికి గుర్తు రానట్టుంది.

చేతి వేలుతో తలమీద కొట్టుకుంటూ ఉండిపోయాడు.

"అదే పరమేశం! బస్టుసైజు ఫొటో ఆ ఫోజు రావటానికి మవ్వుచాలా ప్రయత్నించావు కూడా" అన్నాడు మూర్తి.

"అలా అందరికీ చేస్తాంలెండి! అసలు దాన్నిగురించి శ్రమ వేస్టు చేసుకోటం ఎందుకు? నెగెటివ్‌లు చూస్తాను. మీరు కూడా గమనించండి" అంటూ వెతకటం మొదలుపెట్టాడు పరమేశం.

పదినిముషాలు గడిచినా అది దొరకలేదు. విసుగెత్తి పోయింది పరమేశానికి.

"తరవాత చూద్దాంలెండి సార్! అదిదేంట్లో ఉందో ఏమో? ఆకలి మండి పోతోంది!" అన్నాడు.

"ఒక్క అయిదు నిముషాలు" అంటూ బలవంత పెట్టాడు మూర్తి.

మళ్లీ విసుగ్గానే మొదలుపెట్టాడు పరమేశం, ఓ అయిదు నిముషాలయ్యేసరికి

ఆ నెగెటివ్ కనిపించింది. "ఇదుగో! సార్! ఇదేనా?" అంటూ సంతోషంగా అరిచాడు పరమేశం.

"అవును. అదే!" సంతోషం వ్యక్త పరచాడు మూర్తి.

"ఇది సాయంత్రం అయిదింటికల్లా ఓ ఆరు కాపీలు కావాలి" అన్నాడు మూర్తి.


"కాపీ రెండు రూపాయలు చొప్పున పన్నెండు రూపాయలవుతుంది సార్."

"అలాగే! సాయంత్రం ఇచ్చేస్తాను."

"సరేసార్! ఇక వెడదాం పదండి" అంటూ ఇద్దరూ బయటికి రాగానే తాళం వేశాడు పరమేశం.

మూర్తి సంతోషంగా సైకిలెక్కి ఇంటికి బయలుదేరాడు.

ఓ పత్రిక వాళ్ళు మూర్తి ఫొటో ప్రచురించి జీవిత వివరాలు వేస్తామన్నారు. దానికోసం ఫొటో కావాలి. ప్రస్తుతం తను తిరుపతి వెళ్ళి గుండు గీయించు కొచ్చాడు. గుండుతో ఫొటో దిగటం అతనికి ఇష్టం లేదు. ఆలోచించగా అతనికి ఇదివరకు తను ఫొటో దిగటం...అది అందంగా రావటం గుర్తొచ్చింది. కాని దాని కాపీలు ప్రస్తుతం తన దగ్గర ఏమీలేవు. అంతా తలా ఒకటి తీసుకుపోయారు. రేపటి లోగా ఫొటోతో ఆ పత్రిక అధిపతి దగ్గరకి వెళ్ళాలి. అందుకనే పరమేశం దగ్గరికి వెళ్ళింది మూర్తి.



ఇంటికి వెళ్ళి భోజనం చేసి, కాసేపు పడుం వాల్చబోయాడు మూర్తి.

"మీకో శుభవార్త!" అంటూ వచ్చింది శ్రీమతి తియ్యగా మాట్లాడుతూ, కాసేపు ఊరించి పమిటకొంగు క్రిందనుంచి ఫొటో తీసి చూపించింది.

"ఎక్కడుంది ఇది?" అంటూ ఎగిరి గంతేశాడు మూర్తి. "బట్టల పెట్టెలో దొరికింది" అంది శ్రీమతి. బహుమతిగా ఆమెకి రెండు ముద్దు లిచ్చాడు మూర్తి.

"ఇంకెందుకు? అనవసరంగా పరమేశానికి పన్నెండు రూపాయలు ఇచ్చుకోటం!" అనుకున్నాడు. ఆ ఫొటో తీసుకుని తన జీవిత వివరాలు— విశేషాలు రాసుకుని సాయంత్రం ఆ పత్రిక యజమాని దగ్గరికి బయలుదేరాడు. దారిలోనే కనిపించాడు పరమేశం.

"కాపీలు కడిగేశాను సార్! రండి తీసు కెడుదురుగాని" అన్నాడు ముఖంనిండా నవ్వు పులుముకుని. పన్నెండు రూపాయలు చేతిలో పడతాయనే సంతోషం అతని కళ్ళలో మెరుస్తోంది.

"పరమేశం! అర్జంటుగా ఒక వ్యక్తితో మాట్లాడాలి. పావుగంటలోవస్తా!" అన్నాడు మూర్తి.

ఆదరా బాదరాగా పత్రికాధిపతి దగ్గరికి చేరేసరికి సాయంత్రం ఆరుగంటలయింది.

"ఇదిగో సార్! నా ఫొటో, నా జీవిత వివరాలు, హాబీలు వగైరాలు. ఇక మీదయ!" అన్నాడు.

జవాబుగా మరో ఫొటో, ఓ అరటావు తెల్లకాగితం మీద రాసిన మాటరు అతని ముందు పడేశాడు ఆయన. ప్రామిస్ చేసిన తన ఫొటోకి బదులుగా ఆ ఫొటో అచ్చవ్వ బోతోందని గ్రహించాడు మూర్తి.

"మరి నా ఫొటో!" పాలిపోయిన ముఖంతో అడిగాడు.

"నీకన్నా ప్రముఖవ్యక్తి ఈయన. పైగా నీ ఫొటోకన్నా ముందు ఇది నా చేతికి వచ్చింది" అన్నాడాయన బింకంగా, దర్పంగా.

బిక్క మొఖం వేసుకుని వెనక్కి తిరిగి వచ్చాడు మూర్తి.

అతనికి అప్రయత్నంగా జీవంలేని నవ్వొకటి వచ్చింది. తను మాత్రం చేసిం దేమిటి? తన ఫొటో ఇంట్లో దొరికిందని పరమేశాన్ని నిరాశపర్చలేదూ? అన్యాయం చెయ్యలేదూ? దానికిది పరిహారం అంతే!! అనుకున్నాడు.

సగం లో ముగింపు

ప్రయాగ రామకృష్ణ

ఉత్తరం చూసుకోగానే వెంటనే బయలు దేరాడు కృష్ణ.

ఓ రోజు అక్కడ వుండేటట్టుగా సెలవు పెట్టి 'రిటర్న్ టికెట్'కూడా గోల్కొండకి బుక్ చేసాడు.

కృష్ణని చూడగానే కొండెక్కినంత సంబరపడి పోయింది కాదంబరి. ఎగిరి గంతేసింది.

'హాయ్' అని పెద్దగా అరిచింది.

అరుపు విన్నట్టుంది. అమ్మ లోపల్నుంచి బయటకొచ్చింది. వచ్చి తనను పక్కకు తీసుకువెళ్లి 'నీకు పెళ్ళయింది. మీ ఆయన చూస్తే ఏమనుకుంటాడు. అయినా మున పటిలా ఆ గెంతులు అరుపులు పనికిరావు యింకా. అవన్నీ మర్చిపో!'

మీద చన్నీళ్ళు కుమ్మరిచ్చినట్టయింది.

వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు కృష్ణ.

ఆకాశం రంగు కంచిపట్టు చీరలో కాదంబరి కొత్త సొగసుల్ని సంతరించు కుంది. బుగ్గన చుక్క. కళ్ళకు కాటుక. కాళ్లకు, చేతులకు పారాణి.

ఎన్నిసార్లు చూసినా ఇంకా చూడాలనే.

"నేపాల్ లో ఉద్యోగం ఆయనకు. ఆయనతో పాటు నేనూ వెళ్తున్నాను రేపు."

నిశ్శబ్దంగా, ముభావంగా వుండి పోయాడు కృష్ణ.

ఎదురుగా కాదంబరి: ఎవరికి ఎవరం ఏమీ కామన్న నిర్లిప్తత. కాని, ఇన్నాళ్ళూ అలా కాదు — ఆవిడ ఎదురుగా వుంటే అదోరకమైన థ్రిల్. యేదో మహోన్నత శిఖరాన్ని అధిరోహిస్తున్నంత ఆనందం. ఎక్సైట్‌మెంట్. అంతకు మించిన పార వశ్యం. ఆత్మతో ఆత్మ ఐక్యమైపోవాలన్న

(గత సంచిక తరువాయి)

తపన. ఒకరికళ్ళల్లోకి మరొకరు — ఒకరి మనసులోకి మరొకరు — వేరు వేరు ప్రాణా లుగా అంతరించిపోయి ఒకే ప్రాణమై నిలవాలన్న భావన. చిత్రమైన స్థితి. కృష్ణవేణీ నది... ఇసుక తిన్నెలు ... నీటి నురగలు...అంతెత్తు కొండలు కొండ మీద కోవెల...కొండల అంచుల నుండి మెలికలు తిరుగుతూ వెళ్ళిపోయే ఆ రోడ్డుమీద వాళ్ళు తీసిన పరుగులు .. అక్కడ నుంచి చూస్తే కన్ను చెదిరే ఊరి సౌందర్యం...దీపతోరణం ఇవన్నీ గుర్తొచ్చాయి.


గుర్తొచ్చాక కాదంబరితో చాలా ఫార్మల్‌గా మాట్లాడాడు. ఆరోగ్యం జాగ్రత్త, వేళ్ళకి భోజనం చేస్తుండు; ఉత్తరాలు రాస్తుండు ఇలా.

కాదంబరి కర్థంగాక పోలేదు.

నవ్వటానికి ప్రయత్నించింది.

తరువాత కాదంబరికి 'బెస్ట్ విషెష్' చెప్పి బయటకొచ్చాడు కృష్ణ.

నేపాల్‌లో ఆఫీసువాళ్ళే అల్ట్రామోడర్న్ బిల్డింగొకటి 'విత్ లేటెస్ట్ డిజైన్డ్ ఫర్నిచర్ యూ నెవర్ సా' ఒకటిచ్చారు. నామినల్ రెంటేదో చార్జ్ చేస్తారు. వాటర్ ఫ్రీ, ఎలక్ట్రిసిటీ ఫ్రీ. కంపెనీయే బేర్ చేస్తుందన్నీ.



పెద్ద కథ

సగంలో ముగింపు

'ఇదే కాదంబరి నివాస్' అన్నాడు కిరణ్ నవ్వుతూ మొదటిసారి యింటిముందు టాక్సీ ఆగినప్పుడు. చిన్నగా నవ్వి వూరుకుంది.

రెండు మూడు రోజులు యింట్లో సామాన్లు సర్దుకోవడంతో సరిపోయింది. కొత్త కాపురం అని, టు బి మేరీడ్ సేఫ్ కావాల్సినవి, అక్కర్లేనివి యేవేవో యిచ్చి పంపింది అమ్మ. అవి తీసి సర్దుతుంటే వాటి మధ్యలో కృష్ణ ప్రజంట్ చేసిన 'పికాసో' బొమ్మ కూడా కనిపించింది. ''విత్ లవ్''. 'ప్రేమతో' కన్నీళ్ళతో కడిగింది. చేతుల్లోకి తీసుకుని గుండెలకు హత్తుకుంది.

కాదంబరీ. మీ అమ్మ నీకోసం సంబంధాలు వెతుకుతుందేమో నేను నిన్ను పెళ్లి చేసుకుంటానని చెప్పు డియర్. మనిషిమీద మనిషికి నమ్మకం వుండాలి. అది కొరవడితేనే ఒట్లు ప్రమాణాలూనూ... వాటితో అవసరం లేదనుకుంటాను. అయినా నీకోసం చెబుతున్నాను, భగవంతుడిమీద ప్రమాణంగా నిన్ను నాదాన్ని చేసుకుంటాను. ఈ క్షణం... ఈ ఆనందం... ఈ హాయి... యివన్నీ శాశ్వతం చేస్తాను.

ఎక్కడో కలలో వినిపించినట్టుగా కృష్ణ మాటలు.

'కాదంబరీ'

కల కరిగింది. లేచి చూస్తే ఎదురుగా కిరణ్. దగ్గరగా వచ్చి నడుంమీద చెయ్యి వేసి 'ఫీలింగ్ లోన్లీ' అన్నాడు.

'ఫరవాలేదు. ఎప్పుడూ నా పక్కనే వుంటే మరి మీ ఆఫీసో' చల్లగా నవ్వుతూ అంది కాదంబరి.

దగ్గరకు తీసుకున్నాడు తనూ నవ్వుతూ.

కాదంబరేం మాట్లాడలేదు.

రేపు ఈవినింగ్ గ్రాండ్ పార్టీ ఒకటి యివ్వాలి మనం. ఫ్రెండ్సంతా వస్తున్నారు. ఇంక్లూడింగ్ బోర్డ్ ఆఫ్ డిరక్టర్స్... హోటల్ పెర్ల్లో ఫిక్స్ చేసాను.

'ష్యూర్' తలూపింది.

మరునాడు ఏడింటికల్లా హోటల్ పెర్ల్లో అసెంబుల్ అయ్యారు అంతా. గొప్ప సందడి. కోలాహలం. అందరి ముఖాల్లోనూ చిరునవ్వు. కాదంబరి, కిరణ్ యిద్దరూ స్వయంగా ఆహ్వానిస్తున్నారు అందర్నీ లోపలికి. లోపల గోడలమీద పలచగా పరుచుకున్న వూదా రంగు మసక మసకగా అస్పష్టంగా... చీకటి వెలుగుల్లో రకరకాల కోరికలు. కోరికల కనుగుణంగా సంగీతం. స్టీరియోలో వింత ధ్వని. గిటార్ల చప్పుళ్ళలో నవ్వులు పలచబడి తేలిపోతున్నాయి.

'బేరర్'... అరుపో పిలుపో మరి.

'యస్ ప్లీజ్' వినయంగా వచ్చి నిలబడ్డాడు. తెల్లటి బట్టల్లో శాంతిదూతలా వున్నాడు.

ఏం చెప్పారో యేమో...

మరుక్షణం —

గాజులు గల గల నవ్వినట్టు గ్లాసుల చప్పుళ్ళు. 'డెకొలాన్' టేబుల్స్మీద వాటి నీడలు — రకరకాల ద్రవాల వింత మెరుపు — ఖరీదైన స్కాచ్ విస్కీ గుబాళింపు — అంతకంతకూ తగ్గిపోతున్న దీపాల వెలుగు — చీకటి లాంటి వెలుతురులో గొంతు జారిన ద్రవం — ఆడ మగ మైకం ప్రేమ — ఛీఛీ...

కాదంబరికి అసహ్యం వేసింది.

తన చుట్టూ ఏం జరుగుతుందో, తనేస్థితిలో వుందో వూహించలేకపోయింది. గుండె వేగంగా కొట్టుకుంది. గొంతు వణికింది. చుట్టూ చూసింది. అంతా అద్వైత స్థితిలో వున్నారు. దూరంగా వెళ్ళి కూర్చుందామనుకుని 'కిరణ్' అని పిలిచింది. కిరణ్ మాట్లాడలేదు. 'మిమ్మల్నే' దగ్గరగా వెళ్ళి కొంచెం గట్టిగా అంది.

'వూఁ' అన్నాడు పక్కనే వున్న క్రిస్టీనాను గుండెలమీదకు లాక్కుంటూ. ఎవరో చూస్తున్నారన్న చైతన్యమేలేదు ఇద్దరిలో ఏ ఒక్కరికి. 'లవ్లీ' 'బ్యూటిఫుల్', 'హాయ్' యింకా ఏదేదో పిచ్చిపిచ్చిగా అరుస్తోంది. నిజంగానే క్రిస్టీనాకు పిచ్చి పట్టింది. చేతిలో వున్న నాప్కిన్ని కిరణ్ తల మీదగా జార్చి ఆ ముసుగులోకి తనూ జారి అతని పెదవులమీద తన పెదవులు ఆన్చి...

క్షణం కూడా వుండబుద్ధికాలేదు.

బయటకొచ్చి టాక్సీ పిలిచి ఎక్కి కూర్చుంది.

ఇంటికి వెళ్ళేటప్పటికి పన్నెండు.

కాదంబరికి నిద్ర పట్టడంలేదు. గదిలో ఒంటరిగా ఒకతే అలా చాలాసేపు కూర్చుంది ఏదేదో ఆలోచిస్తూ. బెడ్ లాంప్ వెలుతురులో రెక్కలు తెగిన పక్షిలా ఎదుట గోడమీద సీలింగ్ ఫాను నీడ. నెమ్మదిగా తిరుగుతోంది.

కిరణ్ ఆ రాత్రల్లా రాలేదు.

మరునాడు ఉదయం కూడా ఇంటికి రాలేదు. బహుశః అటునుంచి అటే ఆఫీసుకు వెళ్ళుండాలి. ఫోన్ చేద్దామనుకుని, మళ్ళీ ఎందుకో మానేసింది. అన్నం కూడా తినబుద్ధికాలేదు ఒకటే తలనొప్పి. రాత్రి తొమ్మిదింటికెపుడో వచ్చాడు కిరణ్. కాదంబరి పడుకునుంది. అతనేం పలకరించలేదు. అలికిడికి మెలుకువొచ్చి 'ఎంతసేపైంది వచ్చి' అన్నది కాదంబరి.

''ఇప్పుడే —''

''భోంచేసారా !''

మాట్లాడలేదు.

గ్యాస్ వెలిగించి వంట చేసింది. పిలవంగానే వచ్చాడు. వచ్చి భోంచేసాడు. నివరకు కిచెన్లో అన్నీ సర్దుకునేటప్పటికి రాత్రి పదయింది వచ్చి మంచంమీద పడుకుంటే, కిరణ్ కూడ వచ్చాడు.

'రాత్రినుంచి ఎక్కడికి వెళ్ళారు.'

''ఏం ?''

కిరణ్ మాటలో కొంచెం అహంకారం ధ్వనించింది.

'అడిగి తెలుసుకోవల్సిన అవసరం వుందికనుక.'

'ఆఫీసులోనే వున్నాను.'

'ఇప్పటివరకూ' — ఎత్తిపొడుస్తూ అంది.

'అవును' అసహనంగా అన్నాడు.

'అబద్ధం చెప్పకండి. ఐ హేటిట్. క్రిస్టీనాతో కబుర్లు చెప్తూ కూర్చున్నానంటే నేనేమనుకోను.'

'ఏమిటి నువ్వనేది.'

పెరుగుతున్న సంవత్సరాలు
కాల్షియం-శాండోజ్®
సంవత్సరాలు








పాప పుట్టక ముందు నుంచే, పాప యొక్క పళ్ళూ ఎముకలూ రూపొందటం మొదలెడతాయి. పసిదనం నుంచీ, పెరిగే వయస్సులో అంతా కూడా కాల్షియం ఎంతో కీలకమైనది.

మీ పాపకి గనక, పెరుగుతూన్న ఏ దశలోనైనా సరే, అవసరమైనంత కాల్షియం లభించకపోతే, తరవాత ఎంత యిచ్చినా ప్రయోజనం ఉండదు. అందుకే నేడే మీ పాపకు కాల్షియం-శాండోజ్ యివ్వడం మొదలెట్టండి. రోజుకు నాలుగు కాల్షియం-శాండోజ్ బిళ్ళలు గనక యిస్తే, అవి పెరిగే దశలోని ఆ ఏళ్ళలో అత్యవసరమైన కాల్షియంను సమకూర్చి, గట్టిపళ్ళనూ, పటిష్ఠమైన ఎముకలనూ రూపొందిస్తాయి. విటమిన్ సి, డి మరియు బి[12]తో పటిష్ఠం చేయబడిన కాల్షియం-శాండోజ్ బిళ్ళల్లో, పిల్లలకి యిష్టమయ్యే రుచిగల వెనీలా సువాసన ఉంది.

కాల్షియం-శాండోజ్ స్విట్జర్‌లాండ్‌లోని శాండోజ్ వారు రూపొందించినది, ప్రపంచంలోని అత్యుత్తమమైన కాల్షియం.



కాల్షియం-శాండోజ్®
గట్టిపళ్ళు, పటిష్ఠమైన ఎముకల కోసం

SANDOZ

daCunha/CS/26 TEL

'మీతోటిదే ప్రపంచం అని నమ్ముకున్న ఆడదొకత్తుందిక్కడ. ఆవిడ దృష్టిలో చులకనై పోకండి. క్రిస్టీనా భుజాలచుట్టూ చెయ్యివేసి మీరు దగ్గరకు తీసుకుంటే నేనేం అనుకోను. నేనేం అయిపోనుకూడ. కాని, రాత్రి పదింటి వరకూ స్నేహితులతో తిరిగి తరువాత రెండింటి వరకూ బార్లో తాగుతూ కూర్చుని బాలెన్స్ పోయాక ఇంటి దగ్గర డ్రాప్ చెయ్యమని ఎవరో టాక్సీ ఎక్కిస్తే వాడితో తగాదా పెట్టుకుని... నలుగురూ నిద్రలేచి మన మొహాల వంక చూస్తుంటే... అసహ్యంగా లేదూ మీకు...'

'మధ్యలో నీకెందుకు బాధ.'

'మిమ్మల్ని కట్టుకున్నందుకు.'

ప్రపంచంలో పెళ్ళయిన ప్రతి ఆడపిల్లకు భర్త ముఖ్యం. కాదంబరి కూడ మామూలు ఆడపిల్లే. ప్రేమించిన వ్యక్తిని పెళ్ళాడాలనుకుంది. కాని కుదరలేదు. ట్రాజిడీ. కిరణ్‌తో పెళ్ళయ్యాక అతనితోటిదే బతుకనుకుంది. రాజీపడింది. తను అంతగా జీవితంతో కాంప్రమయిజయి భర్త ... సంసారము ... ఆలన ... పాలన అనుకుంటుంటే ఏ రకమైన అండర్‌స్టాండింగు లేకుండా ఈ కిరణ్ ఏమిటి యిలా తయారయ్యాడు ...

ఈమధ్య కాదంబరి — కిరణ్ — యిద్దరూ ముభావంగా వుంటున్నారు. ఒకరితో ఒకరు ఎక్కువగా మాట్లాడుకోవడంలేదు. కట్టుబాట్లనేవి ఎవరికి వాళ్ళు నిర్ణయించుకోవల్సినవి. ఆంక్షలు

సగంలో ముగింపు

ఆజ్ఞలు సీతామ్మవారి గీతలు యివన్నీ రిఎల్లిగా అనిపిస్తాయి. అదేమని ఇష్టమొచ్చినట్టు ప్రవర్తించమని కాదు. ఓ పరిధిలో బతకాలి. అర్ధరాత్రి పన్నెండింటికి మనస్సు కొరవడిన మైకం ప్రేమలో తలుపు బాదితే — డార్లింగ్‌కి, డర్టీరోగ్‌కి తేడా తెలీక పెళ్ళాన్ని పెద్దపెద్దగా అరిస్తే —

" కిరణ్ ఇంటికొచ్చేసరికి పన్నెండయింది. ఆఫీస్ బాయ్‌ట. అతనెవరో తీసుకొచ్చి దించాడు. కాదంబరి లోపలెక్కడో గదిలో పడుకునుంది. ఏదో పుస్తకం చదువుతోంది. పిలవంగానే తలుపు తియ్యలేదని కిరణ్ పెద్దగా అరిచాడు కాదంబరిని. అర్ధరాత్రిపూట అతనితో గొడవపెట్టుకోవడం యిష్టంలేక తనేం మాట్లాడలేదు. నైట్ డ్రస్ తీసుకొచ్చి యిచ్చింది. వేసుకున్నాడు. అన్నం పెట్టమన్నాడు. పెట్టింది.

పెడ్తూ —

'ఇప్పటివరకూ మీ ఫ్రెండ్స్ వదిలిపెట్టలేదా మిమ్మల్ని.'

'ఏం !'

'రోజులు, తారీకులు మారిపోతున్నాయి. అందుకని...'

'వై అండ్ వాట్ అంటూ బోనులో నిలబడ్డ దోషి నడిగినట్టు అడక్కు. అబద్దం చెప్పడం

జరిగిన కథ - 3: చిన్నతనంలో ఆటకాయిగా తిరిగిన కాదంబరి, ప్రక్కింటి వాళ్ళబ్బాయి కృష్ణ ప్రేమించుకుంటారు. తిరుపతి నుంచి వచ్చిన కృష్ణ, రిసెర్చ్ స్కాలర్ మూర్తిని సావిత్రి చేసుకోబోతున్నదని కాదంబరికి చెప్తాడు. నేపాల్‌లో ఉద్యోగం చేస్తున్న కిరణ్‌తో కాదంబరికి వివాహం జరుగుతుంది.

ఎంత అసహ్యమో నీకు యస్, నో అని ప్రతిదానికి సమాధానాలు చెప్పడంకూడ అంతే అసహ్యం నాకు.'

'అడ్డమైనవాళ్ళకీ సంజాయిషీ చెప్పడంలేదు మీరు. కట్టుకున్న పెళ్ళానికి చెప్తున్నారు. ఇందులో అసహ్యించుకోవల్సిందేముంది.'

'హు ఎవర్ ఇటీజ్...' గట్టిగా అరిచాడు.

కాదంబరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అంతులేని దిగులు. అంతులేని ఆవేదన.

పదకొండో — ఎంతో — గడియారం గంటలు కొట్టింది. అల్మారాలో సిగరెట్ టిన్ తీసుకున్నాడు. చెప్పులు వేసుకుని, తలుపు 'ఫెడేల్'మని వేసి బయటకు వెళ్ళబోతుంటే —

'మిమ్మల్నే' పిలిచింది.

క్షణం ఆగాడు.

'క్రిస్టీనాతో కలిసి బోట్ క్లబ్‌కు వెళ్ళారా లేదా మీరు.'

'వెళ్ళాను.'

'థాంక్ గాడ్. ఒప్పుకున్నారు. కాని, మీరూ నేనూ భార్యాభర్తలం. ఆ విషయం మరిచి పోతున్నట్టున్నారు.'

'లేదు. మరిచిపోతే అంతకంటే కావల్సిందేముంది.'

'నన్ను పెళ్ళి చేసుకోవడంవల్ల మీరు అంత అసంతృప్తి ఫీలవుతున్నారా !'

'నువు కాదు. నేనడగాల్సిన ప్రశ్నది.'


కాదంబరి కళ్ళలో నీళ్ళు నిండాయ్. బాధ కాదు. నిజానికి కిరణ్ని చేసుకున్నాక తనెప్పుడు ఆ విషయాన్ని గురించి ఆలోచించలేదు. బాధ కూడ పడలేదు. ప్రేమించటమే నేర్చుకుంది. నేర్చుకుంది కనుకనే అతన్ని గురించి ఇంత తపన. రివ్వున వెళ్ళి అతని గుండెలమీద వాలిపోయింది ఆమె గుండెలనిండా అతనిపట్ల ఏదో తెలీని ఆత్మీయత నిండిపోయింది. కాదంబరి కిరణ్ మెడ చుట్టూ చేతులేసి దగ్గరకు తీసుకుని —

'ప్లీజ్. ఏదేదో వూహించుకుని జీవితాన్ని నరకం చేసుకోకండి. అనుమానం మనిషిని చిత్రవధ చేస్తుంది. నిజం చెప్తున్నాను. మీకంటే నాకెవరూ లేరు. ఐ లవ్ యూ' ఆర్తిగా చూసింది అతనివైపు. అతను మరింత దగ్గరకు తీసుకున్నాడు. వీపు వెనకనుంచి రెండు చేతులు వచ్చి బిగుసుకుంటే ... ఆరిపోయిన దీపం — చిక్కటి చీకటి— నిశ్శబ్దం— మధ్య మధ్యలో టిక్కు టిక్కు మని గోడగడియారం శబ్దం — ఆదమ్ అండ్ ఈవ్ హోరాహోరీ పోరాటం —

ఆఫీస్లో కిరణ్ స్టేటస్ పెరిగింది.

మార్కెటింగ్ ఆఫీసర్ గా ప్రమోట్ లయ్యాడు.

వినయంగా వంగి వంగి నమస్కారాలు చేసే మనుషులు, కంపెనీని వదిలిపెట్టిపోవడానికి వీల్లేకుండా క్రిస్టీనా లాంటి పర్సనల్ అసిస్టెంట్లు, టూర్లు, సెమినార్లు — పెద్ద ఫరమ్లో పెద్ద ఉద్యోగం. రాత్రి పదకొండింటికి, పన్నెండింటికి ఇంటికి రావడం మామూలయింది. అదేమంటే, ఎవరో పార్టీస్ వచ్చారనో,ఎక్జిక్యూటివ్స్ మీటింగనో, హోటల్ కాస్మోలో గెట్ టు గెదర్ అనో చెప్పేవాడు. వినీ విననట్టు వూరుకునేది కాదంబరి. కొన్ని అలవాట్లు చేసుకోకుండానేవుండాలి. చేసుకున్నాక అవి మనిషిని కింద మీద పెడ్తాయి. ఊపిరాడనియ్యవు. బయట ప్రపంచంతో సంబంధం లేని ఓ ఏకాంత స్వాప్నిక ప్రపంచంలో అందరూ ఆదమరిచి హాయిగా నిద్రపోతుంటే — కాదంబరి మాత్రం తలగడలో తల దూర్చి విలవిల్లాడిపోయేది.



ఎప్పుడో శరీరంలో రక్తం మండినప్పుడు వచ్చి పక్కన చేరేవాడు. ఏవగింపు కలిగేది. ఎలాంటి అనురాగం అన్యోన్యత లేకుండా యెప్పుడో అర్ధరాత్రిపూట ఆడది అవసరమైనప్పుడు గొంగళీపురుగులా మీదికి పాకటం ... భార్యాభర్తల మధ్య ఒక్క శారీరక సంబంధమేకాదు, పరస్పర అవగాహనకూడా కావాలి. అది లేకపోతే కళావిహీనంగా వుంటుంది బతుకు. కిరణ్ని అర్థంచేసుకోవడానికి యెంతగా ప్రయత్నించిందో కాదంబరి, అంత కొరకరానికొయ్యగా తయారయ్యాడు.

ఓసారెప్పుడో — ఏడింటికి ఐదారుగురు ఫ్రెండ్స్ని తీసుకొచ్చాడు కిరణ్. క్రిస్టీనా కూడా వుంది వాళ్ళలో. అందరికీ పరిచయంచేసాడు కాదంబరిని. అందరూ విష్ చేసారు. వాళ్ళ మధ్యలో తనకుకూడా సీట్ ఆఫర్ చేసారు. అక్కడ కూర్చోవడం యెందుకో యిష్టంలేకపోయింది కాదంబరికి. లోపలికి వెళ్ళి కూర్చుంది. తరువాత పది నిముషాలకి ఆఫీసు బాయ్ వచ్చాడు. అతని పేరు యాదవ్. సీసాల మూతలు విప్పి టేబుల్ మీద పెట్టాడు సోడాలు సిద్ధంచేసాడు. పగలంతా ఆఫీసులో సతమతమై ఇంటికొచ్చిన ఏ మగవాడైనా కులాసాగా పెళ్ళాం బిడ్డల్తో కబుర్లు చెప్పాలనుకుంటాడు. ఆఫీసు ఎట్మాస్ఫియర్కి దూరంగా వెళ్ళి నవ్వుతూ తుళ్ళుతూ ఓ నాలుగుగంటలైనా ఫ్రీగా గడపాలనుకుంటాడు. అదేం పాపమో, కిరణ్కి పెళ్ళాము, ఇల్లు బోత్తిగా సరిపడకుండా వచ్చాయి. రెండు రౌండ్లయ్యాక లోపలికి యాదవ్తో కబురుచేసాడు కిరణ్ — ఆమ్లెట్లు కావాలని. బ్లంట్గా చెప్పింది తను ఫ్రిజ్లో గుడ్లు లేవని. మండిపడ్డాడు కిరణ్. అందులో కోపం తెచ్చుకోవల్సిందేమిటో అర్థంకాలేదు కాదంబరికి. భర్తని, భాగస్వామిని ఎన్నుకోవడంలోనే వుంది నేర్పు. లేకపోతే యిలాగే ఓడిపోయే ప్రమాదం వుంది జీవితంలో. కళ్ళనీళ్ళు తిరిగాయి.

చాలా కోపంగా లోపలికొచ్చాడు కిరణ్.

వచ్చి — 'ఎగ్స్ అయిపోయాయని ఇందాకనే యెందుకు చెప్పలేదు నాతో' అన్నాడు.

'మీరు పట్టించుకోంది నాకేమిటి. అయినా ఇంట్లో ఏం వున్నాయో ఏం లేవో మీకు తెలుస్తున్నాయి కనుకనా !'

'నోర్మూయ్' — చేయెత్తాడు.

'దించండి. చాలు ప్రతాపం.'

అక్కడ వుండటం యిష్టంలేక గబగబ మెట్లెక్కి డాబా మీదకు వెళ్ళి కూర్చుంది.

[ఇంకా వుంది]

.....................దీపావళి సంచికలో......................

'ఆకర్షణా - వ్యామోహమూ'


కొత్త సీరియల్ ప్రారంభం!   సం.



దసరా అందరికీ పండుగే!

ముస్తాబు

"ఎంకి! సోది చెప్పమన్నావా?...."



కొత్త చిత్రాలు

శ్రీ పద్మావతీ ఇంటర్నేషనల్ పతాకంలో ఉప్పలపాటి సూర్యనారాయణబాబు ఒక చిన్న బడ్జెట్ చిత్రాన్ని తీస్తారు. శ్రీధర్ ప్రధాన పాత్రధారి. రాజాచంద్ర దర్శకుడు. జంధ్యాల సంభాషణలకర్త. జె. వి. రాఘవులు సంగీత దర్శకుడు. అక్టోబర్ 11 న పాటల రికార్డింగ్, అక్టోబర్ 21 న షూటింగ్ ప్రారంభమవుతాయి.

తిరుపతి ప్రొడక్షన్స్ "కలియుగరాముడు", విజయలక్ష్మి మూవీ క్రియేషన్స్ "అనుకోని కథ", ప్రసన్నలక్ష్మి క్రియేషన్స్ "చీకటి దాహం", శక్తి సినీ ఎంటర్‌ప్రైసెస్ "కెప్టెన్ కృష్ణ", శ్రీ చాముండేశ్వరీ వారి "క్లియోపాత్రా", శ్రీ గజవల్లి పిక్చర్స్ "జెనరల్ చౌదరి", శశి మూవీస్ "గుఱ్ఱాల గోపిరెడ్డి", శ్రీ కుమరాలయా ఫిలిమ్స్ "కనకదుర్గమ్మ", సత్యశ్రీ ఫిలిమ్స్ "కరాటే రాము", సరళ ఆర్ట్ ప్రొడక్షన్స్ "కర్పూర శిల్పం", శ్రీ తుల్జాభవానీ ఫిలిమ్ ప్రొడక్షన్స్ "కస్తూరి తిలకం", శ్రీ లక్ష్మీ ఆర్ట్ పిక్చర్స్ "మనిషి మనిషిగా బ్రతకాలి", శ్యామ్‌ప్రసాద్ ఆర్ట్ ప్రొడక్షన్స్ "మరో అహల్య", శ్రీ చిత్ర వారి "ఓం ప్రేమయానమః", సుబ్బు ప్రొడక్షన్స్ "ప్రత్యక్షదైవం", నాగలక్ష్మి ప్రొడక్షన్స్ "పెళ్ళి మంత్రం", శ్రీ దేవీకృపా పిక్చర్స్ "శ్రీరామకృష్ణ పరమహంస", గణేశ్ ప్రసన్న పిక్చర్స్ "శభాష్ ఇన్‌స్పెక్టర్", శర్వాణీ ఆర్ట్స్ "శరణంభవ" చిత్రాల పేర్లు రిజిస్టర్ చేయబడ్డాయి.

శభాష్ గోపీ

ఓ నులకమంచంమీద గోపి (బేబీ మంజుల), రాజ్యలక్ష్మమ్మ (నిర్మల) పడుకొనున్నారు. కథ చెప్పమని గోపి గొడవ చేసేసరికి రాజ్యలక్ష్మమ్మ చెప్పసాగింది: "అనగనగా ఓ రాజుగారున్నారు. ఆయనకు ఏడుగురు అమ్మాయిలు. అయితే, పాపం ఆ అమ్మాయిల తల్లి చచ్చిపోయింది. సవతి తల్లి సరిగ్గా చూడకుండా ఆ పిల్లల్ని అడవులకు తోలేసింది. అక్కడ వాళ్ళు 'అమ్మా ఆకలి' అని ఏడుస్తూ నిద్దరపోయారు. అప్పుడేమో వాళ్ళమ్మ స్వర్గంలోంచి తెల్ల చీరె, తెల్ల రవికె కట్టుకొని కళకళలాడుతూ దిగివచ్చింది."

అంతవరకు ఆసక్తితో కథ వింటున్న గోపి "అయితే, నాయనమ్మా! నువ్వూ చచ్చిపోయాక అలా దిగివస్తావా?" అని అడిగాడు.

"ఛీ గాడిదా! కథ విను" అంటూ ఆమె కథ పూర్తి చేసేలోగా గోపి నిద్రాదేవత ఒడిలోకి చేరాడు.

మానికొండ మధుసూదనరావు దర్శకత్వంలో

జి. వి. జి.

జి. వి. రాఘవయ్య చౌదరి ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించిన జి. వి. ఆర్. పిక్చర్స్ "శభాష్ గోపి"లో మురళీమోహన్, ఈశ్వరరావు, రమణమూర్తి, కవిత, పి. ఆర్. వరలక్ష్మి, సాక్షి రంగారావు ఇతర పాత్రధారులు. ఆదుర్తి నరసింహమూర్తి రచయిత. దాశరథి, దేవులపల్లి, జాన్సన్, వీటూరి, వేటూరి గీతాలకు జె. వి. రాఘవులు స్వరకల్పన చేశారు.

ఆనాడె నీకు దసరా!

—పారుపల్లి

ఎదలోపలి కల్మషాన్ని
మొదలంటా తుడిచేసి
ఎదుటివాడి కష్టమేదో
సువ్వర్థం చేసుకుంటె
నాడె నీకు దసరా
కాని వాడు వృధరా ---

మంచివాడి మనసెపుడూ
బాధపెట్టకున్ననాడు
నీలో వుండే మంచిని
పదుగురికీ పంచునాడు
నాడె నీకు దసరా
కాని నాడు వృధరా ---


ఎక్కవాడి డొక్కలో
టక్కున ఓ పోటు పొడిచి
ఏమి ఎరుగనివాడిలా
నటియిమ్తూ తిరుగునాడు
లేదు నీకు దసరా
వుందంటే భ్రమరా —

పట్టలేవు గాండీవం
పట్టేదాకటే లంచం
మూసుకున్న కళ్ళు తెరచి
పనిచేస్తే వళ్ళు మరిచి
ఆనాడె నీకు దసరా
కాని నాడు వృధరా...

"నాయుడు బావ ఎక్కడున్నాడో చెప్తావా ?"







పేజీ

"రిషీరాజి" లో అక్కా చెల్లెళ్ళు

సంవాదం

డి. ఎస్. ప్రకాశరావు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో జి. వి. ఎస్. రాజు నిర్మించే విజయ లక్ష్మి మూవీస్ ''రిషీరాజి'' వర్ణచిత్రంలో కెమెరా ముందు రాజి (జయచిత్ర), సుధ (రోజారమణి) ఉన్నారు.

''ఏమిటమ్మా? చదువు మానేస్తావా ?'' అంది రాజి.

''అవునక్కా! ఇన్నాళ్ళూ నువ్వు పంపిన డబ్బు ఖర్చు చేయడమే తప్ప — ఆ డబ్బు సంపాదించడానికి నువ్వెంత బాధ పడుతున్నావో ఆలోచించడానికి ఒక్క నిమిషమైనా ఖర్చు చేయలేక పోయాను. నువ్వు రిషీలాగి, పస్తులుండి పంపిస్తున్న డబ్బుతో నేను చదవలేనక్కా, చదవలేను. నాకు పుస్తకంలో అక్షరాలు కాదు; అక్క కష్టాలే కనిపిస్తాయి,'' అంది సుధ.

''సుధా! నా మాట వినమ్మా! నాన్నకి నేనిచ్చిన మాట నిలుపుకోడానికే నేనింకా బతికున్నానమ్మా! నువ్వు డాక్టరవ్వాలి. పేదల పాలిటి పెన్నిధిగా నిలబడాలమ్మా. నేను కష్టపడ్డా — ఆ సంపాదన వల్ల చెల్లి డాక్టర్ అవుతుందన్న ఆలోచనే నాకు వెయ్యేనుగుల బలాన్నిస్తుంది. నా గురించి ఆలోచించకు. నువ్వు చదువు మానేస్తే — మీ అక్కమీద ఒట్టు.''

''అక్కా! ... అలాగే, అక్కా! నీ కోరిక ప్రకారమే చదువుకుంటాను.''





'నామాల తాతయ్య'లో రాజబాబు, కాకరాల, రమాప్ర

'మూడు పువ్వులు - ఆరు కాయలు'లో త్రిశూలం !

గత స్మృతులతో సతమతమవుతున్న మాస్టర్జీ (జగ్గయ్య)తో జ్వాల (హలం) "తీరని ఆశలు పెంచుకొని గుండెలు బరువెక్కించుకోడం దేనికి? మళ్ళీ ఆ బరువును దించుకోడానికి కన్నీళ్ళు కార్చడం దేనికి? మీ నాన్నతోపాటే మీ తల్లీ చెల్లెళ్ళు చనిపోయారనుకోవడం మంచిది మాస్టర్జీ!" అంది. అంతే, మాస్టర్జీ సింహంలా రెచ్చిపోయి, "నో! మళ్ళీ ఆ మాటన్నావంటే —" అంటూ జ్వాల గొంతు నులమబోయాడు. ఆమె చిరునవ్వుతో చలించకుండా ఉంది. తమాయించుకొని ఆమె గొంతు నిమురుతూ లతను "నా తల్లీ చెల్లెళ్ళు ఎక్కడో హాయిగా క్షేమంగా బ్రతికే ఉంటారు, జ్వాలా! చచ్చిపోతున్నది నేను. నదిలో పడి చావకుండా కొట్టుకొచ్చి స్మగ్లరైన నీ తండ్రికి దొరికి, స్మగ్లరుగానే పెరిగి, స్మగ్లరుగానే ఆత్మవంచన చేసుకుంటూ చచ్చిబతుకుతున్నది నేను!" అన్నాడు "ఈ బతుకు మంచిదైనా — చెడ్డదైనా, దీనికే మీ జీవితం ఐతపడి ఉంది. కనుక, కలసిరాని గతాన్ని వదిలేసి, కలసొచ్చే వర్తమానంలో జీవించడం తెలివైన పని", అన్న జ్వాలను దగ్గరికి తీసుకొని, "అఫ్‌కోర్స్ యు ఆర్ కరెక్ట్ మై స్వీట్ జ్వాలా!" అంటూ వెంటనే "మర్చిపోయాను నువ్వు వెంటనే ఓడరేవుకు వెళ్ళాలి — షిప్‌లో వస్తున్న త్రిశూలంగాడ్ని పట్టడానికి ఈ రోజు సింగపూర్ నుంచి వస్తున్న ఓడలో వాడు కొన్ని కోట్లు విలువచేసే రహస్యంతో మన దేశంలోకి అడుగు పెడుతున్నాడు. ఓడ దిగగానే వాడ్ని పట్టి, ఆ రహస్యం కొట్టెయ్యాలి," అన్నాడు మాస్టర్జీ. అతని వివరాలేమిటని అడిగింది జ్వాల. "వివరాలు పూర్తిగా వినకముందే సింగపూర్ నుంచి నా మిత్రుడు చేస్తున్న ఫోన్ కట్ అయింది. ఒకే ఒక గుర్తు విన్నాను. అతని కోటుమీద త్రిశూలం ఉంటుంది" అని తెలియజేశాడు మాస్టర్జీ.

కృష్ణ, విజయనిర్మల నాయకా నాయికలుగా విజయనిర్మల ప్రొడక్షన్స్, దర్శకత్వంలో ఎం. చంద్రకుమార్, ఎం. జీవన్‌కుమార్, ఎం. విజయకుమార్, ఎం. వెంకటరమణకుమార్ స్కోప్—కలర్‌లో నిర్మించే "మూడు పువ్వులు — ఆరు కాయలు" చిత్రానికి మోదుకూరి జాన్సన్ రచయిత. సత్యం సంగీత దర్శకుడు. ఎస్. ఎస్. లాల్ ఛాయాగ్రాహకుడు. నిర్వహణ : పద్మనాభం.

గృహిణిగా లక్ష్మి

ఒక రోజు పంజాబీ డ్రస్సులో కేరియర్ చేత బట్టి కారులోంచి దిగుతున్న లక్ష్మిని చూసి విస్తుపోయాను. "మీకే స్టూడియోలో షూటింగ్ ఉందా?" అన్నాను. "నాకు కాదు. మా వారికి షూటింగ్ ఉంది. వారికి భోజనం తెచ్చాను," అందామె. ఆమె తల్లి రుక్మిణి కూడా చాలా కాలం తర్వాత "పణం పగ్గై పాశం" అనే తమిళ చిత్రంలో నటిస్తోంది. ఆ చిత్రంలో ప్రభ నాయిక.

"తొలి చిత్రం నించి ఇప్పటి వరకు ప్రతి చిత్రంలోనూ నటనలో వైవిధ్యం చూపుతున్న నటుడు శివాజీ గణేశన్‌గారొక్కరే," అన్నదామె మాటల మధ్యలో.

శివాజీ గణేశన్ తొలి చిత్రం "పరాశక్తి" దర్శకులు కృష్ణన్ — పంజు. వాళ్ళ ఎదురుగా మాత్రం శివాజీ సిగరెట్టు కాల్చడు.



'రామచిలక'లో ఒక సన్నివేశం



'రిక్షారాజీ'లో ప్రభాకరరెడ్డి, హరిబాబు

అడకత్తెరలో....

''ఆడుకొని అమ్మమ్మ వచ్చె కాబోలు
కత్తెరలు వప్పడాయె పందిళ్ళలోన...''

అప్పుడే ఒక తెలుగు చిత్రం సెన్సారింగ్ కార్యక్రమంలో పాల్గొని ఉస్సూరుమంటూ ఇంటికి తిరిగి వచ్చిన శ్రీమతి రామలక్ష్మిని చూసి, మనమడ్ని లాలిస్తూ ఆరుద్ర అప్పటికప్పుడు అల్లి, పాడిన పాట అది. ''మేము సెన్సారింగ్ నిబంధనలను అమలు పరచడంలో చాలా కఠినంగా ఉంటున్నామని కొందరు చిత్ర నిర్మాతలు మమ్మల్ని ఆడిపోసుకుంటూండవచ్చు. అలా అమలుపరచకపోతే, అక్కడ మన ప్రేక్షకులు అంతకన్నా శాపనార్థాలు పెట్టేస్తారు. అసలు కత్తెరలో ఇరుక్కొని ఉన్నది మేము,' అన్నారు రామలక్ష్మి. హరిజనాభ్యుదయం ప్రధాన అంశంగా ఆమె రాసిన ''కోటిగాడు'' కథకు చెరుకూరి ప్రకాశరావుగారు వీనస్ మహీజా పతాకంలో నిర్మిస్తున్న విషయం పాఠకులకు లోగడ తెలిపాను. దాదాపు నాలుగుమాసాల క్రితం ''గురుదక్షిణ'' అనే మరో మంచి మాస్టారు కథను ఆమె నాకు వినిపించారు. అదేమైందని అడిగాను. ''దాని గురించి త్వరలోనే న్యూస్ ఇస్తాను,'' అన్నారామె.

హీరోల పుత్రులతో హీరోయిన్‌లు

హీరోయిన్‌ల పుత్రికలలో మన తెలుగు హీరోలు నటిస్తూంటే హీరోల పుత్రుల పక్కన హిందీ హీరోయిన్‌లు నటిస్తున్నారు! స్వర్గీయ బాల్‌రాజ్ సాహ్ని నాయికగా ''సీమ, హంలోగ్'' చిత్రాలలో నటించిన నూతన్, ఆయన కొడుకు పరీక్షిత్ సాహ్ని నాయికగా ''దునియాదరి, హమారా సంసార్'' చిత్రాల్లో నటిస్తోంది. ''సప్నోకా సౌదాగర్''లో రాజ్‌కపూర్ హీరోయిన్‌గా



'తాయారమ్మ—బంగారయ్య'

నటించిన హేమమాలిని, అతని కొడుకు రణధీర్‌కపూర్ నాయికగా ''హాథీకే సఫాయ్''లో నటిస్తోంది.

''శ్రీమాన్ పుపు'' అనే చిత్రం టైటిల్‌ను రాజ్‌కపూర్ రిజిస్టర్ చేశాడు. దీపావళి ప్రాంతంలో సెట్స్‌కు వెళ్లే ఆ చిత్రానికి అతనే దర్శకుడు. అదికాక రణధీర్‌కపూర్ దర్శకత్వంలో ఒక చిత్రాన్ని, మరో సుప్రసిద్ధ దర్శకునితో ఇంకో చిత్రాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తాడట.

''శ్రీ 420'' చిత్రంలో రాజ్‌కపూర్ నర్గీస్‌లపై చిత్రీకరింపబడిన ''ప్యార్ హువా ఇక్ రార్ హువా'' పాట — అస్రానీ దర్శకత్వం నెరపుతున్న ''సలాం మేం సాబ్''లో అస్రానీ, జరీనావహాబ్‌పై చిత్రీకరింపబడుతుందట.

రేపటి తార స్వాతి



టి' నగర్‌లో టాక్సీ స్టాండ్‌వద్ద టాక్సీ కోసం ఎదురుచూస్తూ నిలుచోనున్నాను. పక్కన పేవ్‌మెంట్ మీద దసరా కొలువు బొమ్మలు అందంగా పేర్చి అమ్ముతున్నారు.

''హమ్మయ్య! గాడిద బొమ్మ దొరికింది'' అన్న కంఠం వినిపించి, వెనుతిరిగి చూశాను. ఇదివరకటి బి. సరోజాదేవిలా ఉన్న ఒక పదహారేళ్ళ అమ్మాయి, కొట్టతనితో ''ఆ బొమ్మ ఖరీదెంత ?'' అని అడిగింది తమిళంలో. అయిదు రూపాయలన్నాడతను. ''ఎంతైనాసరే కొంటాను'' అంటూ అయిదు రూపాయల నోటిచ్చి, ఆ బొమ్మను అందుకొని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతూన్న ఆ యువతివంక నిర్ఘాంతపోతూ చూశాను. ''క్షమించాలి. విచిత్రంగా తోచింది గనుక అడుగుతున్నాను — అక్కడ అన్ని జంతువుల బొమ్మలు ఉండగా, ప్రత్యేకించి ఆ గాడిద బొమ్మనే ఎందుకు కొన్నారో తెలుసుకోవచ్చా ?'' అని అడక్కుండా ఉండలేకపోయాను.

''మా ఇంట్లో కూడా అన్ని జంతువుల బొమ్మలూ ఉన్నాయి. గాడిద బొమ్మే లేదు. ఇంత కాలానికి దొరికింది'' అందా యువతి.

''గాడిదపట్ల... సారీ... గాడిద బొమ్మపట్ల ఎందుకంత అభిమానం ?''

''నేను 'అగ్రహారత్తిల్ కళిదై' అంటే — 'అగ్రహారంలో గాడిద' అనే తమిళ చిత్రంలో హీరోయిన్‌గా నటించాను. అదొక్కటే నేను ఆక్ట్ చేసిన చిత్రం. దానికి నేషనల్ అవార్డ్ వచ్చింది.''

''మీ పేరు స్వాతి కదూ ?''

''కాని, నా అసలు పేరు సావిత్రి. ఆ పేరు గల మహానటి ఒకరున్నారు కదా? అంచేత, టైటిల్స్‌లో నా పేరు 'స్వాతి' అని వేశారు.''

''తెలుగు బాగా మాట్లాడుతున్నారే!''

''కేసరి హైస్కూల్‌లో నా సెకెండ్ లాంగ్వేజ్ తెలుగేనండీ. కూచిపూడి భరతనాట్యం కూడా నేర్చుకున్నాను.''

''మరి, తెలుగు చిత్రాలలో ప్రయత్నించ లేదా ?''

''ముందు తమిళ, మలయాళ చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చుకుంటేగాని, తెలుగు చిత్ర నిర్మాతల దృష్టిలో పడడం కష్టమట కదా? అసలు నేనొక తమిళ నాటకంలో నటిస్తూంటే, అబ్రహాంగారు నన్ను చూసి, బుక్ చేశారు.''

''తెలుగు నాటకాలలో చాలా వేశాను. పద్మనాభంగారి 'శ్రీ కాళహస్తి మహాత్మ్యం' నాటకంలో నాయిక నీల పాత్ర ధరించాను.''

''ఇంగ్లీషులో మీగడకు ఏమంటారు ?''

''ఫీస్... నేను ఎస్. ఐ. ఇ. టి. కాలేజీలో పి. యు సి. పూర్తిచేశానండోయ్. నాకు ఇంగ్లీషు రాదనుకుంటున్నారేమిటీ ?''

''అబ్బే—అదికాదు — ఇప్పుడు పెద్ద తారలైన కొందరికి ఆదిలో నేను ఫోటోలు తీస్తున్నప్పుడు నవ్వమంటే ఓ పట్టాన నవ్వేవారుకాదు అంచేత వాళ్ళచేత 'ఫీస్' అని అనిపించేవాడ్ని. అప్పుడు నవ్వినట్లుండేది వాళ్ళ ముఖం.''

''పుష్పవల్లిగారింటి ముందు నెంబర్ 2, రామన్‌స్ట్రీట్‌లో ఉంటున్నామండీ మేము. మా టెలిఫోన్ నెంబర్ 446572. మీరు మగవారు గనుక మా ఇంట్లోని బొమ్మల కొలువు చూడ్డానికి ఆహ్వానించలేకపోతున్నాను సారీ!'' అంది!



'అంగడిబొమ్మ'లో సీమ

సంక్షిప్త చిత్ర వార్తలు

★ పి. ఎస్. రావ్ దర్శకత్వంలో కె. నాగమణీ రామకృష్ణ నిర్మించే శివనాగకుమారీ కంబైన్స్ "అమరజ్యోతి" చిత్రంలో రామకృష్ణ, ప్రభాకర రెడ్డి, ధూళిపాళ, సారథి, సాక్షి రంగారావు, జయచిత్ర, చంద్రకళ పాత్రధారులు. మాటలు, పాటలు : గోపి. సంగీతం : సత్యం ఛాయ : సుఖదేవ్. శిల్పం : రంగారావు. నిర్వహణ : ఎ. రామకృష్ణ.

★ మన రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి ఛీఫ్ పేట్రన్, విఖ్యాత దర్శక నిర్మాత శ్రీ వి. శాంతారాం ఛేర్మన్ అయిన చిల్డ్రన్ ఫిలిమ్ సొసైటీ నిర్మించే చిత్రం తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో అక్టోబర్ 1న ప్రారంభమైంది. నాగార్జునసాగర్, శ్రీశైలం వద్ద షూటింగ్. ఆరుద్ర రచయిత. రమేష్‌నాయుడు సంగీత దర్శకుడు మర్షి ఇరానీ ఛాయాగ్రాహకుడు.

★ జనవరి 1న అనిల్ ప్రొడక్షన్స్ ప్రారంభించే కొత్త చిత్రానికి, 1979 చివరన కమల్‌హాసన్ నటించే చిత్రానికి కూడా తాతినేని ప్రకాశరావు దర్శకత్వం వహిస్తారు. ఎన్. టి. ఆర్. తో మే నెలలో ప్రారంభించే మరో చిత్రానికి టి. ఎల్. వి. ప్రసాద్ దర్శకుడు.

★ కృష్ణ, రజనీకాంత్‌లతో కె. ఎస్. ఆర్. దాస్ దర్శకత్వంలో జి. దుర్గాప్రసాదరావు, పి. శశిభూషణ్ నిర్మిస్తున్న శ్రీ సారథీ స్టూడియోస్‌వారి "ఇద్దరూ అసాధ్యులే" స్కోప్ కలర్ చిత్రంలో లత స్థానే గీత నటిస్తోంది.

★ ఎన్. టి. ఆర్., వాణిశ్రీ నాయకా నాయికలుగా బి. ఎ. సుబ్బారావు దర్శకత్వంలో అట్లూరి పుండరీకాక్షయ్య నిర్మించే భాస్కర చిత్ర వారి రంగుల చిత్రానికి ఇటీవల ఊటీలో కొన్ని సన్నివేశాలు చిత్రీకరింపబడ్డాయి.

★ పి. చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో అక్టోబర్ 11న సెట్స్‌కు వెళ్ళే విజయకళా ఆర్ట్స్ "పంచభూతాలు" వర్ణచిత్రంలో చంద్రమోహన్ హీరో. మోదుకూరి జాన్సన్ రచయిత. ఇళయరాజా సంగీత దర్శకుడు. ఎం. సి. శేఖర్ ఛాయాగ్రాహకుడు. శ్రీనివాసరావు శిల్ప దర్శకుడు. మన్నె రాధాకృష్ణ, సి. వి రమణ అసోసియేట్ డైరెక్టర్లు. జనవరి 26న విడుదల.

★ "అక్టోబర్ 4 నుంచి 25 వరకు మొదటి షెడ్యూల్, నవంబర్‌లో రెండవ షెడ్యూల్ జరుగుతాయి" అన్నారు ఊరంకి శర్మ దర్శకత్వంలో గోపీకృష్ణ ఇంటర్నేషనల్‌వారి ద్వితీయ చిత్ర నిర్మాత వలసాని గోపి. నారాయణరావు, లక్ష్మీకాంత్, పి. ఎల్. నారాయణ, హేమచందర్, చిరంజీవి, మాధవి, పల్లవి ముఖ్య పాత్రలు ధరించే ఈ చిత్రానికి సి. ఎస్. రావ్ సంభాషణలకర్త. ఆత్రేయ గీతాలకు ఎం. ఎస్. విశ్వనాథన్ బాణీలు కూర్చారు. లోకనాథ్ ఛాయాగ్రాహకుడు. నిర్వహణ : జి. సత్యరాజు. సమర్పణ : చేగొండి హరిబాబు.

★ తండ్రీ కొడుకులుగా ఈశ్వరరావు తొలిసారిగా ద్విపాత్రాభినయం నిర్వహించే సంజయ్ ఆర్ట్స్ "బంగారు బాట" చిత్రంలో భావన, హంస, చిట్టిబాబు, విజయకుమార్, వసంత, సి. పుల్లయ్య, బసవయ్య, జ్యోతి, కె. హనుమంత రావు, కాకరాల, పార్వతి, రాజ్యలక్ష్మి, విజయశ్రీ నటిస్తున్నారు. కథ : త్రివేది. మాటలు : అనంత్. గీతాలు : ఆరుద్ర, దాశరథి. సంగీతం : ఘంటసాల విజయకుమార్. ఛాయ : ఎస్ హరినాథ్. ప్రొడక్షన్: సింహం. దర్శకుడు : టి. గోపాలకృష్ణ. నిర్మాత : సి. పుల్లయ్య, బి. ఎ.

★ రావికొండ విరచిత "నిజం" మాతృకగా దేవదాస్ కనకాల దర్శకత్వంలో ఎం. సురేందర్‌రెడ్డి నిర్మించే చిత్రం షూటింగ్ పూర్తయింది. నారాయణరావు, గుమ్మడి, హేమాచౌదరి, నూతన్‌ప్రసాద్, రాజేశ్వరి, మోహిని, గిరిజారాణి, రాంబాబు, టెక్కం, శరత్‌బాబు, కృష్ణప్రియ, రాజేంద్రప్రసాద్, శ్రీనాథ్, అంకినీడు, విఠల్‌ప్రసాద్, గౌరవ పాత్రలలో లింగం, రామ్మోహన్, సీమ, లక్ష్మి దేవదాస్, మాస్టర్ హరి కనిపిస్తారు. మాటలు : జంధ్యాల. సంగీతం : జె. వి. రాఘవులు. గీతాలు : జాలాది, నెల్లూట్ల. కూర్పు : రవి. అసోసియేట్ డైరెక్టర్ : ప్రభు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : పి. విద్యాసాగర్.

★ కె. రాఘవ నిర్మించే ప్రతాప్ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ "అంతులేని వింత కథ" షూటింగ్ భాగ్యనగర్ స్టూడియోస్‌లో సెప్టెంబర్ 26న ప్రారంభమైంది. సత్యనారాయణ, శ్రీవిద్య, జయంతి, నరసింహరాజు, మాధవి పాత్రధారులు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం : మోహన్‌దాస్. గీతాలు : సి. నారాయణరెడ్డి. సంగీతం : రమేష్‌నాయుడు. ఛాయ : రామకృష్ణ రావు. కూర్పు : బాలు.



సినిమా విశేషాలు

16న పుట్టింది-21లో అడుగెట్టింది

ఓ చిలిపి చిట్టెమ్మ. చిలిపితనం, చలాకీతనం ఆ చిట్టెమ్మకు ప్రత్యేక ఆకర్షణలు. భోళా మనస్సు ఆమె అంతరంగ సౌందర్యానికి ప్రత్యేక అలంకారం. ఆమె పేరు జయలక్ష్మి. ఫటాఫట్ జయలక్ష్మి సెప్టెంబర్ 16న పుట్టింది. ప్రతి సంవత్సరం తన పుట్టినరోజు వేడుకల్ని, పరిశ్రమ వారితో, పత్రికలవారితో కలిసి జరుపుకోవడం జయలక్ష్మి అలవాటు. ఈసారికూడా అలాగే చేసింది. అందరికీ చక్కటి విందు నిచ్చింది. ''ఎందుకదో దండగ. బోలెడంత డబ్బు ఖర్చవుతుంది.'' అని ఎంతమందో ఏ సంబరం చేయకుండా తప్పుకుపోతున్న ఈ రోజుల్లో ఎంతోమందిని ఆహ్వానించి, తన ఆనందాన్ని వారితో పంచుకోవాలని ప్రయత్నించే ఫటాఫట్‌ను అభినందించడం సమంజసం. ఈ సెప్టెంబర్ 16న ఫటాఫట్ 21వ సంవత్సరంలోకి అడుగెట్టింది.

'కేడీ నెం. 1' లో జయసుధ, రామారావు



ఫటాఫట్ కొత్త పేరు మీన్‌కొళంబు !

కె. బాలచందర్ ''అంతులేని కధ'' చిత్రం ద్వారా ఫటాఫట్‌గా ప్రేక్షకుల ప్రత్యేక ప్రశంస లందుకున్న జయలక్ష్మి మరో కొత్త నామధేయు రాలైంది ఇటీవలె. తమిళంలో విడుదలై విజయ ఢంకా మ్రోగిస్తున్న ''ముల్లుం—మలరుం'' అనే చిత్రంలో రజనీకాంత్ సరసన నటించి, ఆ చిత్రంలో తరచూ వినిపించే ''మీన్‌కొళంబు'' అనే తన డైలాగ్‌ను బహుచక్కగా వుచ్చరించి ''మీన్‌కొళంబు'' అనే తమిళ ప్రేక్షకులచేత ప్రశంసింపబడుతూంది ఫటాఫట్. 'మీన్‌కొళంబు' అంటే చేపలపులుసు అని అర్థం. ఈ మీన్‌కొళంబు మజా ఏమిటో తెలుగులో ఎవరైనా ''ముల్లుం — మలరుం'' చిత్రం తీస్తేగానీ తెలియదు.

జయలక్ష్మి సొంత చిత్రం

ఫటాఫట్ జయలక్ష్మి అతి త్వరలో ఒక సొంత చిత్రాన్ని నిర్మించే నిర్ణయాన్ని తీసుకుంది. జయశంకర్, జయగణేష్, జయలక్ష్మి, భవానీ ముఖ్య పాత్రధారులుగా నవంబర్ నుంచి సెట్స్‌పైకి వెళ్ళే ఆ చిత్రానికి జయలక్ష్మి తండ్రిగారైన దశరథరామిరెడ్డే నిర్మాత, దర్శకుడు. ''తమిళంలో అయితే బిజినెస్ కాస్త ఎంకరేజింగా వుంటుంది. అందుకే మా ఆరంభ చిత్రాన్ని అరవంలో ప్లాన్ చేసాము'' అన్నారు జయలక్ష్మి తండ్రి.

మరో గుడ్ న్యూసండీ అంటూ తన నెక్స్ట్ బర్త్‌డేని తమ కొత్తింట్లో చేసుకోవాలనుకుంటున్నట్టు, డైరెక్టర్స్ కాలనీ నుంచి త్వరలో వేరే ఇంటికి షిఫ్ట్ అవుతున్నట్టు చెప్పింది ఫటాఫట్.

హాలిడేస్‌ను జాలీగా గడపడమంటే భలే హుషారు జయలక్ష్మికి. సినిమాలు తెగచూస్తుంది తీరిక దొరికితే. ఫ్రెండ్స్‌తో కలిసి అడపదడప పేకాడ్డం కూడా ఫటాఫట్ సరదాల్లో ఒకటి.

ఫటాఫట్‌కు శివకుమార్ కాంప్లిమెంట్

ఫటాఫట్ జయలక్ష్మి 21 వ జన్మదినోత్సవ సందర్భంలో తమిళ హీరో శివకుమార్ ఓ రహస్యాన్ని బయటపెట్టారు. ''ఒకప్పుడు (చిన్నప్పుడు) జయలక్ష్మి నా ఫాన్. జయలక్ష్మి సినిమాల్లో నటించడం మొదలెట్టాక ఇదిగో మీ ఫాన్ అంటూ ఆమెను నాకు పరిచయం చేసింది జయసుధ ఒక రోజు'' అన్నాడు శివకుమార్.

ఇది అతిశయోక్తి అని కొందరనుకున్నా నిజాన్ని చెప్పడం ధర్మం అంటూ 'స్వర్గం — నరకం' (తమిళం) చిత్రానికి గాను ఒక రోజు డబ్బింగ్ జరుగుతుండగా, 350 అడుగుల లూప్‌ను గుక్కతిప్పుకోకుండా ఏకధాటిగా చెప్పిన జయలక్ష్మిని చూచి, కాస్త లెంగ్త్ లూప్స్ చెప్పడంలో నేనే దిట్ట అనుకున్న నాకే ఆశ్చర్యాన్ని కల్గించింది జయలక్ష్మి. ఇలాంటి ఆర్టిస్టులను చాలా అరుదుగా చూస్తుంటాము'' అని ఫటాఫట్ ప్రతిభను ప్రేక్షకుల ముందు ప్రస్తావించారు శివకుమార్.

శ్రీ దాసరి నారాయణరావు దర్శకత్వంలో శ్రీ లలితా ఎంటర్ ప్రైజస్ నిర్మిస్తున్న ''కోరికలే గుర్రాలయితే'' వర్ణ చిత్రంలో ఫటాఫట్ సత్తా ఏమిటో మళ్ళీ ప్రస్ఫుటమౌతుంది. మంచి పేరొస్తుందనే నమ్మకాన్ని ప్రకటించారు. ప్రజా దర్శకుడు శ్రీ నారాయణరావు.

తిరుపతిలో ''నామాల తాతయ్య''

కె. హేమాంబరధరరావు దర్శకత్వంలో కె.యస్. రావు నిర్మిస్తున్న ''నామాల తాతయ్య'' చిత్రం షూటింగ్ సెప్టెంబర్ అయిదు నుండి 25 వరకు తిరుపతిలో జరిగింది. రంగనాథ్, రాజబాబు, కాకరాల, మల్లాది, కె. విజయ, జయసుధ, రమాప్రభ, బేబీదుర్గ ఈ చిత్రంలో ముఖ్య పాత్రధారులు. కథ, మాటలు రాజాశివానంద్ సమకూరుస్తున్న ఈ చిత్రానికి పాచు ఛాయాగ్రహణం నిర్వహిస్తున్నారు.



'పట్నంపిల్ల'లో శ్రీదేవి

సినిమా

ఎన్టీఆర్‌తో వర్ణ చిత్రం

డాక్టర్ ఎన్టీరామారావుతో అన్ని చిత్రాలనూ నిర్మించిన (ఒక్క చిత్రం తప్ప) గౌతమి పిక్చర్స్ అధినేత శ్రీ రామబ్రహ్మం ... వచ్చే సంవత్సరం ప్రారంభ నెలలలో, మరో భారీ వర్ణ చిత్రాన్ని తలపెట్టారు.

శ్రీ డి. వి. నరసరాజు కధ, మాటలు సమకూర్చే, శ్రీ ఎన్టీరామారావు నాయక పాత్రను పోషించే చిత్రానికి, ''రా'' అక్షరంతో ప్రారంభమయ్యే యిద్దరిలో ఒకరు దర్శకుడుగా వుండగలరని తెలిసింది.

శ్రీ ఎన్టీఆర్ లేకుండా, చిత్రం తీస్తే ... తను ఎంత నష్టపోయారో, శ్రీ రామబ్రహ్మం వివరించారు.

శోభన్.... వాణిశ్రీ చిత్రానికి లక్ష్మీదీపక్

''పండంటి కాపురం'' చిత్ర దర్శకుడు శ్రీ లక్ష్మీదీపక్‌కు, చాలాకాలం తరువాత మరో మంచి అవకాశం, నటుడు శ్రీ ప్రభాకరరెడ్డి ద్వారా లభించినట్లు వార్త.

''ఖైదీ కాళిదాస్'' చిత్రాన్ని అందించిన వై. ఎల్. ఎన్. పిక్చర్స్ తలపెట్టిన, శోభన్... వాణిశ్రీగార్లు నటిస్తున్న కథాబలం గొన్న వర్ణ చిత్రాన్ని, శ్రీ లక్ష్మీదీపక్ డైరెక్టు చెయ్యగలరని తెలసింది.

వర్తు వున్న లక్ష్మీదీపక్‌గారికి, యీసారి మంచి భవిష్యత్తు వుండాలని ఆశిద్దాం.

నవంబరు నుంచి విఠలాచార్య కొత్త చిత్రం

''జగన్మోహిని'' చిత్రం ప్రేక్షకులను ఘనంగా ఆకర్షించి, చిత్రాన్ని కొన్నవాళ్లకు ధనాన్ని బలంగా ఆర్జించిపెట్టింది.

ఆ చిత్రం విజయాన్ని సాధించడం ... అందరికీ యిష్టమే. ఎందుకంటే...శ్రీ విఠలాచార్య ఎందరికో ఎన్నో రకాలుగా సహాయం చేశారు గనుక.

నవంబరు నుంచి శ్రీ విఠలాచార్య మరో జానపద చిత్రాన్ని నిర్మించడానికి నిర్ణయించారు.

ఏది ఏమయినా... జానపద చిత్రాలను విఠలాచార్యగారే మెరుగ్గా నిర్మించగలరన్నది ప్రజా వాక్యం.


పల్లవికి బలే స్థానం

''తరం మారింది'' చిత్ర నాయిక, కుమారి పల్లవిని అదృష్టదేవత వరించింది. అందుకనే. ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వంటి ప్రముఖ సంస్థలో... పల్లవికి బలే స్థానం లభించింది. విఖ్యాత దర్శకుడు శ్రీ ప్రత్యగాత్మ చిత్రీకరణలో ప్రారంభమైన ''కమలమ్మ కమతం'' వర్ణ చిత్రంలో శ్రీ కృష్ణంరాజు సరసన... పల్లవి జవరాలుగా నటిస్తున్నది.


శ్రీ సి. ఎస్. రావు వ్రాసిన ''కమలమ్మ కమతం'' చిత్రానికి చలపతిరావు సంగీతాన్ని సమకూర్చ... సెల్వరాజ్... జి. వి. సుబ్బారావు, మోహన్‌గాంధీ, డిమిట్‌రావ్, పూర్ణచంద్రరావు, కృష్ణస్వామి ప్రధాన సారధులుగా సాంకేతిక పాత్రలను నిర్వహిస్తున్నారు. శ్రీ ఏ. వి. సుబ్బారావు నిర్మాత.

శ్రీమతి జయంతి టైటిల్ (కమలమ్మ) పాత్రను పోషిస్తున్న ఈ వర్ణ చిత్రంలో అల్లు రామలింగయ్య, గిరిబాబు, వంకాయల, జయభాస్కర్ సహపాత్రధారులు.

ఈ చిత్రం నవయుగ ద్వారా డిశంబరులో విడుదల కాగలదని, నిర్మాత శ్రీ ఏ. వి. సుబ్బారావు తెలిపారు.



'తుఫాన్ మెయిల్'లో నరసింహరాజు


సత్యచిత్ర
తప్పక చూడండి!
కుమార రాజా
సినిమాస్కోప్ ఈస్ట్‌మన్ కలర్
నిర్మాతలు
సత్యనారాయణ
సూర్యనారాయణ
దర్శకత్వం
పి.సాంబశివరావు
విడుదల లక్ష్మీ ఫిలింస్
సోల్ డిస్ట్రిబ్యూటర్స్ లక్ష్మీ కంబైన్స
LAKSHMI PUBS



'శ్రీ రామ రక్ష'లో ...

విలువయిన దాసరి డైరీ

రోజుకు యిరవై నాలుగు గంటలుంటే ... అందులో నాలుగు గంటలను మాత్రమే నిద్రకు కేటాయించారు, శ్రీ దాసరి. తతిమ్మా యిరవై గంటలను...ఆయన తన వృత్తికి అంకితం చేశారు.

ఉదయం ఆరుగంటల నుంచి ... మరుదినం వుదయం రెండు గంటల వరకు శ్రీ దాసరి విసుగు లేకుండా పని చెయ్యడం ... ఆశ్చర్యకరమైన విషయం.

'సంవత్సరానికి మరో రెండు నెలలు వున్నా... అప్పుడు కూడా శ్రీ దాసరికి ఒక్క రోజు విశ్రాంతి దొరకదేమో' అనిపిస్తుంది ... ఆయన అంగీకరించిన చిత్రాలను చూస్తే.

రాబోయే సంవత్సరాలలో తాను మరిన్ని చిత్రాలను చెయ్యగలను, అన్నారు శ్రీ దాసరి.

శ్రీ దాసరి డైరీ చాలా విలువయినది. ఆయన ఒక నిముషం కూడా వృథా చెయ్యరు. ఆయన గుంట ప్రతి రోజూ వందలాది కళాకారులు ... వేషాలకని వస్తూవుంటారు. ఇంత పెరిగినా, ఆయనలో నమ్రత ... మంచితనం ఏ మాత్రం తరగక పోవడం, గమనార్హం.

1979 లో శ్రీ దాసరి మూడు స్టూడియో చిత్రాలకు దర్శకత్వం వహించబోవడం ... శుభావహం. అన్నపూర్ణా స్టూడియోస్ చిత్రం. భాగ్యనగర్ స్టూడియోస్ చిత్రం. విజయా స్టూడియోస్ చిత్రం. ఇవి గాక కళ్యాణరామ పిక్చర్స్‌కు, శ్రీ లక్ష్మీనరసింహ యింటర్నేషనల్‌కు, విజయమాధవీ పిక్చర్స్‌కు, తెలుగు చిత్రకు, యువ చిత్రకు శ్రీ దాసరి అంగీకరించారు.

శ్రీమతి అనురాధాదేవి నిర్మిస్తున్న "రావణుడే రాముడయితే" స్కోప్ వర్ణ చిత్రం, శ్రీ లలితా ఎంటర్‌ప్రైజస్ నిర్మిస్తున్న "కోరికలే గుర్రాలయితే" వర్ణ చిత్రం...అక్టోబరు మాసాంతానికి పూర్తి కాగలవని, శ్రీ దాసరి తెలిపారు.

జరిగిన సంఘటనపై చిత్ర నిర్మాణం

"తాత...మనవడు" శతదినోత్సవ వేడుకలప్పుడు ... ఒకానొకచోట జరిగిన విచిత్ర సంఘటనపై తాను చిత్రీకరించదలచిన చిత్రానికి "నీడ" అని పేరిడినట్టు, శ్రీ దాసరి చెప్పారు.

"నీడ" చిత్రం...తన మనసుకు బాగ నచ్చే విధంగా రూపొందించడానికి అనుకూలపడే కథా బలం సమకూర్చబడిందని, శ్రీ దాసరి తెలిపారు.

"ఇట్ యిజ్ మై యాంబిషన్ పిక్చర్", అన్నారు అగ్ర దర్శకుడు.

కమల్.... జయసుధ నటిస్తున్న కొత్త చిత్రం

తమిళంలో "క్లాసు" ఆడియన్స్‌ను ఆకర్షించిన "అవర్‌గళ్" చిత్రాన్ని, ఆ రోజుల్లో "పోతన" తీసిన భారత్ మోటార్స్ అధినేత

'మనవూరి పాండవులు'లో గీత, ప్రసాద్‌బాబు



శ్రీ విశ్వేశ్వరరావు తెలుగులో నిర్మించడానికి నిర్ణయించారు.

విఖ్యాత చిత్ర దర్శకుడు శ్రీ కె. బాలచందర్ చిత్రీకరణలో రూపొందనున్న "ఇది కథ కాదు" చిత్రంలో జయసుధ... కమలహాసన్ ప్రధాన పాత్రధారులు.

తమిళంలో రజనీకాంత్ పోషించిన పాత్రను, తెలుగులో ఆయన గాకపోతే... చంద్రమోహన్ సరితూగగలడని, యీ కలం విశ్వసిస్తున్నది.

కలియుగ మహాభారతంలో పాంచాలికి ఒక్కడే భర్త!

అన్నారు డైరెక్టర్ హనుమాన్ ప్రసాద్ పాంచాలిని గూర్చి నా సందేహాన్ని నివృత్తి చేస్తూ. "మా 'కలియుగ మహాభారతం' చిత్రంలో పాండవులు ముగ్గురు. దుష్టచతుష్టయం మాత్రం భారతంలోలాగే మా 'కలియుగ మహాభారతం'లో కూడా నలుగురున్నారు. కురు, పాండవ సంగ్రామ సూత్రధారి శ్రీకృష్ణుడూ వున్నాడు మా భారతంలో" అన్నారు స్క్రీన్‌ప్లే రైటర్ హనుమాన్‌ప్రసాద్.

సెప్టెంబర్‌లో జరిగే అవుట్‌డోర్ షెడ్యూల్‌తో చిత్రం పూర్తవుతుంది. ఈ చిత్రంలో ప్రతి పాత్రకు ఒక ప్రత్యేకత వుంది. ప్రతి పాత్ర చాలా ఇంటరెస్టింగ్‌గా నడుస్తుంది. పరుచూరి వ్రాసిన మాటలు బలే వుత్తేజకరంగా వున్నాయి ఒక సెన్‌సేషనల్ చిత్రాన్ని తీస్తున్న నిర్మాత జి. సత్యనారాయణగారిని, చిత్రీకరిస్తున్న దర్శకుడు హనుమాన్‌ప్రసాద్‌ను ప్రేక్షకులు తప్పకుండా మెచ్చుకుంటారని ఇక్కడి సినీ ప్రముఖుల అభిప్రాయం.

సత్యా చిత్ర సెంటిమెంటు

సత్య చిత్ర సంస్థాధినేతలు శ్రీయుతులు సత్యనారాయణ, సూర్యనారాయణల వున్నతాదర్శం పదుగురి ప్రశంసలకు పాత్రమౌతుండడంలో సందేహం లేదు. అందుకు కారణం లేకపోలేదు. పేరున్నవాళ్ళ, పెద్దవాళ్ళచే తమ తమ చిత్రాలకు క్లాప్ చేయించుకోవడం సాధారణంగా పరిశ్రమలో జరుగుతున్న ఆచారం. కానీ సత్యచిత్ర అధినేతలు ఒక సాధారణ సెట్ అసిస్టెంట్‌చే తమ చిత్రాలకు క్లాప్ చేయించి, తమ సెంటిమెంటును ప్రస్ఫుటపరచారు. భారీ ఎత్తున హీరో కృష్ణతో తాము నిర్మిస్తున్న "లారీ డ్రైవర్" స్కోప్ వర్ణ చిత్రాన్ని ఆగష్టు 23 న కాశ్మీర్‌లో ప్రారంభించి, "తంగవేలు" అనే సెట్ అసిస్టెంట్‌చే క్లాప్ చేయించారు. విశేషమేమిటంటే సత్యచిత్ర వారి ఇదివరకటి చిత్రాలకు ["అడవిరాముడు", "గండభేరుండతి" (కన్నడం), కుమారరాజా] కూడా తంగవేల్ క్లాప్ చేయడం గమనార్హం.

హీరో కృష్ణకు జంటగా జయప్రద నటిస్తున్న ఈ చిత్రానికి ముళ్ళపూడి (మాటలు), కె.వి. మహదేవన్ (సంగీతం) వి.యస్ ఆర్ స్వామి (కెమెరా), కె. గోపాలరావు (కూర్పు), సాంకేతిక సారథ్యం వహిస్తున్నారు పి సాంబశివరావు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఎక్కువ భాగం గోవాలో జరుగుతుంది.

మళ్ళీ మీ రోజువారీ పనులు మామూలుగా చేసుకోవాలని ఆత్రుతగా ఉందా మీకు?

గ్లాక్సోస్-డి®

అలసటను ఎదుర్కొనేందుకు


వెంటనే శక్తిని సమకూరుస్తుంది.

గ్లాక్సోస్-డి తో మీరు మామూలుగా మీ ఇంటి పనులు చేసుకునేందుకు సిద్ధం కావచ్చు. గ్లాక్సోస్-డి మీ శరీరానికి కావలసిన ముఖ్యమైన శక్తిని అందజేస్తుంది. డాక్టర్లచే సిఫారసు చేయబడుతున్న గ్లాక్సోస్-డి, విటమిన్ డి, కాల్షియం, భాస్వరంతో బలపరచబడిన హైగ్రేడ్ గ్లూకోజ్.

గ్లాక్సోస్-డి అలసటను దూరం చేసి మళ్ళీ మీరు ఇంటి పనులు మామూలుగా చేసుకొనేందుకు కావలసిన శక్తిని సమకూరుస్తుంది.

గ్లాక్సోస్-డి®

కుటుంబానికంతటికీ ఇట్టే శక్తినిచ్చేందుకు.



dCA/GL/54 TEL

సినిమా

వాణిశ్రీ

''రామచిలక'' చిత్రంలో వాణిశ్రీ నటన చాలా బాగుందండి. హేట్స్ ఆఫ్ టు వాణిశ్రీ ఆ అమ్మాయి మాటలుగానీ, యాక్టింగ్‌గానీ మరొకరికి రావేమో అనేంత కసిగా చేసింది ఆ చిత్రంలో వాణిశ్రీ. ఇదే మాటను మొహమాట పడకుండా నిర్మాతతో కూడా చెప్పాను'' అంది నిర్మలమ్మ.

''వాణిశ్రీ నటన అంత పరిపక్వంగా వుండడానికి కారణం లేకపోలేదు. యాక్ట్ చేసేపుడు ఆ అమ్మాయి తీసుకునే జాగ్రత్తలు పరిశీలించినపుడు అర్థమౌతుంది మనకు అంత గొప్ప నటి ఎలా కాగలిగిందని. షాట్‌కు కాస్త గ్యాప్ దొరికితే చాలు. అద్దం పట్టుకుని మేకప్ సరిచేసుకుంటూనే తన భావ ప్రకటన ఎలా వుందో మరోవైపు పరీక్షించుకుంటూ వుండడం ఆమె కలవాటు. నటించడానికి ముందు నమ్మకం కుదిరేలా తన మనస్సును దృఢపరచుకునిగానీ నటించడాని కుపక్రమించదు వాణిశ్రీ అందుకే అగ్రనటి కాగలిగింది. మరో పదేళ్లవరకూ అగ్రనటిగానే వుంటుంది'' అంది క్యారెక్టర్ ఆర్టిస్ట్ నిర్మల.

లక్ష్మీకుమార్ తీస్తున్న "శివకేశవులు"

శ్రీ అడుసుమిల్లి లక్ష్మీకుమార్ ''శివకేశవులు'' అనే వెరైటీ వర్ణ చిత్రాన్ని నిర్మించడానికి నిర్ణయించి, ఆ చిత్రానికి సంబంధించిన తొలిపాట రికార్డింగ్‌ను సెప్టెంబర్ 14న జెమినీ స్టూడియోలో ఏర్పాటు చేసారు. ఆరోజు ''శివ, శివ, అంటాడు కేశవుడు, కేశవ అంటాడు శివుడు'' అనే వేటూరి గీతాన్ని, బాలు, ఆనంద్ చక్రవర్తి స్వరకల్పనలో గానం చేసారు.

''చిత్రంలో మొత్తం ఆరు పాటలుంటాయి శివకేశవులుగా చంద్రమోహన్, మురళీమోహన్ నటిస్తున్నారు. సెప్టెంబర్ 20 నుంచి హైదరాబాద్ ప్రాంతంలో షూటింగ్ ప్రారంభం'' అన్నారు నిర్మాత శ్రీ అడుసుమిల్లి లక్ష్మీకుమార్.

''ప్రభ, రావుగోపాలరావు, రాజబాబు, జయమాలిని, పండరీబాయి తదితర తారాగణం. సత్యానంద్ (మాటలు) చక్రవర్తి (సంగీతం), కన్నప్ప (కెమెరా), రాజేంద్రకుమార్ (కళ), కె. గోపాలరావు (కూర్పు), జాస్తి అండ్ జాస్తి (నిర్వహణ) మా చిత్రానికి సాంకేతిక బలం'' అన్నారు దర్శకుడు శ్రీ జి. సి. శేఖర్.

నవంబర్ నుంచి

గోపీకృష్ణామూవీస్ తదుపరి చిత్రాన్ని ప్రారంభించాలని అనుకుంటున్నాము. సబ్జక్ట్ ఫైనలైజ్ కాలేదు. అక్టోబర్‌లో ఆరంభించా లనుకుని కూడా అందుకే వాయిదా పడింది అన్నారు హీరో కృష్ణంరాజు తమ సొంత చిత్రాన్ని గూర్చి చెబుతూ.


''మన వూరి పాండవులు'' చిత్రంలో మీ గెటప్, స్టిల్స్, చూస్తుంటే మళ్లీ ఓ వెరైటీని మీనుంచి ఆశించవచ్చు అనే నమ్మకం కుదురుతుంది మాకు. మీరేమంటారు అనడిగినందుకు ''ఇటీజ్ రియల్లీ ఎ టిపికల్ రోల్. భారతంలో కృష్ణుడిలాంటి పాత్ర. మీరన్నట్టు వెరైటీ పాత్రే. కొత్తదనం (నటనలో) చూపించడానికి నా శక్తిమేరకు కృషి చేసాను. ప్రేక్షకుల తీర్పంటూ ఒకటుందిగా'' అన్నారు నవ్వుతూ కృష్ణంరాజుగారు.

''రిలీజ్ ఎప్పుడనుకుంటున్నారు'' అన్న ప్రశ్నకు ''సినిమా రిలీజులు చూస్తుంటే భయమేస్తూందండీ. సెప్టెంబర్ 18న సెన్సార్ అయింది. చిన్నవాణ్ణిగదా. కాస్త నిదానిద్దాం అనుకుంటున్నాను'' అన్నారు ''మన వూరి పాండవులు'' చిత్ర నిర్మాత మేకప్ జయకృష్ణగారు.

శ్రీదేవి వయస్సు 15 నే నట

''పదహారేళ్ల వయసు'' చిత్రంలో నాయిక పాత్రను పోషించిన కుమారి శ్రీదేవి వయస్సు 15 సంవత్సరాలేనట. వింతేమిటంటే 14 ఏండ్ల వయస్సపుడే ''పదునరువయిదినిల్'' అనే తమిళ చిత్రంలో నటించిందట. 15వ ఏట అదే పాత్రను తెలుగులో, హిందీలోకూడా పోషించిందట. పదహారు నిండకుండానే ''పదహారేళ్ల వయసు'' చిత్రంలో నటించిన శ్రీదేవి మార్కెట్ ప్రస్తుతం ఆశాజనకంగా వుంది. తమిళం, తెలుగు, మళయాళం, హిందీ చిత్రాల్లో నటిస్తున్న జవ్వని శ్రీదేవి సుస్థిరమైన ఫ్యూచర్‌కు గట్టిపునాదులు వేసుకుంటూంది.

— *జనప్రియ* ★



ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

కె. వి. ఎస్. ఆర్. — కర్నూలు.

కె.రా. గారూ మీరాడువారా? మగవారా?

★ అవసరాన్ని బట్టి అవతారం మార్చేస్తాను మురళీధరా! ఆడించేవారి నోట ఆట పట్టించడం. పాడేవారిని భరించలేక పోతే నోరుమూయించడం: కూడా—జాణ తనమే కదా!!

ఎస్. కె. — ఎమ్మిగనూరు.

ఆడదానికి అందమె పొగరంటారు. ఆ పొగరు మగవాడితో పోరాటము...

★ తెలుగు సినీ హీరో డైలాగులాగావుంది—మీ మాట...అర్థం లేకుండా.

వి. వి. ఆర్. — ఖమ్మం.

రచయితలకు ఎత్తయిన ప్రదేశమున మంచి ఊహలు కలుగుతాయంటారు. మరి మీరు ఎక్కడ కూర్చుని రచిస్తూవుంటారు?

★ అందుకే కాబోలు తిరుపతి కొండలమీద ఊటీ కొండలమీదా కూర్చుని రాస్తున్నారీ మధ్య కొందరు రచయిత్రులు!...'నా కోడీ నా కుంపటీ' అన్నట్టు—నా చుట్టూ నా వాళ్ళ గోలలేక నేను రాయలేను! అంచేత నా రచనలూ ఊహలూ కూడా కాస్త నేలమీద వుండి పోతున్నాయి!!

పి. ఎస్. ఎస్. ఆర్. — హైదరాబాదు.

ప్రస్తుత నాగరికతా కాలంలో మీ బోటి స్త్రీలు కాలేజీలో చదివే విద్యార్థినులకు ఉచిత సలహాలిచ్చుకోకుండా పురుషపుంగవాలపై విరుచుకు పడతారెందుకో అర్థం కావటంలేదు...మీ కామెంట్?

★ ఉచిత సలహా పనిచేయదు! చిన్నమెత్తు వేళాకోళం వ్యంగ్యంచాలు — మీలాంటి వాళ్ళు (అదే పురుషపుంగవాలు మీరు)—మండిపడి పోవడానికి!! ఇంతటి రాజమార్గముండగా...చెట్టుకింద జ్యోస్యునిలాగా కాలేజీల ముందు కాపలా కాయడమెందుకు నేను? ఆ పని మీలాంటి రోమియోలు చేస్తారు కద.

కె. ఎస్. ఎస్. ఆర్. — పుత్తూరు.

మీరు జవాబులో (30-6-78) స్త్రీని గురించే ఎక్కువగా ఆలోచించారుగానీ స్త్రీలచేత మోసగింప బడిన వారిని గురించి ఆలోచించలేదు... ఎందుకంటే నేను ఒక స్త్రీ చేత మోసగింపబడి నరక యాతన అనుభవిస్తున్నాను. జీవితంపై విరక్తి పుడుతున్నది. ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి ఏర్పడుతున్నది.

★ చూశారా? మీ గుర్తించిన బాధే మీది. రేపీ ఆ స్త్రీ క్షమించమని తిరిగివస్తే చేరదీసి ఆదరిస్తారా?! ఆదరించలేరు సరికదా, క్షణానికి లక్ష సార్లు దెప్పుతారు. ఆమె జీవితం నరక ప్రాయం చేస్తారు. ఈ సంఘంలో స్త్రీ పట్ల చూపే విలువలకీ, పురుషుని పట్ల చూపే విలువలకీ—తేడా వున్నంతవరకూ ఇది యింతే—ఆడది ఆదరించబడాలి మగవాడు ఆదరించాలి. ఆడది పోషింపబడాలి. మగవాడు పోషించాలి...కాని ఆడది పోషిస్తున్నా, బాధ్యతలు పూర్తిగా వహిస్తున్నా—అది చెప్పరాదదు. అది ఒప్పుకో కూడదు. ఆడదాని సంపాదనకి మగవాని సంపాదనకీ వ్యత్యాసం చూపించే—లక్షణం పోయి ఇద్దరూ ఒకటే అనే అభిప్రాయం ఏర్పడేదాకా—ఈ సమాజంలో ఆడదే మోసగింపబడుతూ వుంటుంది: ఆడదే మాట పడుతూవుంటుంది—ఆడదే—సర్వస్వాన్ని ధారపోసి కూడా బానిసలాగే బ్రతుకుతూవుంటుంది. ఇది పౌరుషంకొద్దీకాదన్నా, ఒప్పుకోక తప్పని నిజం. విద్య, సంపాదన, స్వేచ్ఛ, సమానత్వం—అన్నీ వుండీ వాటి ప్రయోజనాలని అనుభవించలేని నేటి దగా పడిన స్త్రీ జాతి మారాలంటే—ఆ మార్పు సంఘంలోంచి రావాలిగాని—చట్టాల్లోంచి కాదు.

వి. ఆర్. ఎస్. — చేబ్రోలు.

పత్రిక అట్టమీద మొత్తంగా కలర్‌లో మీ ఫోటో చూడాలని వుంది. నా కోరిక తీరుతుందా?

★ జనహాని కరమైన కోరికలు—క్రిమినల్ అఫెన్సుగా పరిగణిస్తారు సోదరా! పైకిచెప్పకు.

కె. వి. ఆర్. కె. — పాలకొల్లు.

రామలక్ష్మిగారూ మీ ఆరోగ్యం సరిగా లేదంటకదండీ! కాస్త వైద్యం చేయించు కొందురూ మా పూరొచ్చి...చాలా మంది స్పెషలిస్టులున్నారు.

★ నయమే! ఇంకా పాలకొల్లు గోపురం ఎత్తడానికి రమ్మంటున్నారేమోనని హడిలిచచ్చాను. అసలేపని అంటే బద్ధకం నాకు! రమణా బెంగ పడకు—మా పూళ్ళోలేని స్పెషలిస్టులా మీ పూళ్ళో!! ఆరోగ్యం శరీరానికి సంబంధించినది—మనస్సుకే రోగం రానంతవరకూ మరేం ఫరవాలేదు...ఇక అదీ పాడైందనుకోండి... మీ పూరుదాకా రానక్కరలేదు—ఇక్కడే కిల్పాక్కుంది! అక్కడ నాలాంటి వాళ్ళు ఎందరో...హిహిహిహి...

కె. ఎస్. ఆర్. — హైదరాబాదు.

స్త్రీ స్వాతంత్ర్యం మీద ఎన్నో కబుర్లు చెప్పే మీరు సెన్సారు బోర్డు మెంబరైవుండి—సినిమాలలో హీరోయిన్లు నగ్న ప్రదర్శన చేస్తుంటే మీరు మీ కత్తెరతో ఎందుకు బంధించలేక పోతున్నారు?

★ ఒక్కొక్క సినిమాకి కత్తెర ఐదుగురు కలిసి చూస్తారు. రెండు గడియారాలొక్క టైము చూపించవంటారు. ఇక ఇంతమంది ఏకగ్రీవాభిప్రాయం ప్రకటించడానికి రావడం ఎంత కష్టమో ఆలోచించండి. ఇవికాక ప్రతి కత్తెర వేటుకీ—పదిరకాల హక్కులతో నిర్మాత కోర్టు కెక్కడానికి అవకాశాలున్నాయి. ప్రతి కత్తెర వేటూ ఏదో ఒక నిబంధనకింద యిమడ్చాలి... ఇక విడాకుల చట్టంలోలాగా "పడకపోడంచాలు" విడిపోడానికి అన్నట్టు "అసహ్యంగా వుండడం చాలు" తీసివేయడానికి అన్నదేదో రావాలి! అప్పుడే మీరన్నవి తొలగించడం సాధ్యం. యింకో సులభమైన దారి—ప్రేక్షకులు తిరగబడ్డం!

3-11-78
దీపావళి సంచిక
కొత్త సీరియల్‌తో

వంటలు

బ్రెడ్ దోశె

కావలసినవి : బియ్యం అర కే.జి., మెంతులు 2 స్పూనులు, పెరుగు ఒక గ్లాసుడు.

తయారు చేయువిధానం : బియ్యము మూడురోజులు నాన పెట్టాలి. మూడోరోజు పొద్దున్న బాగా కడిగి నీళ్ళన్నీ పారబోసి దాంట్లో పెరుగు, మెంతులు వేసి నాన పెట్టాలి. ఆ సాయంత్రం ఉప్పు వేసి మెత్తగా రుబ్బి ఉంచుకోవాలి. నాలుగవ రోజు పెనములో కొంచెం నూనెవేసి చారు గరిటెతో రెండు గరిటెలు వేసి మూత పెట్టాలి వేసే ముందు సోడా ఉప్పుకూడా కలుపుకోవాలి. బ్రెడ్‌లాగా బాగా లావుగా ఉండి చాలా రుచిగా ఉంటాయి ఈ దోశెలు. ఒక్కసారి తిన్నారంటే కొంచెం ప్రయాస అయినా ఇంటిల్లిపాది మళ్ళీ అవే కావాలంటారు. చేసుకుంటే చాలా బాగుంటుంది.

—నీలూ వత్సల్.

గ్రుడ్డుతో బిర్యానీ

కావలసినవి : సన్నబియ్యం ఒక కేజీ, గ్రుడ్లు ఒక డజను, నెయ్యి అరకిలో. పెరుగు టీ కప్పుడు, జీడిపప్పు 100 గ్రాములు, కొబ్బరికాయ ఒకటి, ఉల్లిపాయలు కారం, అల్లం, దాల్చినచెక్క తగినంత.

తయారుచేయు విధానం : శాకాహారపు గ్రుడ్లను బాగా వుడకబెట్టి తొక్కతీసి చిన్న చిన్న ముక్కలుగా తరిగి ఒక గిన్నెలో వుంచుకొనవలెను. సన్న బియ్యంను పలుకు లేకుండా అన్నం వార్చాలి. దళసరి గిన్నెలో గరంమసాలా సామాన్లను నెయ్యిలోవేసి వేగ నివ్వాలి. అటుపైన యిందులో అన్నంవేసి బాగా కలియ బెట్టాలి. కొబ్బరికాయ నుండి పాలు తీసి ఈ మిశ్రమంలో వేసి సన్నని మంటపై కొద్దిసేపు వుంచిన తరువాత గ్రుడ్డు ముక్కలను వెయ్యాలి. ఇష్టమున్న వారు పుదీనా ఆకుల్ని, టమాటో ముక్కల్ని నిమ్మరసాన్ని వేసుకోవచ్చును.

— కె. సీత.


సొగసునిచ్చే శింగార్ కుంకుమ్
మామూలు కుంకుమ్ వెలలో
శింగార్. అవును అదే మేలైన కుంకుమ్. కారిపోదు, కరిగిపోదు, చిట్లిపోదు, మచ్చలు పడదు. అందమైన నుదుటికి మరింత అందాన్నిచ్చే కుంకుమ్-శింగార్. ఉత్కృష్టమైన పదార్థాలతో తయారుచేయబడింది. రెండు రకాల జాడీలలో దొరుకుతుంది.
• చిన్న జాడీ - 60 పైసలు (45 రోజులకు సరిపోతుంది)
• పెద్ద జాడీ - రూ. 1/- (90 రోజులకు సరిపోతుంది)
నకిలీవి వస్తున్నాయి జాగ్రత్త, శింగార్ పేరు చూసి కొనండి.
మేలైనది,
పొదుపైనది
శింగార్
కుంకుమ్ జాడీ
నకిలీవి వస్తున్నాయి జాగ్రత్త శింగార్ పేరు చూసి కొనండి.
Shingar
Shingar
ప్యారమౌంట్ ప్రొడక్ట్స్,
everest/78/SH/228-B


భారత పాకిస్తాన్‌ల మధ్య క్రికెట్ పోరాటం !

భారత–పాకిస్తాన్‌ల మధ్య పదిహేడు సంవత్సరాల తరువాత క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలు సెప్టెంబరు 27 నుంచి నవంబరు 20 దాకా జరుగుతాయి.

భారత - పాకిస్తాన్‌ల మధ్య ఈ సీరిస్‌లో మూడు రోజుల పోటీలు ఆరు; ఒక రోజు పోటీలు మూడు, మూడు టెస్టు పోటీలు జరుగుతాయి.

మొదటి టెస్టు అక్టోబరు 16 నుంచి 21 వరకు ఫైజలాబాద్‌లో; రెండవ టెస్టు అక్టోబరు 27 నుంచి నవంబరు 1 వరకు లాహోర్‌లో; మూడవది, ఆఖరిది అయిన టెస్టు నవంబరు 14 నుంచి 20 వరకు కరాచీలో జరుగుతాయి.

భారత క్రికెట్ జట్టుకు నాయకునిగా బిషన్‌సింగ్ బేడీని ఎన్నిక చేశారు. భారత క్రికెట్ జట్టుకు ఎన్నిక చేసిన మిగిలిన



క్రీడాకారులు : సునీల్ గవాస్కర్ (వైస్ కాప్టెన్); చేతన్ చౌహాన్; వెంగ్‌సర్కార్; ఎ. డి. గైక్వాడ్ గుండప్ప విశ్వనాథ్; మొహిందర్ అమరనాథ్; సురేందర్ అమరనాథ్; యస్. యం. హెచ్. కిర్మాణి (వికెట్‌కీపర్); కర్సన్ ఘావ్రీ; ఇ.ఎ.ఎస్. ప్రసన్న; బి. యస్. చంద్రశేఖర్; యస్. వెంకటరాఘవన్; భారత్‌రెడ్డి (వికెట్ కీపర్); యశ్‌పాల్‌శర్మ; కపిల్‌దేవ్.

పాకిస్తాన్ క్రికెట్ జట్టుకు ముస్తాక్ మహమ్మద్ నాయకత్వం వహిస్తారు. ఆసిఫ్ ఇక్బల్ వైస్ కాప్టెన్‌గా ఉంటారు.

ఇంతవరకు భారత–పాక్ క్రికెట్ జట్ల మధ్య జరిగిన 15 టెస్టు పోటీలలో 12 టెస్టులు సమఉజ్జీ అయినాయి. భారత్ రెండు, పాకిస్తాన్ ఒకటి గెలుచుకున్నాయి.

మన జట్టులో మంచి 'ఫాస్ట్ బవులర్'లు –గవాస్కర్‌కి జోడీగా చెప్పుకోతగ్గ మంచి ఓపెనింగ్ బ్యాట్స్‌మాన్ లేకపోయినా; క్రిందటిసారి ఆస్ట్రేలియా పర్యటించి మన జట్టు మంచిపేరు తెచ్చుకున్నట్లే, ఇప్పుడు కూడా పాకిస్తాన్‌తో ఆడి కీర్తి గడిస్తారని క్రికెట్ నిపుణులు అంటున్నారు.

[జె. డి. ప్రసాదరావు]

* నీళ్లనుంచి ప్రాణవాయువు తీసే సూక్ష్మక్రిములు! *

నీటిని ప్రాణవాయువుగా, ఉదజనిగా మార్చే సూక్ష్మజీవులను సోవియట్ మైక్రో బయాలజిస్టులు కుంటలలో కనుగొన్నారు. ఈ సూక్ష్మజీవులు వాటి ప్రధాన కార్యకలాపాలకి అవసరమైన వెలుగు, ఇంధనం చాలినంతగా వుంటే ప్రయోగశాలలో సైతం జీవించి, తమ 'పని' కొనసాగించ గలవని భావించబడుతూ వుంది. ఈ కుంటలలో జీవించే సూక్ష్మ క్రిముల కంటే, అనేక రెట్లు త్వరితంగా నీటిని మార్చగల సూక్ష్మ జీవుల రకాలను ఉత్పత్తి చేయడానికి ప్రస్తుతం సోవియట్ మైక్రో బయాలజిస్టులు, కృషిచేస్తున్నారు. మైక్రో బయాలజీ పద్ధతిని వుపయోగించి ఉదజనిని భారీ ఎత్తున ఉత్పత్తి చేయగలమని శాస్త్ర వేత్తలు భావిస్తూ వున్నారు.

సూక్ష్మ జీవులను పరిశ్రమలలో ఉపయోగించే అనుభవం సోవియట్ యూనియన్‌కు వుందని మాస్కో విశ్వవిద్యాలయంలోని మైక్రో బయాలజీ శాఖ అధిపతి యెలెనా కొండ్రాత్యేవా చెప్పారు. మెతేన్ పై జీవిస్తున్న బాక్టీరియాను ఇటీవల సోవియట్ శాస్త్ర వేత్తలు సేకరించారు. ఈ బాక్టీరియాను గనులలో వాయు శుద్ధికి వినియోగిస్తున్నారు.

పరిసర పరిరక్షణ, పశుపోషణ, ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తి, కొత్త మందులు, విటమిన్ల సృష్టి లాంటి ప్రధానమైన సమస్యల పరిష్కారానికి ఇలా సూక్ష్మజీవి తోడ్పడుతుంది.

రాగద్వేషాలు

(9వ పేజీ తరువాయి)

పేపర్ ప్రకటనల అమెరికా పెళ్ళి సంబంధాలవలన ఇన్ని సంసారాలు పాడైపోతున్నాయి. ఇన్ని జీవితాలు నాశనమైపోతున్నాయి. ఇంతమంది ఆడపిల్లలు బలైపోతున్నారు. ఇవన్నీ చూసి — తెలిసీ మళ్ళీ అదే మార్గాన నడిచేవాళ్ళు మన దేశంలో కోకొల్లలు. వీళ్ళని ఏం చెయ్యాలంటారు చెప్పండి?"

"నాకు తెలీకడుగుతాను. అందరూ ఈ విధంగానే వుంటారంటారా? ఎక్కడా మంచివాళ్ళే వుండరా? అవి వాళ్ళ—వాళ్ళ అదృష్టాలపై ఆధారపడి వుంటుందను కుంటాను..."

"మీరు వేదాంత ధోరణికి వెళ్ళిపోతున్నారు..." నవ్వాడు శ్రీకర్.

"వేదాంత ధోరణి కొంత పరిధయ్యాక అవసరమే — శ్రీకర్ గార్! లేకపోతే మనిషి జీవించలేడు."

"మీరన్నదీ నిజమే! మీకింకా కొన్ని వింత విషయాలు చెప్పమంటారా?"

"ఏమిటవి?"

"ఇప్పటి వరకు మీ అనుభవంలో మగవాళ్ళు మాత్రమే మోసగాళ్ళు" అని చూశారు. ఆడవాళ్ళల్లో గూడా ఈ విధంగానే మొగవాళ్ళని మోసం చేసిన వారు కూడా వున్నారు — ఈ దేశంలోనే!

మాకు తెలిసిన కుటుంబమే. భార్యా — భర్త — ఒక పిల్లవాడు. ఇద్దరూ మన దేశస్థులే. ఆవిడ ఉద్యోగ రీత్యా ఫారిన్ వెళ్ళింది. అక్కడ కొన్నాళ్ళకి ఒక విదేశీయునితో స్నేహం — ప్రేమగా మారి పెళ్ళికి దారి తీసింది. పిల్లవాడ్ని — భర్తని వదిలి — ఆమె ఆ భర్తతో ఫారిన్‌లోనే వుండిపోయింది. ఇండియా అసలు వెళ్ళలేదు. మొదటి భర్తకి పిచ్చి పట్టింది. మొదట ఇద్దరూ ఇష్టపడే పెళ్ళి చేసుకున్నారు — పైగా! తమాషాగా లేదూ?"

"అయితే నాలాంటి అభాగ్యులు చాలా మందే వున్నారన్న మాట!" అంది ఇందిర విషాదంగా నవ్వుతూ.

"ఇంకా వున్నాయి — మీరు వినేటట్లయితే..."

"మీరు కల్పించి చెప్పడంలేదు కదా?" నవ్వింది ఇందిర.

"మా శ్రీలత కథ ఎంత నిజమో — ఇదీ అంతే నిజం. మీరు నమ్మకపోతే... నేనేం చెయ్యను?" అలిగినట్లు మొహం పెట్టడంతో ఇందిరా — శ్రీలతా గూడా నవ్వారు.

"సరే — చెప్పండయితే..."

"అతడు ఒక్కడే కొడుకు. బాగా డబ్బున్నవాళ్ళు. పై చదువులకంటూ ఫారిన్ వెళ్ళిన ఈ సుపుత్రుడు అక్కడే ఒక విదేశీ స్త్రీని కట్టుకున్నాడు. ఆవిడకి అంతకు ముందే పెళ్ళయి — ఇద్దరు పిల్లలుట గూడా! ఆ మొగుణ్ణి వదిలేసి — ఆమె ఇతడ్ని చేసుకుంది. పిల్లలు గూడా ఇక్కడే. ఎన్నాళ్ళకీ ఇండియారాడు. తల్లీ — తండ్రీ ఇది తెలిసి తల్లడిల్లి పోయారు. మొత్తుకున్నారు. అట్లా కొన్నేళ్ళు గడిచాయి. ఆ అబ్బాయి మీద ఆశలన్నీ నిరాశ చేసుకున్నారు తల్లి దండ్రులు. చివరికి ఏం బుద్ధి పుట్టిందో — మరి — ఇండియా వచ్చాడు ఒకసారి! అదే ఛాన్సనుకుని — విడతెరిపి లేకుండా — చెవినిల్లు కట్టుకుని — ఆ పిల్లని వదిలెయ్యమనీ — ఇక్కడి కొచ్చి సలక్షణంగా పెళ్ళాడమనీ — చెప్పారు — బతిమాలారు — తల్లి దండ్రులు పరిపరి విధాల బోధించారు.

ఏ కళనున్నాడో ఆ అబ్బాయి అంగీకరించాడు. తండ్రి కూడా కొడుకుతో అక్కడికి వెళ్ళి ఆ అమ్మాయితో తెగ దెంపులు చేసుకుని వచ్చారు ... ఆ పిల్లకి పెద్ద మొత్తంగా డబ్బు ఇస్తేగాని విడిపోవడానికి వప్పుకోలేదుట!

ఆ తరువాత ఈ అబ్బాయికి మన ఇండియన్ పిల్లతో పెళ్ళి జరిపించారు.

వాళ్ళిప్పుడు ఇండియాలోనే వున్నారు. అంతమాత్రాన ఇక్కడికి వచ్చినవాళ్ళంతా అట్లాంటి వాళ్ళని కాదు నేననేది. అది ఒక్కొక్కళ్ళ సంస్కారాన్నిబట్టి వుంటుంది.

రా గ ద్వే షా లు

తరువాత ఆత్మ నిగ్రహం కూడా ఎంతో అవసరం మనిషికి. మన నిర్ణయాలు గట్టివైతే ఎవ్వరూ మనల్ని వెడగొట్టలేరు."

"అవును" అంది ఇందిర సాలోచనగా.

"ఇక్కడికి వచ్చిగూడా చెక్కు చెదర గుండా పది మందికీ ఆదర్శంగా వెలిగి మంచి పేరుతో ఇండియాకి తిరిగి వచ్చిన వాళ్లు కూడా చాలామందే వున్నారు. కాని– వాళ్ళు అందరి దృష్టిలో పడరు. అందరి దృష్టిలో పడేవీ – అందరినీ ఆకర్షించేవీ మన జీవితాల లాంటివే!"

భోజనాలయి లేచారు.

నిద్ర పోనీకుండా రాత్రంతా ఏవేవో ఆలోచనలు వస్తూనే వున్నాయి ఇందిరకి!

శ్రీలతది గూడా తనదిలాంటి జీవితమే! కానీ ఆమె అదృష్టవంతురాలు. ఆ పీడకలని మర్చిపోయి హాయిగా బతక గలుగుతోంది. తనో? తన బాధ తీరేది కాదు. ఒంటరిగా వున్నప్పుడు యమయాతన పెడుతోంది అవమానాగ్ని. ఎంతో తెలివిగలది అనుకున్న తమ ఎంత దారుణంగా మోస పోయింది.

ఎంత దుర్మార్గుడు ఆనంద్. అతడికి కావల్సింది శరీర సుఖమే! అదంతా తను ప్రేమేననుకుంది! అసలు ప్రేమంటే ఏమిటి? ఒకరికోసం మరొకరు ప్రాణమివ్వాలన్నా వెనుదియ్యగూడదు. అది ప్రేమ! ప్రేమ శరీర సుఖాలకు అతీతమైనది– లోకోత్తరమైంది. ప్రేమలో వుండేది అభిమానం– అనురాగం– ఆత్మీయత– మమకారం– కానీ– మోసం– వంచన– దగా– అబద్ధం– ద్రోహం కాదు. అది మానసికమైనది. ప్రేమకు ప్రతిఫలం ప్రేమే!


తను ఆనంద్‌ని విపరీతంగా ప్రేమించింది. 'తనకు' అనేది ఏదీ మిగుల్చుకోకుండా– అతడికి సర్వస్వం అర్పించింది. అందులో ఆనందాన్ని పొందింది సంతృప్తిని పొందింది. తనుకూడా అతడు తనకి ప్రేమని అట్లాగే ఇవ్వాలని ఆశించింది. ఇచ్చాడని భ్రాంతి పొందింది.

కానీ అతడికి నిలువెల్లా విషమే! అంతా నాటకమే! తనంటే అసలు ప్రేమేలేదు. తను ప్రేమించినదానికి తనకి లభించిన ఫలితం ద్రోహం– మోసం? తల్చుకుంటేనే గుండె మండిపోతోంది.

అతడి నిజస్వరూపం తెలుసుకున్న మనసు అతడి మీది ప్రేమంతా ద్వేషంగా మార్చుకుంటోంది. అతడి ఊసే భరించలేక పోతోంది. ఊహ స హిం చ లే క పోతోంది.

కానీ – జరిగింది పీడకలగా మర్చిపోవాలంటే తనకే సాధ్యం కావడం లేదు. గునపంతో గుచ్చినట్లు – గతాన్ని తవ్వి పోస్తోంది రంపపు కోత లాంటి బాధ!

అత్త మామలు బతికుంటే కథ వేరేగా వుండేదేమో? వాళ్ళకోసమయినా తనతో మంచిగా వుండే వాడేమో? మంచికి



ప్రాణమిస్తుంది తను. తనా మోసంలోనే బతికేదా? ఆదే ఆనందంగా వుండేదా? ఏమో!

అయినా నిజాలు ఒక్కొక్కసారి ఎంత భయంకరంగా వుంటాయి? అంతా తను చేసుకున్న కర్మ గాకపోతే - అత్త మామ లిద్దరూ ఒకేసారి పోవడమేమిటి?

ఏ జన్మలోనో ఏదో ఒక జంటను తను విడదీసి వుంటుంది - దాని ఫలితమే ఈ బాధేమో తనకి. అంతే. కర్మ సిద్ధాంతాన్ని నమ్మాల్సిందే - ఏదో ఒక రీతిని బతుకు రాజీ పడకబోతే జీవితం గడపడం ఎట్లా?

[ఇంకా ఉంది]



పిచ్చి మనుష్యులు

పులికంటి కృష్ణారెడ్డి



మా యింటి ఎదురుగా ఓ డాక్టరున్నాడు. మా వీధిలో యిద్దరు ముగ్గురు డాక్టర్లున్నారు. మా ఊళ్లో చాలమంది డాక్టర్లున్నారు.

మా ఊళ్లో వున్న డాక్టర్ల కందరికీ నాలుగు చేతులు!

ఆశ్చర్యపడుతున్నారా? — అవసరంలేదు. పుట్టుకకి వరకు భగవంతుని దృష్టిలో అందరు సమానమే! అంటే — ప్రతి వ్యక్తికీ ఒక్క తల రెండు కళ్లు రెండు చేతులు.. యిలా యిచ్చాడు. ఒకరికి కారు మరొకడికి కాలి నడక ... ఒకనికి మేడ మరొకనికి చెట్టు నీడ యిచ్చిన పక్షపాతికి ఆకారాల మీద అధికారం చేజిక్కి వుంటే— ఈ ప్రపంచం ఓ ప్రదర్శన శాలగా తయారయ్యేది. బ్రతికిపోయాం వాడి అధికార భ్రష్టుడయ్యాడు కాబట్టి. అందు వలన అందరి కున్నట్లు మా ఊళ్లో డాక్టర్లకు కూడా రెండు చేతులే!—అయితే సంపాదన దగ్గరికి వచ్చేసరికి నాలుగు చేతులు!!

పిచ్చి మనుష్యులు! ఆపదలోవున్న వాళ్ళ బలహీనతలపై — బల ప్రదర్శన జరిపే వైద్యోనారాయణోహరులు! నిజానికి ఈ జీవితం మీద వెగటు, ఏమినెత్తిన కట్టుకొని పోతాం? అన్న వేదాంతం— ఈ డాక్టర్లకే బాగా ఒంటపట్టాలి. కారణం— ఎన్నో దిక్కులేని చావులు నిష్కారణమైన చావులు ప్రతిదినం వాళ్ళ కండ్ల ముందు ఎన్నో జరిగిపోతుంటాయి కాబట్టి. కానీ ఆ పరిజ్ఞానాన్ని పక్కకునెట్టి రోగుల డబ్బుతో భోగాలనుభవించడం పిచ్చితనం కాక మరే మవుతుంది? అందుకే ఆసుపత్రిలో జీతగాడి వేషంలో రెండు, యింట్లో సొంతగాడి వేషంలో రెండు వెరశి వాళ్లకు నాలుగు చేతులు. ఆలూ మొగుడు యిద్దరు డాక్టర్లయితే నాలుగు నాలుగు ఎనిమిది చేతులు!

అయితే మా యింటి ఎదుటి డాక్టరు గారికి మాత్రం రెండే చేతులు. అభ్యుదయ భావాలు కలిగిన ఆ డాక్టరు మంచి మనిషి. సేవది చేయగలిగేది ఏదో ఆ రోగి నారాయణ సేవ ఆసుపత్రిలోనే రెండు చేతులకే పరిమితం చేసుకొన్నట్లుంది. అందువలన అతని యిల్లు ఉదయంకానీ సాయంత్రంకానీ ప్రశాంతంగా వుంటుంది. మా యింటి ప్రక్కన ఓ పండ్ల మండీ వుంది. దానిని చూచి మరొకటి మా యింటికి కాస్త దిగువగా వెలిసింది. ఈ రెండింటిని చూచి వరుసగా మూడు... నాలుగు...ఒక్కదాని వెంబడి మరొక్కటి పండ్ల మండీలు ప్రారంభింప బడ్డాయి. మా వీధి పేరు బండ్లవీధి. అదికాస్త పండ్ల వీధిగా మారింది.

మావీధి కిటువైపు అటువైపు పెద్ద పెద్ద సిమెంటు కాలువలున్నాయి. అవి మురుగు కాలువలు. మొలలోతున్న మురుగు కాలువలు!

పండ్ల మండీల ప్రముఖులు కుళ్లిపోయిన చెడిపోయిన పండ్లను ఆ కాలువల్లో కుమ్మరిస్తుంటారు. అమ్మలక్కలు చెత్తా చెదారాన్ని పోస్తుంటారు. చిన్న పిల్లలు చొక్కా నిక్కరు విప్పి ఆ కాలువ గట్లమీద కూర్చుంటారు. కలిగినవాడు పెట్టే బాధల్ని లేనివాడు భరించినట్లు అన్నింటిని తమలో యిముడ్చుకొంటుంటాయి ఆ మురుగు కాలువలు. అయితే అప్పుడప్పుడు కసిదీర నసాళాలు అంటుకొనేటట్లు దుర్గంధాన్ని అంటిస్తుంటాయి!

మా యింటి ముందు ఓ పిచ్చిది తిరుగాడుతూ ఉంటుంది,

మా యింటి ముందరి ప్రదేశానికి ఆ పిచ్చిదానికి ఏదో ఋణానుబంధం వున్నట్లుంది. నాలుగు గోడల మధ్య వగ్గుంకోసం నాలుకలు తడుపుకొనే ప్రబుద్ధులు దినములతో ప్రత్యక్ష మవుతున్న పిచ్చిదానిని

పిచ్చిమనుష్యులు

భరించలేక పోయారు. అక్కడినుండి దానిని తరిమివేయడానికి చాల ప్రయత్నాలు చేశారు. అది కూర్చున్నచోట మంచినీళ్ళు కుమ్మరించారు. ఉడుకునీళ్ళు చల్లారు. కొట్టారు. పెద్దలే యిలా వ్యవహరించే సరికి పిల్లలు ఉడుకుమోతుతనంతో రాళ్ళు రువ్వారు. చిల్లపెంకులు, గాజుపెంకులు విసిరారు. ఇంత చేసినా ఆ పిచ్చిది అక్కడి నుండి

కదలలేదు. అంతటితో మా యిరుగుపొరుగు అలసిపోయారు!

ఆ పిచ్చిది మా ఇంటి వాకిట మెట్లపై కూర్చుంటుంది. ఎదురుగా డాక్టర్ యింటి ముంగిట తిన్నెపై పడుకొంటుంది. లేకుంటే డాక్టర్ యింటికి సరిగ్గా తూర్పు దిశన నాలుగో యింటి ముందర విశాలమైన రెండు తిన్నె లున్నాయి. ఆ తిన్నెల్ని ఆశ్రయిస్తుంది.

దాని తలలో కాకులు కాపురం పెట్టవచ్చు. ఒంటిమీద జానెడు తుండుగుడ్డ అడ్డంగా వుంటే వుండవచ్చు. లేకపోతే దానంతట అది ఊడి పడిపోవచ్చు. ఆ పిచ్చి దానికి ఆ ధ్యాసే వున్నట్లు కనుపించదు. నిద్ర పడితే తిన్నెలమీద పడి నిద్రపోతుంది. లేకుంటే ఏ వాకిట మెట్ల మీదనో కూర్చుని వీటో చూస్తూ ఆలోచిస్తూ వుంటుంది. అప్పుడప్పుడు అర్థంకాని భాషలో వాగుతూ ఉంటుంది. ఉన్నట్లుండి నవ్వడం... కోపగించుకోవడం ... మూతి బిగించి కూర్చోవటం... ఈలాంటి పిచ్చి చేష్టలన్నీ మామూలే!—

ఏవరైనా ఏప్పుడైనా దాని మొగాన పిడికెడు కూడు విదిలించి వట్లుకానీ అది తింటున్నట్లు కానీ నా కంట పడలేదు. ఆ మురుగు కాలువల్లో దిగుతుంది. దేవు లాడుతుంది. కుళ్ళిందో చెడిందో చేతికి దొరికిన పండు తింటుంది. ఆ కాలువలో నీళ్ళే తాగుతుంది.

తన పిచ్చి లోకంలో అదొక సర్వాధికారి. ఈ లోకం దృష్టికి అదొక అనాకారి. తన లోకమేదో తనకే కానీ ఈ లోకం సంగతి ఏమాత్రం పట్టింపు లేదు. అందువలన పిల్లలు దానిని చూచి భయపడరు. అజాగ్రత్తగా వుంటే ఏమైనా వస్తువులు పట్టుకపోతుందేమో? అని పెద్దవాళ్ళు దిగులుపడరు.

అలాంటి పిచ్చిది ఉన్నట్లుండి ఓ అర్ధరాత్రిపూట అరచింది, 'అయ్యో! కుయ్యో!' అని అరచింది. 'ఏంజరిగిందో?' అని లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ నిద్ర మత్తులో ఊగుతూ బయటికి వచ్చేసరికి ప్రోగైన మానవోత్తములు కొందరు సానుభూతి చూపిస్తున్నారు. మరికొందరు 'ఛీ ఛా!' అంటున్నారు.

ఏవడో రిక్షావాడు, వీధి విద్యుద్దీప కాంతుల్లో నగ్నంగా పడి వుండిన పిచ్చిదాన్ని చూచి బలెమంచి చౌకబేరమని కక్కుర్తి పడ్డాడు. అది అరచింది. వాడు బెదరిపోయాడు. అంతలోనే యిరుగు పొరుగు ప్రోగయ్యేసరికి పారిపోయాడు.

ఆ రాత్రి ఆ పిచ్చిదాని మీద అమాంతంగా సానుభూతి కట్టలు తెంపుకుని ప్రవహించింది మా యిరుగు పొరుగు వాళ్ళకు!

ఓ మానవతి అప్పటి కప్పుడే పాత చీర నొకటి తెచ్చి చుట్టబెట్టింది. మరొక మగువ సగం చినిగిన రవిక నొకటి తొడిగింది. ఇంకొక దయార్ద్ర హృదయిని కాకి గూటిని సరిచేయడానికి స్వయంగా పూనుకొనింది. ఇంతమంది యిన్ని చేస్తుంటె ఆ పిచ్చిది కదిలీ మెదలకుండా కూర్చుంది బొమ్మలా! 'ఫరవాలేదు. పిచ్చిదానికి మానభంగానికి మాన సంరక్షణకు తేడా తెలిసినట్లుందే!' అనుకొన్నాను.

ఆ సంఘటన జరిగిన నాటినుండి మా యిరుగు పొరుగు హృదయాల్లో పిచ్చిది చోటు చేసుకొనింది. ఇప్పుడది సాధారణంగా వివస్త్రగా కనుపించడమే లేదని చెప్పాలి.

అయితే డాక్టరుగారికి మాత్రం ఎనలేని కోపం!


మురుగు కాలువల్ని సరిగా శుభ్రం చేయని మునిసిపాలిటీ వారి మీద కాదు. మురుగు కాలువల్లో పారుతున్న నీటికి అంతరాయంగా కుళ్ళిన పండ్లను కుమ్మరిస్తున్న పండ్ల వ్యాపారస్థుల మీద కాదు, ముక్కులు పగిలేటట్లు దుర్గంధాన్ని వెదజల్లుతున్న మురుగు కాలువలమీద అసలే కాదు. మరెవరిమీద అంటే — ఆ పిచ్చిదాని మీద!

"చూడండి. అసలు యిలాంటి మనుషులు బ్రతకడం దండగే కాదు. అపాయకరంకూడా. దానికేం? కుళ్ళిన పండ్లు తింటుంది. మురిగిన నీళ్ళు తాగుతుంది. ఉత్తరోత్తర దానికి సంక్రమించే రోగాలకు సంఘం బలి అవుతుంది!" ఒకనాడు డాక్టర్ నాతో అన్నాడు.

"డాక్టరుగారూ! మనం ఎన్నో ఆరోగ్య సూత్రాలను పాటిస్తున్నామని అనుకొంటున్నాం. కానీ ఏదో ఒక రోగం వచ్చిందంటే వస్తూనే ఉంది. మరి ఆ పిచ్చిది మురుగుడు నీళ్ళు తాగుతూ కుళ్ళిన పుచ్చిన పండ్లు తింటూ దుక్కలా వుంది గదండీ" సందేహంగా ప్రశ్నించాను.

"దాని శరీరతత్త్వం సరుకుపోగలిగింది కాబట్టి యిప్పుడు దుక్కలాగే కనిపిస్తుంది. ఆ తత్త్వం మారినపుడు అంటే దాని ఒంట్లో రోగ నిరోధకశక్తి తగ్గినపుడు అది అంటు వ్యాధులకు నిలయ మవుతుంది. అపుడు రోగాన్ని అరికట్టడానికి ప్రయత్నాలు జరుగవు కానీ వ్యాప్తి అనర్గళంగా కొనసాగుతుంది."

"డాక్టరుగారూ మీ మాటలు సమంజసముగాను, అంగీకార యోగ్యముగాను వున్నాయి. నేను కాదనడం లేదు. అయితే ఈ సృష్టి అతి విచిత్ర మయింది కదండీ! ఏవరెవరు





పిచ్చిమనుష్యులు

ఎందుకిలా బతుకుతున్నారో? అసలు ఎందుకిలా అవుతున్నారో? అది అంతు తెలియని ఈ సృష్టిలో ఇలా ఎందుకుజరుగుతూందో నిర్ణయించడం చాలా కష్టం కదండీ?" నా అనుభవంలో శాస్త్రాన్ని ఎదుర్కోవాలని ప్రయత్నించాను.

"ఇదో యిలాంటి పిచ్చి వేదాంతాలు మాట్లాడే పిచ్చి మనుషులకు మనలో కొదువలేదు కాబట్టే ఈ సమాజం యిలా అఘోరిస్తూ వుంది" మొగం చిట్లించుకున్నాడు డాక్టర్.

"అయితే యిలాంటి వాళ్ళని యేం చేయాలంటారు?"

"ఏం చేయాలంటారా?... ఏం చేయగలం మనం? వాళ్ళని బాగుపరచే శ్రద్ధా ఓపిక మనకుగానీ మన ప్రభుత్వానికిగానీ లేవు కాబట్టి యిలాంటి వాళ్ళను గప్‌చిప్‌గా చంపిపారేయడం మంచిది."గతుక్కుమనింది గుండె! డాక్టర్లు! ఎంతటికైనా సమర్థులు. అప్పటికి వాదాన్ని ఆపుచేసుకొన్నాను.

అయినా నేను గమనిస్తూనే వున్నాను. దావాపు వీధివాళ్ళందరికీ పిచ్చిదానిపట్ల సదభిప్రాయం కుదిరినా డాక్టర్ అభిప్రాయం మారలేదు. ఆయన కార్లో ఆస్పత్రికి పోతుంటాడు. వస్తుంటాడు. వస్తూపోతూ చూడకూడదనుకొంటూనే పిచ్చిదాన్ని చూస్తున్నాడు. ఆ పిచ్చిది మురుగు కాలువలో వంగి దేనికోసమో దేవులాడుతూ వుంటుంది. ఒక్కొక్కప్పుడు ఆ కాలువలో చేతికి దొరికిన కుళ్ళిన పండును ఆప్యాయంగా పీక్కుతింటూ వుంటుంది. శరీరం గగుర్పొడుస్తుంది డాక్టర్ బాబుకు. మొగం చిట్లిస్తాడు. ముక్కు కడ్డంగా చేతిరుమాలు పెట్టుకొంటాడు. అడుగులు గబగబ ముందుకు వేస్తాడు ఆ పాడు దృశ్యాన్ని చూడలేనన్నట్లుగా!

ఆ దృశ్యం వాకంట పడినపుడంతా నా గుండె గుభిల్లుమనేది. అదొక పిచ్చిది. దాని లోకం దానిది. ఎవరి జోలికీ రాదు. ఏమీ ఆశ్రయించదు. ఎప్పుడో దానివల్ల జరుగబోయే ప్రమాదాన్ని ఊహించుకొని డాక్టర్ దాన్ని చంపేస్తే? ఏముంది? కాసంత మూదిమందు, ఒళ్ళు తెలియకుండా అది అరుగుమీద పడి నిద్రపోతుంటుంది.

భారతి

1978

సంచికలలో పడిన కొన్ని వ్యాసాలు

తెలుగు కథా సాహిత్యంపై మార్క్సిజమ్ ప్రభావం	శ్రీరామమూర్తి
సంప్రదాయం ప్రగతి వ్యతిరేకమా!	సాంధ్యశ్రీ
రావణుని లంక మధ్యప్రదేశ్‌లో నుండెను	సాంకలియా
మన సోషలిస్టు రాజ్యాంగం	తారానాథ్
"జగద్విదితంబుగన్"	రమణారెడ్డి
సిముక శాతవాహనుడి నాణాలు	పరబ్రహ్మశాస్త్రి
గుంటుపల్లి గుహలు	కార్తికేయశర్మ
సాహితీ ప్రతిఘటన	మురళీధర్
దారిద్ర్య సమస్య	తిలక్
ప్రాచీన భారతీయ ఆర్థిక ఆలోచన	రావు

ఇవికాక ఇతర వ్యాసాలు ఎన్నో ఉన్నాయి!

ఇవి మచ్చుకి మాత్రమే!

ఒకరికంటు పడకుండా ఏ అర్ధరాత్రివేళో దానికంత నూదిమందు ఎక్కిస్తే... అడిగే వాళ్ళెవరు? దానికోసం యేడ్చేవాళ్ళెవరు? ఇలా ఆలోచిస్తూ వుంటే ఎందుకో గుండె జాలితో నిండిపోయింది.

ఓరోజు రాత్రి యిలాంటి ఆలోచనలతోనే పడుకొన్నానేమో? 'డాక్టర్!' అంటూ అరుస్తూ లేచాను అర్ధరాత్రి వేళలో. ఆ అరుపులకు శ్రీమతి ఎగిరిపడి లేచింది. ఏంజరిగిందండీ? ఎందుకు 'డాక్టర్!' అని అరుస్తూ లేచారు? అని ఆతురతగా అడుగుతూ వుంది. నేను నెమ్మదిగా లేచాను. వీధి తలుపు తెరచి వీధిలోనికి చూశాను. డాక్టర్ యింటి తిన్నె మీద పిచ్చిది ఆదమరచి పడివుంది. ఏన్నడూ లేనిది ఆవేళప్పుడు డాక్టర్ యింట్లో దీపం వెలుగుతూవుంది! చిన్నపిల్ల యేడుపు చెవుల్లో గంట కొట్టినట్లు వినిపిస్తూ వుంది. ఆ నిశ్శబ్ద నిశీధిలో! ... గుండె కదుటపడింది. తిరిగి తలుపు వేసుకొని యింట్లోకి వచ్చాను కాసిని మంచినీళ్ళు గొంతులో పోసుకొన్నాను.

"ఏమండీ? ఏంజరిగిందండీ?" శ్రీమతి ఆందోళన పడుతూ వుంది.

"ఎదురింట్లో డాక్టర్ రాజీ..."


"ఆఁ! ఎదురింట్లో డాక్టర్..." అసహనంగా అడుగుతూ వుందామె.

"ఎదురింట్లో డాక్టర్ పిచ్చిదాన్ని చంపేయడానికి నూదిమందు తయారు చేసుకొన్నాడు రాజీ! అంతలోనే పసిపిల్ల కెవ్వుమని అరచింది. పిల్లతల్లి ఎగిరిపడి లేచింది. లేకుంటే ఈనాటితో పిచ్చిదాని పని గోవిందా!" కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వింది మా శ్రీమతి.

"ఏం పిచ్చి మనుషులండీ మీరు. డాక్టరుగారికి పిచ్చిదానికి యేం సంబంధం? ఆయనగంగిగోవులాంటిమనిషి. ఆయనెందుకు చంపుతాడండీ మీ పిచ్చిగానీ! పడుకోండి." అంటూ బలవంతంగా పడుకోబెట్టి దుప్పటి కప్పింది పాడు కలలు దుప్పట్లో దూరలేవని! పాడు కలలకు దుప్పటికి సంబంధ ముందో ఏమోకానీ ఆమె దృష్టిలో— నా దృష్టికి ఎండాకాలనికీ దుప్పటికి సంబంధం లేదు కాబట్టి పీకిపారేసి పడుకొన్నాను. తెల్లవారింది. ఇలా తెల్లవారడం మామూలయింది.

పిచ్చిమనుష్యులు

మనుష్యుల ఆకారాల్లో పెద్ద పెద్ద వ్యత్యాసాలు కనుపించవు. అయినా బుద్ధులు వింతలు వింతలుగా ప్రకాశిస్తుంటాయి. అలానే కాలగమనంలో పెద్ద మార్పు కనుపించదు. కానీ వాతావరణం రకరకాలుగా ఉంటుంది. ఈయేడు ఏయేడూ లేనంత విపరీతమయిన ఎండలని ప్రజానీకం గోలచేస్తూ వుంది. ఎండధాటికి నిప్పపడి కొంపలు కాలిపోతు న్నాయి. త్రాగడానికి నీళ్ళులేక గ్రామాలకు గ్రామాలే వలస వెళ్ళుతున్నాయి. వడగాడ్పు లకు జనులు బలి అవుతున్నారు. త్రాగ డానికే నీళ్ళు కరవైనప్పుడు మురికి కాలువల సంగతి చెప్పాలా? చెత్తా చెదారం, కుళ్ళిన



పండ్లు పేడా పెంటలకు నిలయమయ్యాయి. వాటివైపు చూడవలెనంటే ఒళ్ళు జలదరిస్తుంది. వాటిని భరించడం మహా కష్టంగా తయారయింది.

దీనికితోడు పండ్లవీధిగా మారిన బండ్ల వీధిలోనికి మామిడిపండ్లు లారీలమీద దిగుతున్నాయి. లారీల రాకపోకలతో రాల్చిన చెత్తా చెదారంతో వీధి రొచ్చు రొచ్చుగా తయారయింది. కుళ్ళిన పండ్లను కండ్లు మూసుకుని కాలువల్లో కుమ్మరిస్తున్నారు. వాననీళ్ళో లేక యిండ్లల్లో కుండా, చట్టి కడిగిన నీళ్ళో ధారాళంగా ప్రవహిస్తుండే కాలువల్లో దుర్గంధము ఎప్పటి కప్పుడు కొట్టుకపోయేది. ఇప్పుడంతంత మాత్రంగా యిండ్లల్లో నుండి కాలువల చేరుతున్న కడుగునీళ్ళు కాలువల్లో పడిన చెత్తా చెదారం కుళ్ళిన పండ్లు మరింత కుళ్ళడానికి ఉపకరిస్తున్నాయి.

ఓ రోజు మధ్యాహ్నం. చుట్టపురీతిగ పలుకరించడానికి వచ్చినట్లు నాలుగు తొలకరి చినుకులు రాలాయి. అసలే రొచ్చు రొచ్చుగా వున్న నేల. చినుకులు పడడంతో కాలు పెడితే జారుతుందన్నట్లుగా తయారయింది.

బాగా వర్షం కురిసివుంటే కాస్త చల్లబడి వుండేది. కళ్ళాపుచల్లినట్లు చిలకరింపుతో లోపలివేడి లేపి కొట్టింది. గంట నాలుగైనా బయట అడుగు పెట్టవలెనంటే భయమేస్తూ వుంది. కాస్త చల్లబడితే వెళ్ళవచ్చులే! అని ఎదురుచూస్తూ ఏదో ఆలోచిస్తూ కూర్చుని ఉన్నాను యింట్లోనే!

"అయ్యో! బిడ్డ!!"— అన్న గావు కేక వినిపించింది.

"ఎవరిబిడ్డ? ఏమయింది బిడ్డకు?" అన్న ఆతురతతో ఎగిరిపడి లేచాను. వీధిలోనికి వెళ్ళవలసిన వాడిని యింట్లో కలయ చూశాను. బిడ్డలందరు యింట్లోనే వున్నారు. మనసు కుదటపడితే ఆ తరువాత నేను వీధిలో పడ్డాను. మనిషి స్వార్థం అలాంటిది మరి!

అప్పటికే కాలువచుట్టూ జనం ప్రోగైరారు. కాలువగట్టు మీద కాలు గాలిన పిల్లుల్లా తిరుగుతూ 'అయ్యో! బిడ్డ!... అయ్యోబిడ్డ!" అంటున్నారు.

తప్పటడుగులు వేస్తూ వీధివాకిట్లోకి వచ్చిన డాక్టర్‌గారి మూడేండ్ల ముద్దుల పాప!... ఎలా జారిపడిందో?— కాలువలో పడిపోయింది. కుళ్ళిన పండ్లు ... చెత్తా చెదారం... పెంటతో మురుగుకాలువ రొచ్చు రొచ్చుగా వుంది. చూస్తే ఒళ్లు జలదరిస్తూ వుంది. ఆ రొంపిలో బిడ్డ బోర్ల పడి కూరుక పోయింది. గుక్కతిప్పకోలేక పోతూంది.

డాక్టర్ బాబుగారు వచ్చారు. వారి శ్రీమతి వచ్చింది. అందరితో కలిసి 'అయ్యోబిడ్డ! అయ్యోబిడ్డ!' అంటూనే వున్నారు. కాలువగట్టు మీద భరతనాట్యం చేస్తున్నారు. డాక్టరుగారు వారి సతీమణి ముక్కుకు చేతిరుమాలు అడ్డం పెట్టుకోవడం అరక్షణం వదలలేదు. ఆరోగ్యంపట్ల


శింగార్ వారి కాటుక
'78 సంవత్సరపు స్వాభావిక సౌందర్యానికి సంపూర్ణ నేత్ర శృంగారం.
DELUXE KAJAL
శింగార్ వారి కాటుక
స్వాభావికమైన రక్షణ మరియు సౌందర్యానికి
పసిపిల్లలకు కూడా ఆదర్శప్రాయం.
CONCEPT SK-3561 TEL



సైన్సులో సరదాలు

మాయమైన షర్బత్తు

ఈ గారడీ చేయడానికి రెండు గాజు గ్లాసులు, ఎర్ర సిరా, చిటికెడు బ్లీచింగు పౌడరు కావాలి.

మొదటి గ్లాసులో సగం వరకూ ఎర్రసిరా కలిపిన నీళ్ళుపోసి ఉంచు. చిటికెడు బ్లీచింగు పౌడరు పది చుక్కల నీళ్ళల్లో కరిగించి రెండవ గ్లాసులో పోసి ఉంచు. పైకి చూడడానికి రెండవగ్లాసు ఖాళీగా కనిపిస్తుంది.

మొదటి గ్లాసులో ఉన్న ఎర్రసిరా నీళ్ళని చూపించి, అది కొత్తరకంషర్బత్తు అని చెప్పు మీ స్నేహితులతో. వాళ్ళు చూస్తూ వుండగా మంత్రంవేసి, ఆ "షర్బత్తు"ను రెండవ గ్లాసులో పొయ్యి. అంతే, రంగు మాయమైన షర్బత్తు నీళ్ళల్లా మారిపోతుంది!

ఈ రకమైన గారడీ మీలో చాలా మంది చాలాసార్లు చేసే వుంటారు. కాని, అది గారడీ అని గమనించి వుండరు. చొక్కాలకి పట్టుకున్న సిరా మరకలు పోగొట్టడానికి చేసే పద్ధతి ఇదే. అయితే ఈ గారడీ ఎల్లా జరుగుతోంది?

బ్లీచింగు పౌడరులో క్లోరిన్ అనే ధాతువు ఉంది. నీటి అణువులో ఆక్సిజన్, హైడ్రోజన్ అనే పరమాణువులున్నాయి. క్లోరిన్ వెళ్ళి నీటిలో ఉన్న హైడ్రోజన్‌తో కలుస్తుంది. మిగిలిపోయిన ఆక్సిజన్ పరమాణువులు బహు చురుకైనవి అవి వెళ్ళి రంగులతో కలిసి, వెలిసిపోయేలా చేస్తాయి.

అంటే రంగు పోగొట్టేనది బ్లీచింగు పౌడరు అనడంకన్న ఆక్సిజన్ పరమాణువు అనడం సబబుగా ఉంటుందేమో.

— డాక్టర్. మహీధర నళినీమోహన్.

పిచ్చిమనుష్యులు

అంత శ్రద్ధ మరి! నాగరకత ముసుగు వేసుకొన్న మనుష్యులు కదా?

ఆ కెంటలో దిగడానికి అందరూ వెనుకాడుతూనే ఉన్నారు. అలా ఉపేక్షిస్తూ కూర్చుంటే ఆ బిడ్డమీది ఆశలు వదులుకోవలసి వచ్చేటట్లుంది. దిగుదామా? అని ప్రయత్నిస్తున్నాను. అంతలోనే పిచ్చిది ఆ కాలువలో దేవులాడుకొంటూ వస్తున్నది. చేతికి అడ్డు తగిలిన చెత్తను తీసిపారేసినట్లు విడమచేత్తో ఆ బిడ్డను అవలీలగా ఎత్తి గట్టుమీద విసరింది. ఎవరివైపు చూడలేదు. ఏమీ పట్టించుకోలేదు. తన పని తనదన్నట్లుగా కాలువలో ఏదో దేవులాడుకొంటూనే వుంది.

డాక్టర్‌గారి భార్య బిడ్డను ఆవురుకొని లోనికి పరుగెత్తింది!

"ఎక్కడుండిందో! నమయానికి దేవతలాగావచ్చి బిడ్డను బతికించింది" గుమిగూడిన అమ్మలక్కలు పిచ్చిదాన్ని మెచ్చుకొంటున్నారు. ఈ మాటలకు నెలలకు అతీతంగా పిచ్చిది మురుగు కాలువలో దేవులాడుతూనే వుంది!

మా శ్రీమతి దృష్టిలో నేను పిచ్చివాడిని. నా దృష్టిలో డాక్టర్ పిచ్చివాడు. లోకం దృష్టికి అది పిచ్చిది. ఆ మాటకు వస్తే ఎవరి పిచ్చి వాళ్ళ కానందము!

చేతికి దొరికిన కుళ్ళిన పండును ఆప్యాయంగా పీక్కుతింటూ వుంది మురికి కాలువలో పిచ్చిది! అది దాని కానందము!!

'ఎవరెవరు? ఎందుకు? యిలా బతుకుతున్నారో? అందులో అంతరార్థ మేమిటో సృష్టి చిత్రం?' అని నే నెప్పుడో డాక్టరుగారితో అన్న మాటలు మరొక్కసారి మనసులో మెదిలాయి. డాక్టర్ వైపు చూశాను.

డాక్టర్ తల వంచాడు. అయినా ఆతని కనుకొలకుల్లో తిరిగిన అశ్రుకణాలను నేను గమనించకపోలేదు. పాపం! పిచ్చిమనిషి!!



పక్కింటి పార్వతి బోలెడు
ఖర్చు పెట్టి ఇంటికి ఎమల్షన్
పెయింటు వేయించింది.
కాని నేను ఖర్చులో
20% పైగా ఆదా చేశాను.
సూపర్ డెకోప్లాస్ట్—
ఎమల్షన్ సౌందర్యానికి
పెట్టింది పేరు
asian paints
SUPER
DECOPLAST
పార్వతి నన్ను అడిగుంటే ఆమె కూడా ఆదా చేసేది. మా ఇళ్లు 120 చ. మీ. వైశాల్యంతో ఒకేలా ఉంటాయి. అందంగా కన్పిస్తుందని, ఇంటికి ఎమల్షన్ పెయింటే వేయిద్దామని ఇద్దరమూ అనుకున్నాం. వేయించాం కూడాను. కాని, ఆమెకు బోలెడు ఖర్చయింది. నాకు మాత్రం 20% పైగా ఆదా అయింది. ఎలా అంటారా, అది సూపర్ డెకోప్లాస్ట్ మహత్యం!
సూపర్
డెకోప్లాస్ట్
ఏషియన్ పెయింట్స్

హైదరాబాద్ నోట్‌బుక్

—తిరుమల రామచంద్ర

హిందూ శతవార్షికోత్సవం :—

సెప్టెంబర్ 16వ తేదీన జూబిలీ హాలులో హిందూపత్రిక శతవార్షికోత్సవం జరిగినప్పుడు అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి డాక్టర్ ఎం. చెన్నారెడ్డి, ముఖ్య అతిథి, రాష్ట్రగవర్నర్ శ్రీ కె.సి. అబ్రహాం, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ శ్రీ జి. రామిరెడ్డి, ప్రముఖ జర్నలిస్టు డాక్టర్ కె. ఎన్. కెల్యాంకర్, డాక్టర్ సి. నారాయణరెడ్డి, విజయవాడ న్యాయవాది శ్రీ వి. సుందరరావు హిందూ సూరేళ్ళ చరిత్ర భారతదేశ పత్రికా రచనా చరిత్ర అని, దేశంలో ఉత్తమమైన జర్నలిజంకు బాటలు వేసిందని ప్రశంసించారు. ప్రారంభంలో హిందూ పత్రిక సంపాదకుడు శ్రీ జి. కస్తూరి సభకు స్వాగతం చెప్పారు.

నిజమైన కవి బైరాగి :

"వీరులు నీలకంఠులు మృత్యుంజయులు
వేదనల విషం త్రాగి జనతకు
మహితకు,
నవతామృతం పంచుతారు
మృత్యువు వారికి వంగివేస్తుంది జోహారు
వగపు వలదు
ప్రతిచెర ఒక తిరుపతిగా
ప్రతిశిల ఒక తిరుమలగా
పూజించే రోజులు ముందున్నాయి!"

అని ఘంటాపథంగా ఘోషించాడు మిత్రుడు బైరాగి అత్యయిక పరిస్థితివంటి గడ్డు రోజులలో నిర్భయంగా. మందవేసే మనః ప్రవృత్తి, ఇచ్చకాలాడే పిచ్చిచేష్ట, పదవులకోసం ప్రాకులాడే పైరవీ కంచుకొలాగడావేసి కలయవెదికినా కానరాని కవితామూర్తి ఆలూరి బైరాగి. ప్రజాశ్రేయస్సుకు నిరంతరాన్వేషణ సాగించిన అనంతమైన ఆర్తి ఆలూరి బైరాగి. ఈ అన్వేషణార్తులు స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా జరుగుతున్ననాడే తన 14వ ఏటనే ఆయన కవితలో ప్రస్ఫుటించాయి.

"ప్రతి అక్షర మొక భటుడు
ప్రతి పదమూ ఒక శకటూ
ప్రతి ఊహ ఒక వ్యూహం
జీవశంకాతంక సంకుల సమరంలో
కవితను ప్రేమనుకున్నావు?"

అని ప్రశ్నించగలిగాడు. బైరాగి 1925లో తెనాలిలో జన్మించాడు. పదకొండు సంవత్సరాల వయసులోనే దక్షిణభారత హిందీ ప్రచారసభ వారి విశారద పరీక్షలో సర్వప్రథముడుగా వచ్చారు. 14వ ఏట, బీహార్ రాష్ట్ర హిందీ సాహిత్య సమ్మేళనంలో హిందీకవితకు ప్రత్యేక బహుమతి పొందారు. హిందీ, తెలుగు, ఇంగ్లీషు బెంగాలీలలో స్వయం కృషితో పాండిత్యం సంపాదించారు. చందమామ హిందీ పత్రికకు కొంతకాలం సంపాదకుడుగా ఉన్నారు. సామాన్యప్రజల శ్రేయస్సు కోసం కలం పట్టి చీకటి నీడలు మున్నగు కవితా సంపుటులు వెలయించారు. ఆయన 'నూతిలో గొంతుకలు' కవిత జన్మనిచ్చిన కావ్యం. హిందీలో రచించినపలాయన్, ఆధునిక తెలుగు కవితా—అనే కవితా సంకలనాలు హిందీ సరస్వతికి కొత్త నగలు, నగవులు తొడిగాయి.

"నేడు కాదు, రేపుమీది
రేపుదయించెడి సూర్యుడు
మీ కొరకై తరుణారుణ
మధుకాంతుల జయమాలలు
సిద్ధంగా వుంచుతాడు,
రేపే మీ కల్యాణం"

అని అలజడి అశాంతి అనే ఉగ్గుపాలతో పెరిగిన పీడితప్రజలను ఉద్బోధిస్తూ, సెప్టెంబర్ 9వ తేదీన కన్నుమూశారు మిత్రులు బైరాగి.

పట్టాభిరామ్ కాలధర్మం :

ఆంధ్రభూమి దిన పత్రిక మాజీ పబ్లిషర్, దక్కన్ క్రానికల్ ఆంగ్లదిన పత్రిక మాజీ సంపాదకులు శ్రీ కె.ఆర్. పట్టాభిరామ్ సెప్టెంబర్ 16వ తేదీ ఉదయం బెంగుళూరులో కీర్తిశేషులయ్యారు. ఆయనకు హఠాత్తుగా తీవ్రమైన రక్తపుపోటు కలిగింది. మెదడులోని రక్తనాళాలు తెగాయి. చికిత్సకోసం ఆస్పత్రిలో చేర్చారు. కాని మృత్యువు కబళించింది. ఆయన వయసు 55 సంవత్సరాలు. శ్రీ పట్టాభిరామ్ సికిందరాబాద్‌లోని మహబూబియా కళాశాలలోను, మద్రాసు లయోలా కాలేజిలోను చదివి అర్థశాస్త్ర పట్టభద్రులయారు. తండ్రి స్థాపించిన దక్కన్ క్రానికల్ జనరల్ మేనేజరుగా, 1947 నుండి మూడేళ్ళు పనిచేశారు. తండ్రి శ్రీ రాజగోపాల్ మరణానంతరం 1950లో దక్కన్ క్రానికల్ సంపాదకులై 26 సంవత్సరాలు నిర్వహించారు.

ఉపశ్రుతి :—

"అబ్బ! పుదుచ్చేరి విధానసభలోని అన్నా డి. ఎం. కె. సభ్యులు ఎంత మంచి వారండీ పాపం!" అన్నాడు ఒక రాజకీయవాది. "ఏం?" అని అడిగాను. "పొద్దు తిరగకముందే బుద్ధిమంతుల్లాగ మనస్సు మార్చుకొని ప్రభుత్వాన్ని సమర్థించడానికి ఒప్పుకొన్నారు." అన్నాడతను. "అధికార పక్షానికి అప్పుడప్పుడు షాక్ ట్రీట్‌మెంటు ఇస్తూ వుండాలిలెండి" అన్నాడొక పెద్ద మనిషి.

సాహిత్య ప్రపంచంలో సరికొత్త ప్రయోగం!

52 సంవత్సరాల సాహిత్యసేవలో నిష్ణాతులు **శ్రీ కొండపల్లి వీరవెంకయ్య & సన్స్** రాజమండ్రి వారి అభినందనలతో **లతా ఎంటర్‌ప్రైజెస్** వారి...

మీకో
స్వంత గ్రంథాలయ పథకం

గ్రంథాలయాలు... దేవాలయాలు... విశ్వవిద్యాలయాలు కూడా! అక్కడుండేవి కేవలం నిధి నిక్షేపాలు కావు. మహాత్ముల అనుభవసారాలు... నిత్యసత్యాలు.

సాహిత్యాభిమానులకై మేము రూపొందించిన **స్వంత గ్రంథాలయ పథకం**లో మీరు రూ.**10**లు చెల్లించండి! వెంటనే రూ.**14**ల విలువైన మీ అభిమాన రచయితల, రచయిత్రుల/ సినీరంగ ప్రముఖుల నవలలు **3** మరియు **1** ఉచిత నవలతో మొత్తం **4** పుస్తకాలు మీ ఇంటికి వస్తాయి. అంతేకాదు... మా డిస్ట్రిబ్యూషన్ కేటలాగులో గల ఏ పుస్తకం కొన్నా 20% డిస్కౌంటు కూడా! ఈ మా స్వంత గ్రంథాలయ పథకంలో మొదటి నెల చందాకై మీకు వచ్చు **4** పుస్తకాలు కాక సభ్యత్వ రుసుము రూ.**4** లకై సాహిత్యాచార్య శ్రీ **K.V. నాగేశ్వరరావు** గారు సంకలనం చేసిన **సూక్తిముక్తావళి** మీ సభ్యత్వ కార్డుతోబాటు అదనం! అనగా... మొదటి నెలలో మీరు చెల్లించే రూ.**10+4 = **రూ.**14** లకు **5** పుస్తకాలన్నమాట! రెండవ నెల నుంచి నెల**1**కి చందా రూ.**10**లు మాత్రమే అంటే... ఒక సంవత్సరానికి మీరు చెల్లించవలసింది రూ.**124**లు. సంవత్సరానికి చందా ఒకేసారి అయితే రూ.**114**లు మాత్రమే!

అర్థ సంవత్సరపు చందా..... రూ.**60**లు
మూడు నెలలకు చందా..... రూ.**30**లు

ముందుగా M.O. లేదా డ్రాఫ్ట్ పంపించండి. లేదా V.P.P. సౌకర్యము కూడా కలదు. **12** నెలల మీ ఈ చందాకు మీరు పొందగలిగేవి అమూల్యమైన **49** పుస్తకాలు (అసలు విలువ రూ.**171-50** పై.లు) మొదటి నెలలో మీకు అందే పుస్తకములు

డా. కొర్రపాటి గంగాధరరావు గారి అమృతమథనం	డా. సి. ఆనందరామం గారి పాంచజన్యం	శ్రీమతి కురుమద్దాలి విజయలక్ష్మిగారి ఒకజంట కలసిన తరుణాన	శ్రీ మునిమాణిక్యం నరసింహారావు గారి శరద్రాత్రులు.
ఆకాశంలాంటి మగాడు... పృథ్వీలాంటి ఇన్నది... ఒడుపులు-ఉంకెలు జాతర్లు-దేవుడు సంఘటనలు- సంఘర్షణలతో గల బుద్ధివికాసక నవల. జాతిని చైతన్యవంతం చేసిన ఆధునిక మహిళ గాథ!	హరిజన గిరిజన వర్గాల పట్ల ప్రభుత్వ సహకారం ఏ విధంగా మంటగలిసి- పోతున్నది నిరూపించే నవల! ఒక అనాథ బాలిక జీవిత చిత్రణ	బెల్ బాటం ఫాంటుతో ఓ అమ్మాయి పెళ్ళి చూపులకు కూర్చోవటం తప్పు కాదు. అది ఆధునిక తత్వం. అబ్బాయి స్త్రీ పాత్రధరించడం మాత్రం ఆడంగి తనం. ఈ వైవిధ్యాన్ని రచయిత్రి ఆద్యంతం పోషించారు.	పెళ్ళయిన కొత్తలో అందరికీ వస్తాయి. (హనీమూన్ డేస్) శరద్రాత్రులు. తన దాంపత్యం శృంగారం కలిపి అందంగా చెప్పిన మునిమాణిక్యం పెళ్ళయినవారికి ఆ తీయని రోజులు జ్ఞాపకం తెస్తాడు. పెళ్ళికాని వారికి ఆరోజులు ఎలా గడపాలో చెప్తాడు

వెంటనే సభ్యులుగా చేరండి! మీ ఇంటిని సాహిత్య నిలయంగా మలచండి!!

ఈ మా గ్రంథాలయ పథకంలో చెప్పబడిన ఈ **49** పుస్తకాల విలువ రూ.**171-50** పై.లు మీరు ఉచితంగా కూడా పొందడానికి మరొక అద్భుత పథకం రూపొందించబడింది!

ఈ పథకం ద్వారా మీరు ఒక్క రూపాయి కూడా పెట్టుబడి లేకుండా మీరు మీ యింటిలో స్వంత గ్రంథాలయాన్ని నెలకొల్పవచ్చు! ప్రత్యేకంగా తయారు చేసిన ఈ ఉచిత గ్రంథాలయం యొక్క ఉచిత ప్రోస్పెక్టస్‌కై వెంటనే వ్రాయండి!

※ డిస్ట్రిబ్యూటర్లు కావలయును!

లతా ఎంటర్‌ప్రైజెస్
బుక్ పబ్లిషర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్
మెయిన్ రోడ్, రాజమండ్రి. బ్రాంచి: హైదరాబాద్.

DIMPLE LEP/1535/4 DESIGNERS

ఈనాటి వనితా లోకం

రచయిత్రుల మీద ఆగ్రహం ఎందుకు ?

—కొమ్మారెడ్డి స్వప్న



పాపం ఎవరో కోడలుపిల్ల అత్తపోరు పడలేక ఆత్మహత్య చేసుకోబోయింది. ఆమెను ఆ ప్రయత్నంనుంచివారిస్తూ, పొరుగింటావిడ వచ్చి సాధించేది ఏముంది ? బతికుంటే నాలుగు నవలలైనా రాసుకోవచ్చు అని ఓదార్చుతూ ఉంటుంది. ఇదొక కార్టూనిస్టు కమనీయ సృష్టి.

భార్య పురిటి నొప్పులు పడుతూంటే భర్త కాలుగాలిన పిల్లిలా అటు ఇటూ తిరుగుతూ ఉంటాడు. అంతలో ఒకావిడ తలుపు తీసుకొని బయటికి వచ్చి మీకు రచయిత్రి పుట్టింది అంటుంది. ఇది వేరొక రసమయ కల్పన.

ఈ రకంగా రచయిత్రులను అపహాస్యం చేయడానికి ఎందరో మహానుభావులు రకరకాలుగా ప్రయత్నించుతుంటారు. రచయిత్రులను మగవారితో పాటు సాటి స్త్రీలు కూడా విమర్శించుతూ ఉంటే ఆశ్చర్యంగా ఉంటుంది.

ఇప్పుడు రాసే రచయిత్రుల్లో అసలు ఆడవారు ఎంత మంది ? నిజంగా ఇవన్నీ రచయిత్రులు వ్రాస్తున్నవేనా ? ఆడపేర్లు పెట్టుకుంటే తమ పేర్లు పత్రికల వారిని, పాఠకులను ఆకర్షించుతాయనే అందమైన ఒక అపోహ మగవారిలో ఉంది. ఇప్పుడు రచయిత్రుల పేరుతో వెలువడుతున్న రచనల్లో మగవారు వ్రాస్తున్నవే ఎక్కువ (అంటే ఆడపేర్లు పెట్టుకొని) అని నేను నిక్కచ్చిగా చెప్పగలను. అందుకే రచయిత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు.

ఈ విషయం తెలియనివారు రచయిత్రులు పుంఖాను పుంఖాలుగా నవలలు వ్రాస్తారనీ, ఓ అదే పనిగా పేజీలు నింపేస్తారనీ వాపోతూ ఉంటారు ! ఆ రచయిత్రుల మూలంగా తెలుగు రచనల స్థాయి దిగజారి పోతున్నదని మా బాధ కూడా అంటారు. ఆ రకంగా విమర్శించే వారు అందరూ ఉత్తమ సాహిత్యం పట్ల అపారమైన అభిమానం కల్గినవారు కాదు. విమర్శించడమే పనిగా పెట్టుకొన్నవారు. విమర్శించడం అంటే తిట్టడమే అని వీరి అభిప్రాయం. రచయిత్రులు మత్తుమందు లాంటి సాహిత్యాన్ని సృష్టిస్తూ, వాస్తవికతకు దూరంగా కల్పనా జగత్తులోకి పాఠకులను తీసుకొనిపోయి ఉత్తమ సాహిత్య విలువలను చంపేస్తున్నట్టుకూడా కొందరు అంటూ వుంటారు. కేవలం సినిమాలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే రచనలు చేస్తూ ఉంటారని కూడా మరికొందరు బుద్ధిమంతులు వాదిస్తూ ఉంటారు. కొందరికి పాపులారిటీ ఉన్న వాళ్ళని క్రిటిసైజ్ చెయ్యటమే పని అనుకొని సరిపెట్టుకోవచ్చునేమోగాని అలా అనటం మాత్రం చాలా అన్యాయం.

నిజం చెప్పాలంటే ఒకప్పుడు కొంత వరకు 'చీప్'సాహిత్యాన్నిరాసిన రచయిత్రులు కూడా కృషితో తమ స్థాయి పెంచుకొని చక్కని రచనలను ఇప్పుడు అందిస్తున్నారు. కొందరన్నట్టు రచయిత్రులు కేవలం సినిమాలను దృష్టిలో పెట్టుకొనివ్రాస్తారని అనుకోవటంలో ఎంత పొరపాటు వుందో ఆ నవలలు చదివితే తెలుస్తుంది.

ఇటొచ్చి మగవారు భార్యామణులు పేర్లు పెట్టుకొని వ్రాసే రచనల్లోనే శృతి మించిన శృంగారం చోటు చేసుకొని చదవటానికి ఎబ్బెట్టుగాఉంటుంది. ఇలావుండగా మళ్ళీవేరే రచయిత్రులను విమర్శించుతూ వుంటారు. కొంతమంది ఆడవారి పేర్లు కలం పేరు సాకుతో వాడుకొన్నా, చాలామంది భార్యల పేరుమీదే వ్రాస్తూ వుంటారు. తాము వ్రాసింది ఏదో విధంగా అచ్చుకావాలని ఆడ్డదారులు తొక్కటం ఏమంత సమంజసం ?

ఈమధ్య ఒకసారి రచయిత్రుల మహాసభలు జరిగితే వెళ్ళాను. పేరున్న రచయిత్రులు కొందరు వేదిక నలంకరించారు తప్ప అడపా దడపా పత్రికల్లో కనిపించే రచయిత్రు లెవరూ అక్కడ నాకు కనిపించలేదు.

పేరున్న రచయిత్రులు కూడా, ఒకరి గురించి ఇంకొకరి దగ్గర అపహాస్యంగా మాట్లాడటం, హేళనచేస్తూ నవ్వుకోవటం నేను గమనించాను. రచయిత్రులమీద అనేక అపోహలున్నపాఠకులు ఆ పరిస్థితులలో వారిని చూస్తే, వారిపట్ల అసహ్యమూ, ఏవగింపూ కలిగే రీతిలో కొందరు ప్రవర్తించారు

రచయిత్రుల మహాసభలు జరగటం ఆనందదాయకమే అయినా రచయిత్రులమీద వారి రచనలమీద సదభిప్రాయంలేని ప్రజల మధ్యనారు ఈ విధంగా ప్రవర్తించి మరిన్ని అపవాదులకు లోను కావడం శోచనీయం.

ఇదివరలో కార్టూనిస్టులు అప్పడాల కర్రలు చీపురు పట్టుకొని గయ్యాళిగంపలా ఉండే స్త్రీలమీద కార్టూనులు వేసారు. ఇప్పుడు మరికొంత ముందుకు పోయి రచయిత్రులమీద వేస్తున్నారు. అయితే ఈ కార్టూను వేసేవారిలో ఆడవారి పేర్లు, భార్యల పేర్లు పెట్టుకొని కార్టూన్లు వేస్తున్నవారు ఎంతమంది లేరు?!

అందుకని రచయిత్రులూ, రచయితలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది!

ధర్మపథం

— బులుసు వేంకటరమణయ్య

అనాసక్తి

పూర్వకాలంలో అడవులలో నివసిస్తూ, కందమూలాలను, పండ్లను ఆహారంగా స్వీకరించి మహర్షులు తపస్సు చేసేవారు. కొందరు కేవలం మోక్షమార్గాన్ని తెలుసుకొని, బ్రహ్మజ్ఞానాన్ని పొంది తరించడానికే తపస్సు చేసేవారు. కొందరు అనితరసాధ్యమైన కార్యాన్ని సాధించవలెననే పట్టుదలతో ఘోరమైన నియమాలతో తపస్సు చేసేవారు. రాజైన విశ్వామిత్రుడు దీనికి ఉదాహరణం.

స్వర్గంలో ఉండేవారికి చీకూ, చింతా ఉండదనీ, ఆకలి దప్పికలు లేవనీ, సుఖమే కాని దుఃఖం ఉండదని ప్రసిద్ధి. అందువల్ల సంసార తాపత్రయం లేని మునులు కూడా కొందరు స్వర్గం కోసమే తపస్సు చేసేవారట! వారికి ముక్తి కంటె స్వర్గమే ప్రధానమేమో!

కాని కింపురుష వర్షంలోని హేమకూట పర్వతంపై ఉన్న కశ్యపప్రజాపతి ఆశ్రమంలోని మునులు మాత్రం నిరూహులట! స్వర్గంలో ఉండే సదుపాయాలన్నీ అక్కడ పుష్కలంగా ఉన్నవి. అయినా ఆ మహర్షులకు అక్కడి సుఖాలను అనుభవించాలనే ఆసక్తి ఎంత మాత్రమూ లేదు. వారికోరిక అంతా ముక్తి మీదనే!

ఈ విషయాన్నే కాళిదాస మహాకవి శాకుంతలంలో ఈ విధంగా వర్ణించాడు—


"ప్రాణా నా మనిలేన వృత్తి రుచితా
సత్కల్పవృక్షే వనే
తోయే కాంచన పద్మరేణు కపిశే
ధర్మాభిషేక క్రియా,
ధ్యానం రత్న శిలాతలేషు విబుధ
స్త్రీ సన్నిధౌ సంయమః
యత్కాంక్షంతి తపోభి రన్య మునయః
తస్మిన్ తపస్యంత్యమీ."


కావలసిన కమ్మని ఆహార పదార్థాలిచ్చే కల్పవృక్షాలున్న తపోవనంలో మునులు వాయుభక్షణచేసి తపస్సు చేస్తున్నారు. బంగారు పద్మాల కమ్మని పుప్పొడిగల నీటిని జలక్రీడకు కాకుండా అభిషేకానికి ఉపయోగిస్తున్నారు. రత్న శిలలపై పడుకొని విశ్రాంతి తీసుకోకుండా, వాటిమీద ధ్యాననిష్ఠులై కూర్చుంటున్నారు. అందకత్తెలైన దేవకన్యలున్నచోట - మనస్సు చలించకుండా ఇంద్రియనిగ్రహంతో ఉంటున్నారు. వీరి తపశ్చర్య ఆశ్చర్యం! ఇతరులైన మునులు ఏ స్వర్గాన్ని కోరుతారో, ఆ స్వర్గసుఖాలున్న చోట ఈ మునులు ఈ విధంగా ఉండడం విచిత్రం అని దీని భావం. అనాసక్తియే ముఖ్యమైనది.




ఈనాటి వనితాలోకం

ఈ శీర్షికను నిలిపివేయాలనుకుంటు న్నాము. కనుక మా పాఠకులు యిక ముందు తమ వ్యాసాలను పరిశీలనార్థం పంపవద్దని మనవి చేస్తున్నాము. ఇంతవరకు అందిన వ్యాసాలను పరిశీలిస్తాము. సం.









ఉత్తరాలు

(6 వ పేజీ తరువాయి)

సీరియల్

29-9-78 నాటి మా అభిమాన సచిత్ర వార పత్రిక ముఖచిత్ర సుందరి "నటి సంగీత" అత్యంత ఆకర్షణీయంగా ఉంది.

"మమత", "జారుడుమెట్లు", "గడ్డిపోచ" కథలు మధురాతి మధురంగా ఉన్నాయి.

ప్రయాగ రామకృష్ణగారి "నగంలో ముగింపు" సీరియల్ కథ ప్రారంభంలోనే మాకు మంచి ఇంటరెస్టు కలిగించింది.

"రాగద్వేషాలు" సీరియల్ ముందు ముందు ఏమవుతుందా అని ఆత్రుతగా ఉంది.


"సామాన్యుని పలుకుడు", "ధర్మపథం" పత్రికకే హైలైట్ శీర్షికలు.

"పాలాజవిడైరి" ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నాము.


"జన ప్రియ" గారు సినిమా వార్తలు చాల చక్కగా అందిస్తున్నారు. కార్టూన్లను ఎక్కువగా ప్రచురించండి.

—న్యాయపతి రమేష్‌బాబు, విజయప్రియ, శ్రీశైల, పుష్పలత, సవిత, సంధ్యాకుమారి, లత, జయప్రద, హేమలత,

(ఐరంపురం.)



Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna


దాసరి నారాయణరావు
విజయ మాధవి పిక్చర్స్
కటకటాల రుద్రయ్య
అన్నపూర్ణ
స్కోప్ ఈస్ట్‌మన్ కలర్
నిర్మాత: వడ్డే శోభనాద్రి నిర్వహణ: వడ్డే రమేష్

ఐటెక్స్

కాటుక & తిలకము



ఐటెక్స్ కాటుక మిశ్రములేని మంచి నూనెతో చేయబడినది. ఐటెక్స్ కాటుకలో యితర మందులు (కెమికల్స్) లేకమైనము ఉండదు. కనుక ఐటెక్స్ కాటుక కండ్లకు ఉపయోగించతగినది మరియు ఐటెక్స్ కాటుక పసిపాపలకు కూడా ఉపయోగింపతగినది.

ఐటెక్స్ తిలకము మంచి వస్తువులతో, రంగులతో చేయబడినది - ఐటెక్స్ తిలకము మన మృధువైన చర్మమునకు ఉపయోగించుటకు సరియైనది - ఐటెక్స్ తిలకము మెరుస్తున్న రంగులలో మనోహరమైన వాసన ద్రవ్యములతో ఉండుటచేత మన అందమును వికశింపజేయును.

EYETEX REGD
KAJAL

ARAVIND LABORATORIES
MADRAS-600 033

AL-TEL 44